

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 157

శనివారం 27-8-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సెమీ ఫైనల్‌లో సాత్విక్‌-చిరాగ్‌

ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌లో కాంస్యం విజయం - 13లో



ఆర్సెలర్‌ చేతికి ఎస్సార్‌ పోర్టులు


రూ.19 వేల కోట్లకు డీల్‌.. హజీరాలో ఎల్‌ఎన్‌జీ టెర్మినల్‌ ఏర్పాటు - 13లో



త్రిసభ్య బెంచ్‌కు 'ఉచిత' విచారణ

ఎన్నికలకు ముందే ప్రకటించే ఉచిత హామీలపై విచారణను సీజేఐ జస్టిస్‌ ఎన్వీ రమణ త్రిసభ్య బెంచ్‌కు అప్పగించారు.

వివరాలు 6లో



బీజేపీ ఎమ్మెల్యేల గెంటివేత

ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో సభను అడ్డుకున్నందుకు 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు గెంటివేశారు.

వివరాలు 6లో



హేమంత్‌ సోరెన్‌పై వేటే!

జార్ఖండ్‌ సీఎం సోరెన్‌ శాసన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ గవర్నర్‌ శనివారం నిర్ణయం ప్రకటించనున్నట్లు రాజ్‌భవన్‌ వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో



రసాయనాలు తాగించి..

సోనాలీ ఫోగాట్‌ తాగే డ్రింక్‌లో ప్రమాదకర రసాయనాన్ని కలిపి బలవంతంగా తాగించి హత్య చేశారని విచారణలో వెల్లడైంది.

వివరాలు 6లో

ప్లాస్టిక్‌ బ్యానర్లు బ్యాన్‌

ఇకపై రాష్ట్రంలో క్లాత్‌ బ్యానర్లు మాత్రమే వాడాలి: సీఎం వైఎస్‌ జగన్‌

- 2027 నాటికి ప్లాస్టిక్‌ రహిత ఏపీ
- ప్లాస్టిక్‌ వ్యర్థాల నియంత్రణకు జీఏఎస్‌పీ, పార్లే సంస్థతో భాగస్వామ్యం.. విశాఖలో ప్లాస్టిక్‌ రీసైక్లింగ్‌, అప్‌ సైక్లింగ్‌ హబ్‌లు
- ప్రపంచంలో తొలిసారిగా ఈ తరహా ప్రాజెక్ట్‌కి శ్రీకారం
- వ్యర్థాలతో ఉత్పత్తుల తయారీకి 10 ఇన్నోవేషన్‌ హబ్స్‌
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు.. 20 వేల మందికి ఉపాధి



సాఫ్ట్‌ స్కిల్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థినికి సర్టిఫికెట్‌ అందజేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా ఇకపై ప్లాస్టిక్‌ బ్యానర్లను నిషేధిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అందరూ క్లాత్‌ బ్యానర్లు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. 2027 నాటికి ప్లాస్టిక్‌ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ దిశగా ప్రజలందరినీ

మిగతా 2వ పేజీలో ▶

> దేశంలోనే రెండో అతిపెద్ద తీర ప్రాంతం 975 కి.మీ. పొడవు కలిగి ఉన్న మన రాష్ట్రంలో విశాలమైన ఇసుక బీచ్‌లు, వన్య మృగాలు, పక్షుల కేంద్రాలున్నాయి. రాష్ట్ర పౌరులుగా తీర ప్రాంతాన్ని పరిరక్షించుకోవడం మనందరి విధి. ప్లాస్టిక్‌ వ్యర్థాలు లేని సముద్రాలు మన లక్ష్యం కావాలి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

మైక్రోసాఫ్ట్‌.. మొదటిసారి

- 1.62 లక్షల మంది ఏపీ విద్యార్థులకు సాఫ్ట్‌ స్కిల్స్‌లో శిక్షణ.. ప్రపంచంలో ఇదే ఫస్ట్‌
- మైక్రోసాఫ్ట్‌ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో నైపుణ్య శిక్షణ ఇదే ప్రథమం

2లో

బాబు 'అప్పు'డే లెక్క తప్పారు

- చంద్రబాబు హయాంలో అనుమతికి మించి అప్పులు.. చివరి మూడేళ్లలో రూ.17,932 కోట్లు అనుమతికి మించి అప్పు
- ఇవే ఇప్పుడు రాష్ట్రానికి శాపం
- అయినా దొంగే.. దొంగా.. దొంగా.. అన్నట్లు దుష్టచతుష్టయం గగ్గోలు
- ఆ అప్పులను ఇప్పుడు తగ్గిస్తామంటున్న కేంద్రం
- అలా చేస్తే సర్కారు కార్యక్రమాలపై ప్రభావం
- 14వ ఆర్థిక సంఘం కాలంలోనే ఆ అప్పులను క్రమబద్ధీకరించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- ఇప్పుడు మినహాయింపు సమంజసం కాదని వినతి

2లో

న్యూస్‌రీల్‌

ఇక కుప్పంలోనే ఉంటా



'ఏం జగన్‌రెడ్డి ఎక్కడున్నావు? నేనిక్కడే ఉంటా..రౌడీలను తెస్తావో..పుంగనూరు పుడింగుతో వస్తావో? మా వాళ్లలో ఒకరిపై చేయివేసి తిరిగివెళ్ల చూద్దాం' అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు కుప్పంలో సవాళ్లు విసిరారు.

వివరాలు 14లో ▸

అక్కడ వైఎస్సార్‌సీపీదే గెలుపు




కుప్పం కూలుతోందనే భయం చంద్రబాబుకు పట్టుకుందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో టీడీపీ జెండాను ప్రజలు పీకేస్తారని, అక్కడ వైఎస్సార్‌సీపీ గెలవడం తథ్యమని అన్నారు.

వివరాలు 14లో ▸

- కాంగ్రెస్‌కు భారీ షాక్‌..

ఆజాద్‌ గుడ్‌ బై

50 ఏళ్ల అనుబంధానికి తెర



- రాహుల్‌పై నిప్పులు, సోనియాకు లేఖ
- అపరిపక్వత, సీనియర్లను గౌరవించడు
- తొత్తుల పాలనతో పార్టీని నాశనం చేశాడు
- ఆయన వల్లే అధికారానికి దూరమయ్యాం
- అలాంటి వ్యక్తి నేతృత్వంలో పనిచేయలేను
- 'కాంగ్రెస్‌ జోడో'పై దృష్టి పెట్టాలని హితవు
- ఏడాదిలో 15 మందికి పైగా సీనియర్ల నిష్క్రమణ

- వివరాలు 6లో

న్యాయవ్యవస్థను బలోపేతం చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ఎన్వీ రమణ పిలుపు

- కేంద్రం, బార్‌ బెంచ్‌లు చొరవ తీసుకోవాలి
- న్యాయ వ్యవస్థను భారతీయీకరణ చేయాలి
- జస్టిస్‌ ఎన్వీ రమణకు సుప్రీం బార్‌ అసోసియేషన్‌ వీడ్కోలు
- నూతన సీజేఐగా జస్టిస్‌ యు.యు.లలిత్‌ నేడు ప్రమాణం

6లో



వీడ్కోలు సభలో జస్టిస్‌ ఎన్వీ రమణకు జ్ఞాపికను అందజేస్తున్న సుప్రీంకోర్టు బార్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ వికాస్‌ సింగ్‌. చిత్రంలో జస్టిస్‌ లలిత్‌


విశాఖలోని సిరిపురం ఏయూ కాన్వొకేషన్ హాల్‌లో మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు

మైక్రోసాఫ్ట్.. మొదటిసారి

- 40 కోర్సుల్లో శిక్షణ.. తొలివిడతలో 35,980 మందికి సర్టిఫికెట్లు ప్రదానం
- శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగావకాశాల కోసం లింక్డిన్ సహకారం
- 1.15 లక్షల మంది విద్యార్థులకు 13 కంపెనీలతో ఇంటర్న్‌షిప్ మ్యాపింగ్
- ప్రపంచంలో అన్ని సంస్థలూ మన విద్యార్థుల వైపు చూసే రోజు రావాలి: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రపంచంలోనే తొలిసారిగా మైక్రోసాఫ్ట్ ద్వారా 1.62 లక్షల మంది ఏపీ విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మైక్రోసాఫ్ట్ చరిత్రలోనే ఇంత మందికి శిక్షణ అందించలేదన్నారు. ఉద్యోగాలను సాధించడంతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకునేలా పాఠ్య ప్రణాళికలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. దేశంలో మొదటిసారిగా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. శుక్రవారం విశాఖలోని సిరిపురం ఏయూ కాన్వొకేషన్ హాల్‌లో మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొన్నారు. మొదటి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న 35,980 మందికి ధృవపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సాఫ్ట్‌స్కిల్స్‌లో కొత్త అధ్యాయం..

మైక్రోసాఫ్ట్ ద్వారా 1.62 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ అందించనుండటం ఇదే మొదటిసారి. మైక్రోసాఫ్ట్ చరిత్రలో ఏ దేశంలోనూ ఇంత భారీ స్థాయిలో శిక్షణ ఇవ్వలేదు. ఇప్పటికే శిక్షణ పూర్తైన విద్యార్థులకు, నవంబర్‌లో పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు అభినందనలు. సాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇది సరికొత్త అధ్యాయం. ఉద్యోగాల సాధనే ధ్యేయంగా నైపుణ్యాలను పెంచేలా పాఠ్య ప్రణాళికను తీర్చిదిద్దాం. సర్టిఫైడ్ కోర్సులను అందిస్తున్నాం. డిగ్రీలు పొందినా ఉద్యోగాలు వస్తున్నాయా? లేదా అని ప్రశ్నించుకోవాలి. అందుకే మైక్రోసాఫ్ట్ సంస్థతో అడుగులు వేశాం. ప్రపంచంలో అన్ని సంస్థలూ మన విద్యార్థుల వైపు చూసే రోజు రావాలని ఆకాంక్షిస్తున్నాం.

40 భిన్న కోర్సుల్లో..

పట్టా పుచ్చుకున్న ప్రతి విద్యార్థీ పూర్తి స్థాయి నిపుణుడిగా మారి ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 40 విభిన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ జారీ చేసేందుకు మైక్రోసాఫ్ట్ ముందుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఎనలిటిక్స్, నెట్‌వర్కింగ్, వెబ్ డిజైనింగ్, ఐవోటీ తదితర కోర్సుల్లో శిక్షణ అందించింది. ఉద్యోగాల సాధనకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక విద్యార్థి దాదాపు రూ.30 వేలు ఖర్చు చేస్తే కానీ పొందలేని ఈ శిక్షణ వ్యయాన్ని ప్రభుత్వమే భరించి ఉచితంగా అందచేశాం. మైక్రోసాఫ్ట్ కూడా చాలా ఉదారంగా ముందుకు వచ్చింది. రూ.465 కోట్ల విలువైన శిక్షణను కేవలం రూ.32 కోట్లకు అందించేందుకు అంగీకరించింది. ఈ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించడంతో పిల్లలు ఉచితంగా శిక్షణ అందుకున్నారు. కేవలం శిక్షణ ఇచ్చి ధృవపత్రాలు అందించడంతోనే సరిపెట్టుకోలేదు. వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కూడా అడుగులు వేశాం. మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద జాబ్ పోర్టల్ సంస్థ లింక్డిన్‌తో జతకట్టాం. సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులకు జాబ్‌లు కూడా సెర్చ్ చేసి సలహాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు...

ప్రాథమికవిద్య నుంచి ఇంగ్లిషు మీడియంను ప్రవేశపెట్టాం. అమ్మఒడి, మనబడి నాడు–నేడు, విద్యాకానుక, గోరుముద్ద, సంపూర్ణ పోషణ లాంటి పథకాలు అందిస్తున్నాం. ఉన్నతవిద్యని ప్రోత్సహించేందుకు విద్యాదీవెన, వసతిదీవెన కార్యక్రమాలు చేపట్టాం. విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి విదేశీదీవెన అందిస్తున్నాం. చదువుకునేవారికి ఈ ప్రభుత్వం అన్నిరకాలుగా సహాయ, సహకారాలు అందిస్తోంది. విప్లవాత్మక మార్పులను విద్యారంగంలో తెచ్చాం. పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. 10 నెలల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాం. బీటెక్ ఆనర్స్ లాంటి కోర్సులను అందిస్తున్నాం. పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా శిక్షణ అందిస్తున్నాం. డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఇండస్ట్రియల్ ఓరియంటేషన్, డ్యుయల్ డిసిప్లినరీ సర్టిఫికేషన్ కోర్సులు, స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టాం. దేశంలో తొలిసారిగా నాలుగేళ్ల ఆనర్స్ అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌ని తెచ్చాం. ఆన్‌లైన్ లెర్నింగ్ ద్వారా మేనేజ్‌మెంట్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ లెర్నింగ్ కోసం 2,500 వీడియోలు, 450 ఆడియో పోడ్‌కాస్ట్‌లు ఇందులో పొందుపరిచాం.

13 కంపెనీలతో మ్యాపింగ్..

విద్యాసంస్థలను పరిశ్రమలతో అనుసంధానించేలా ఉన్నత విద్యకు సంబంధించి ఒక పోర్టల్‌ని ప్రారంభించాం. ఇందులో ఇప్పటి వరకూ 1,65,341 మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారు. నాస్కామ్, మార్క్‌బ్రిడ్జి, ఎడ్యుస్కిల్స్‌తో ఒప్పందాలు చేసుకున్నాం. వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు చేపడుతున్నాం. ఇప్పటి వరకూ 1.15 లక్షలమంది విద్యార్థుల్ని 13 కంపెనీలతో ఇంటర్న్‌షిప్‌కు మ్యాపింగ్ చేశాం. బాగా చదువుకుంటేనే పేదరికం నుంచి బయటకు వస్తారనే తాపత్రయంతో ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పుడున్న కరిక్యులమ్ జాబ్ ఓరియంటెడ్‌గా ఉందా లేదా? అనే విషయంపై సీఎం స్థాయి నుంచి కిందిస్థాయి వరకూ మనసు పెట్టి ఆలోచన చేస్తున్నాం. రాష్ట్రంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌రేషియో (జీఈఆర్) మారాలి. 18 నుంచి 23 సంవత్సరాల్లోపు పిల్లలు ఎంతమంది కాలేజీల్లో అడుగు పెడుతున్నారనేది బ్రిక్స్ దేశాలతో పోల్చి చూస్తుంటాం. దురదృష్టమేంటంటే అది మన దేశంలో 26 శాతమే ఉంది. మిగిలినవారు కాలేజీల్లో ఎందుకు చేరడం లేదని పరిశీలన చేస్తే ఆర్థిక భారం కారణంగా కాలేజీల్లో అడుగులు పడటం లేదని తెలిసింది. పిల్లల్ని చదివించేలా తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ అన్ని రకాలుగా తోడుగా నిలుస్తున్నాం. ఈరోజు మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ ద్వారా దాదాపు 36 వేలమంది పిల్లలకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెరుగుపడటం శుభపరిణామం.

ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీష్..

ఇంగ్లీష్ మీడియం లేకపోతే పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గుకు రాలేరని ప్రాథమిక విద్య నుంచి కూడా ఇంగ్లీష్ మీడియం పెట్టాం. తల్లులను చైతన్యం చేసేందుకు అమ్మ ఒడి తీసుకొచ్చాం. మన బడి.. నాడు–నేడుతో మెరుగైన మౌలిక సదుపాయాల్ని సమకూర్చాం. విద్యా కానుక కింద వారికి కావాల్సినవన్నీ సమకూర్చాం. గోరుముద్ద, సంపూర్ణ పోషణతో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యవరకూ పిల్లల్ని చేయిపట్టి నడిపిస్తూ అడుగులు వేస్తున్నాం. ఇంటర్‌తో ఆగిపోకుండా ప్రతి విద్యార్థీ పై చదువులు చదవాలని ఉద్దేశంతో విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను తెచ్చాం. ప్రతి త్రైమాసికంలో విద్యా దీవెన ఇస్తున్నాం. ఏటా క్రమం తప్పకుండా రెండుసార్లు వసతి దీవెన అందిస్తున్నాం. ఇవన్నీ ఒకవైపు చేస్తూనే పాఠ్యప్రణాళికలో రూపు రేఖలు మారుస్తున్నాం.

అందరికీ సమాన అవకాశాలు



నేను బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేశా. చాలామంది నాకు ట్రెనింగ్ ఇవ్వరని అన్నారు. కానీ నాకు శిక్షణ ఇచ్చారు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు సర్. ఆర్థిక స్థోమత కారణంగా విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకున్న గొప్ప ముఖ్యమంత్రిగా మీరు చరిత్రలో నిలిచిపోతారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన లాంటి పథకాల ద్వారా ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకూ ఎక్కడా బ్రేక్ లేకుండా చదువు కొనసాగించేలా ఆలోచన చేయడం నిజంగా గ్రేట్ లీడర్‌కే సాధ్యం.

– లిఖిత నెక్కంటి, బీఎస్సీ స్టాటిస్టిక్స్ విద్యార్థిని

ముఖ్యమంత్రి తపనతో బృహత్తర కార్యక్రమం

ప్రపంచవ్యాప్తంగా మన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ ఈ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మైక్రోసాఫ్ట్ ఎక్కడా ఇంత పెద్ద స్థాయిలో శిక్షణ అందించలేదు. శిక్షణకు అయిన ప్రతి పైసానూ ప్రభుత్వమే భరించింది. గత అక్టోబర్‌లో ట్రెనింగ్ ప్రారంభమైంది. పోటీని తట్టుకొని ప్రపంచాన్ని శాసించేస్థాయికి మన విద్యార్థులు ఎదగాలి.


– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

ప్రపంచంలోనే అతి పెద్ద స్కిల్లింగ్ ప్రోగ్రామ్

రాష్ట్ర ప్రభుత్వంతో వేసిన అడుగులు చరిత్రాత్మకం. ఇంత గొప్ప కార్యక్రమానికి మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల రాలేకపోయారు. కానీ సందేశం పంపించారు. కెరీర్‌లో అద్భుతమైన దిశగా పయనించేందుకు ఏపీ విద్యార్థులు శిక్షణ తీసుకోవడం చాలా ఉద్వేగంగా ఉంది. డేటా సైన్స్, బిజినెస్, ఇతర కీలక అంశాలకు సంబంధించి శిక్షణ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. 35,980 మంది విద్యార్థులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. లింక్డిన్ సపోర్ట్‌తో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాం.

– నవ్‌తేజ్ బాల్, మైక్రోసాఫ్ట్ ఇండియా హెడ్

బాబు 'అప్పు'డే లెక్క తప్పారు



సాక్షి, అమరావతి: ఆర్థిక వ్యవహారాల్లో గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పులు ఇప్పుడు రాష్ట్రానికి శాపాలుగా పరిణమించాయి. అప్పట్లో బాబు ప్రభుత్వం పరిమితికి మించి చేసిన అప్పులు ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక అవసరాలకు అడ్డు పడుతున్నాయి. రాష్ట్ర భవిష్యత్తును ఏమాత్రం పట్టించుకోకుండా చివరి మూడేళ్లు ఆ ప్రభుత్వం అప్పులు తెచ్చింది. అందులోనూ కేంద్రం ఇచ్చిన అనుమతికి మించి అప్పులు తెచ్చింది. అప్పట్లో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన చంద్రబాబు, ఆయన తానా అంటే తందానా అనే దుష్ట చతుష్టయం అప్పులపై గగ్గోలు పెడుతున్నాయి. వీరి వ్యవహారంపై ఆర్థిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దొంగే.. దొంగా దొంగా అని అరిచినట్లు ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు.. కేంద్రం ఇచ్చిన అనుమతికి మించి అప్పులు చేశారు. ఇప్పుడు ఆ అప్పులు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం చివరి మూడు ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతికి, 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు మించి ఏకంగా రూ.17,932.94 కోట్లు ఎక్కువగా అప్పు చేసింది. బాబు హయాంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూడు శాతానికి మించి అప్పులు చేయరాదని 14వ ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పాయి. అయితే చంద్రబాబు ప్రభుత్వం హయాంలో ఏ ఆర్థిక సంవత్సరంలోనూ 3 శాతానికి లోపు అప్పులను పరిమితం చేయలేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.95 శాతం నుంచి 4.52 శాతం వరకు ఎక్కువగా అప్పులు చేశారు. 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం పరిమితికి మించి ఏకంగా రూ.8,204.13 కోట్లు అప్పు చేసింది. అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అనేక సమయాల్లో వచ్చే ప్రభుత్వానికి అప్పులు కూడా పుట్టకుండా మేమే అప్పులు చేశామని చెప్పడం కూడా అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇలా చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పులను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సర్దుబాటు చేస్తామని, ఆ మేర ఇప్పుడు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అప్పులను తగ్గిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో నిబంధనల మేరకు, అనుమతి మేరకు తీసుకోవాల్సిన అప్పుల్లో కోతపడుతోంది. దీని ప్రభావం ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై పడుతోందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. బాబు ప్రభుత్వం తీసుకున్న అప్పులను ఇప్పటి అప్పుల్లో మినహాయిస్తే బడ్జెట్ వ్యయానికి కూడా నిధులు తగ్గిపోతాయని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. చంద్రబాబు హయాంలో పరిమితికి మించి చేసిన అప్పులను 14వ ఆర్థిక సంఘం కాలవ్యవధిలోనే క్రమబద్ధీకరించాలని, 15వ ఆర్థిక సంఘం కాల వ్యవధిలో క్రమబద్ధీకరించవద్దని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రస్తుతం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 4.5 శాతం మేర అప్పులు చేయడానికి అనుమతి ఉంది. అయితే అప్పట్లో చంద్రబాబు సర్కారు చేసిన అధిక అప్పులు ఇప్పుడు రాష్ట్రానికి గుదిబండలా మారాయి.

ప్లాస్టిక్ బ్యానర్లు బ్యాన్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, పార్లే ఫర్ ది ఓషన్స్ ప్రతినిధులు


ప్లాస్టిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి తయారుచేసిన బూటును చూపిస్తున్న ముఖ్యమంత్రి జగన్


ప్లాస్టిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి తయారుచేసిన కళ్లద్దాలను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

భాగస్వాములను చేసి అవగాహన పెంపొందించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్, అప్ సైక్లింగ్‌తో సాగరతీర ప్రాంతాల పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'పార్లే ఫర్ ది ఓషన్స్'తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) సందర్భంగా శుక్రవారం విశాఖలో సీఎం జగన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా ప్లాస్టిక్ నియంత్రణ కోసం ఒప్పందం చేసుకున్నామని, తద్వారా విశాఖలో పార్లే ఫ్యూచర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు కానుందని తెలిపారు. మూడు దశల్లో రాష్ట్రంలో రూ.16 వేల కోట్ల పెట్టుబడులతో (2 బిలియన్ డాలర్లు) 20 వేల మందికి ఉపాధి కల్పించేలా పార్లే సూపర్ హబ్, రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ యూనిట్లు ఏర్పాటవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా విశాఖ బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. పార్లే సంస్థ ప్లాస్టిక్ నుంచి తయారు చేసిన వివిధ ఉత్పత్తులను (బూట్లు, కళ్లద్దాలు, టీ షర్టులు) సీఎం పరిశీలించారు. ఎంవోయూపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ సీఈవో సిరిల్ గచ్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

దారంతా ఫ్లెక్సీలే...!

విశాఖ విమానాశ్రయం నుంచి కారులో వస్తుంటే దారిపొడవునా నా ఫొటోలతో ఫ్లెక్సీలు కనిపించాయి. ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమానికి వెళ్తూ ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ప్రజలకు తప్పుడు మెసేజ్ పంపించినట్లు అవుతుందని కలెక్టర్ మల్లికార్జునకు చెప్పా. అయితే అవి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు కాదని, క్లాత్‌తో తయారైనవని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీకి రూ.8 ఖర్చయితే.. క్లాత్‌కు రూ.32 ఖర్చవుతుందన్నారు. ఎవరైనా ఫ్లెక్సీలు పెట్టాలనుకుంటే కాస్త ఖర్చు ఎక్కువైనా క్లాత్‌తో తయారైనవే ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో ప్లాస్టిక్ నిర్మూలనలో తొలి అడుగు వేస్తున్నాం. ఇప్పటికే తిరుమలను ప్లాస్టిక్ రహితంగా చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

- ముఖ్యమంత్రి జగన్

అతిపెద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమం..

పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థకు చెందిన సిరిల్, గ్లోబల్ అలయన్స్ సహకారంతో రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేసేలా ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఈ రోజు ఎప్పటికీ గుర్తుంటుంది. బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న విశాఖ ప్రజలకు అభినందనలు. గోకుల్ బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు 28 కి.మీ. పరిధిలో 40 ప్రాంతాల్లో సుమారు 22 వేల మంది ప్రజలు పాల్గొని 76 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం గొప్ప విషయం. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమం. ఈ సామాజిక స్ఫూర్తి చాలా అద్భుతం. అదే విశాఖను ప్రత్యేక నగరంగా నిలబెట్టింది.

అటు పర్యావరణం.. ఇటు ఆర్థికం

నాణేనికి రెండు వైపులా అన్నట్లు ఒకవైపు పర్యావరణం, మరోవైపు ఆర్థిక వ్యవస్థ రెండూ కీలకం. పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే మనకు మనుగడ లేదు. సుస్థిరత, సమగ్రత మన ప్రధాన లక్ష్యాలు. స్వల్పకాలిక లక్ష్యాల కోసం రాజీపడితే దీర్ఘకాలిక మనుగడ సాగించలేం. అందుకే మన ప్రభుత్వం మానవ, ఆర్థిక వనరులతో సుస్థిర ప్రగతి కోసం కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం 'క్లాప్' (క్లీన్ ఏపీ – జగనన్న స్వచ్ఛ సంకల్పం) కార్యక్రమాన్ని గతేడాది అక్టోబరు 2న ప్రారంభించింది. 4,097 చెత్త సేకరణ వాహనాలను అందచేసింది. గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా ఈ కార్యక్రమాలను ప్రారంభించడంతో చెత్త సేకరణ 22 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. వంద శాతం సేకరణ లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం.

సాగరాన్ని కాపాడుకుందాం..

భూమి మీద ఆక్సిజన్‌లో 70 శాతం సముద్ర మొక్కల నుంచే లభిస్తోంది. రెయిన్ ఫారెస్ట్ నుంచి కేవలం 28 శాతం ఆక్సిజన్ మాత్రమే వస్తుంది. మెరైన్ ప్లాంట్స్‌లో ఫైటో ప్లాంక్టన్, కెల్ప్, ఆల్గల్ ప్లాంక్ట్ లాంటి మొక్కలు కిరణజన్య సంయోగ ప్రక్రియతో ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఫైటో ప్లాంక్ట్‌లో ముఖ్యమైనదైన ప్రోక్లోరో కాకస్ వాతావరణంలోకి అత్యధికంగా ప్రాణ వాయువును ఉత్పత్తి చేస్తోంది. సముద్రంలోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు నానాటికీ పెరుగుతూ విస్తరిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మత్స్య సంపద, సముద్ర పక్షులు, సముద్ర క్షీరదాలు లాంటి దాదాపు 267 జాతులకు ముప్పు వాటిల్లుతోంది.

రూ.16 వేల కోట్లు.. 20 వేల మందికి ఉపాధి

సముద్రతీరంతో పాటు సాగర గర్భంలో కూడా ప్లాస్టిక్ కనిపిస్తోంది. దీనికి స్థిరమైన పరిష్కారం దిశగా తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది. గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ వర్క్స్ (జీఏఎస్‌పీ), పార్లే ఫర్ ది ఓషన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యమైంది. భాగస్వాములను ఎంపిక చేయడం, ఆర్థిక వనరులను సమకూర్చడంలో గ్లోబల్ అలయన్స్ సంస్థ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ ఒప్పందంలో భాగంగా విశాఖలో పార్లే ఫ్యూచర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు కానుంది. ఇది దేశానికే కాకుండా ప్రపంచానికే దిక్సూచిగా నిలుస్తుంది. అత్యాధునిక పద్ధతుల్లో కొత్త మెటీరియల్ కనుగొనడానికి సంబంధించిన పరిశోధన ఇక్కడ జరుగుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో బూట్లు, అద్దాలు లాంటి మెటీరియల్ తయారు చేసే రీసైక్లింగ్, అప్ సైక్లింగ్ హబ్ ఏర్పాటవుతుంది. వ్యర్థాలతో ఉత్పత్తుల తయారీకి 10 ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటవుతాయి. వీటిద్వారా ఆరేళ్లలో రూ.16 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయి. స్థానికంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

హామీలను నెరవేరుస్తున్న నాయకుడు

ఇది ఆరంభం మాత్రమే. లక్ష్యాన్ని చేరుకోవాలంటే చాలా కష్టపడాలి. అది సాకారమైతే ప్రపంచంలోనే ప్లాస్టిక్ రహిత తొలి రాష్ట్రంగా ఏపీ ఆవిర్భవిస్తుంది. 2027 నాటికి సాధించేలా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌కు అభినందనలు. పలు దేశాల్లో ఎంతో మంది రాజకీయ నేతలను కలిశాం. అందరూ అనేక హామీలిచ్చి మర్చిపోవడాన్ని చూశా. ముఖ్యమంత్రి జగన్ మాత్రమే ఇచ్చిన హామీలను అమలు చేయడాన్ని చూస్తున్నాం.

– సత్య ఎస్ త్రిపాఠి, జీఏఎస్‌పీ సెక్రటరీ జనరల్

కీలక ఘట్టం

చాలా ముఖ్యమైన సందర్భమిది. నేను భారత్‌కు రాకపోతే కీలక ఘట్టాన్ని మిస్ అయ్యేవాడిని. పర్యావరణం ప్రమాదంలో ఉందంటూ అనేక దేశాల ముఖ్యులు రోజుల తరబడి చర్చించడం, భారీగా నిధులు వెచ్చించినా పూర్తి స్థాయిలో విజయవంతం కాలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జరిగిన సమావేశం చాలా భిన్నంగా అనిపించింది. సీఎం సమక్షంలో అధికార యంత్రాంగం కేవలం రెండు గంటల్లోనే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసింది. భవిష్యత్తులో వ్యర్థాల నిర్మూలనలో విశాఖ నంబర్ వన్ స్థానంలో ఉంటుంది. వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా మానవ జీవనానికి అవసరమయ్యే వస్తువులను తయారు చేసుకోవచ్చు. ఆరేళ్ల పాటు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పనిచేస్తే ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దగలం. మరో పదేళ్లలో ప్లాస్టిక్ కనిపించదు. ప్రపంచంలోనే ఇది ఒక విప్లవాత్మక మార్పుగా పరిణమించనుంది.

– సిరిల్ గచ్, పార్లే ఫర్ ది ఓషన్స్ సీఈవో

కాన్వాయ్ ఆపి.. గోడు విని..

విశాఖలో వివాహితకు, దంపతులకు సీఎం జగన్ భరోసా


సీఎం జగన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న త్రివేణి

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. విశాఖ పర్యటనలో భాగంగా గురువారం నగరానికి వచ్చిన ఆయన.. సిరిపురం ఏయూ కాన్వొకేషన్ హాల్‌లో జరిగిన మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ నుంచి మ.1.10 గంటలకు విమానాశ్రయానికి బయల్దేరారు. కాన్వాయ్ సిరిపురం జంక్షన్ దాటుతుండగా.. ముగ్గురు అక్కాచెల్లెళ్లు చంటిపిల్లలతో ముందుకు వచ్చి.. జగనన్నా, జగనన్నా అంటూ బిగ్గరగా అరిచారు. వెంటనే సీఎం జగన్ తన కాన్వాయ్‌ని ఆపి బయటకు దిగి వారిని రమ్మని పిలిచారు. వారంతా సీఎం వద్దకు చేరుకున్నారు. తన పేరు ధర్మాల త్రివేణి అని.. తన భర్త అప్పలరెడ్డిని నెలన్నర క్రితం పెదవాల్తేరులో రూ.500 కోసం చంపేశారని.. పెద్ద దిక్కు కోల్పోయామన్నారు. పిల్లలతో కుటుంబ పోషణ కష్టమవుతోందని.. ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. సీఎం దానిని తీసుకుని తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి తమ విన్నపాన్ని సానుకూలంగా విన్నారంటూ వారు ఉద్వేగానికి లోనయ్యారు.

చిన్నారులకు వైద్యంపై కలెక్టర్‌కు ఆదేశం

అదే సమయంలో.. శ్రీకాకుళం జిల్లా డీఆర్ వలస గ్రామానికి చెందిన కూలీలు పాండ్రంగి రామారావు, సుబ్బలక్ష్మి దంపతులు కూడా తమ ఇద్దరి కుమారుల కష్టాన్నీ సీఎంకు విన్నవించుకున్నారు. వారిద్దరూ సికిల్‌సెల్ థలసేమియాతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీంతో సీఎం జగన్ స్పందిస్తూ.. చిన్నారులకు సరైన వైద్యం చేయించాలంటూ అక్కడికక్కడే కలెక్టర్‌ను ఆదేశించారు.

ప్రఖ్యాత కంపెనీలకు పార్లే ఉత్పత్తులు..

అందమైన బ్యాగుల నుంచి షూస్, కంటి అద్దాల వరకూ రీసైకిల్డ్ ప్లాస్టిక్ నుంచే తయారవుతున్నాయి. పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ వీటిని తయారు చేస్తోంది. ఈ సంస్థకు ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, లూయిస్ విట్టన్ ఆడిడాస్, అమెరికా ఎక్స్‌ప్రెస్ లాంటి కంపెనీలతో వ్యాపార అనుబంధం ఉంది. వారికి కావాల్సిన ఉత్పత్తులను పార్లే సంస్థ తయారు చేసి అందచేస్తోంది. రీ సైక్లింగ్, అప్ సైక్లింగ్‌లోకి చాలా ఎంఎన్‌సీలు వస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్, గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ (జీఏఎస్‌పీ) సెక్రటరీ జనరల్ సత్య ఎస్ త్రిపాఠి, పార్లే ఫర్ ది ఓషన్స్ సీఈవో సిరిల్ గచ్‌తో పాటు అందరికీ హృదయపూర్వక అభినందనలు.

హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, ఆదిమూలపు సురేష్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, జీవీఎంసీ మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై పెయింటింగ్ కళాకారుల హర్షం

హైదరాబాద్: ఏపీలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధిస్తూ ఆదేశాలిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు పెయింటింగ్ కళాకారుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చిత్రకారుడు రాము నాగార్జున శుక్రవారం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ చిత్రపటాన్ని గీసి తన అభిమానాన్ని చాటుకున్నారు. నాగార్జున మాట్లాడుతూ.. 'ఫ్లెక్సీలవల్ల మా కళాకారులు అందరూ ఉపాధిని కోల్పోయి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. మా కళాకారులకు బ్యానర్లు రాయించేవాళ్లు సైన్ బోర్డులు రాయించేవాళ్ళు లేక ఇతర కూలీపనులకు వెళ్లాల్సి వస్తుంది. మేము ఫ్లెక్సీలను బ్యాన్‌చేయాలని ఎప్పటినుంచో పోరాడుతున్నాం. ఇన్నిరోజుల తర్వాత ఇప్పటికైనా మంచి నిర్ణయాన్ని తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు' అని అన్నారు.

క్లుప్తంగా

కుప్పం ఎంపీపీపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- లోకల్ గవర్నమెంట్ చాంబర్

సాక్షి, అమరావతి: కుప్పం ఎంపీపీ అశ్వినిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడాన్ని లోకల్ గవర్నమెంట్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు శుక్రవారం ఖండించారు. చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా ఎంపీపీపై ఆమె కార్యాలయంలోనే రాళ్లతో దాడి చేసి గాయపర్చడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- గృహ నిర్మాణ శాఖ అధికారులకు మంత్రి జోగి రమేష్ ఆదేశం



సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద వైఎస్సార్, జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై మంత్రి శుక్రవారం విజయవాడలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 2023, డిసెంబరులోపు 30 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కాలనీల్లో నీరు, విద్యుత్, రహదారి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించి లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.కమలాకరబాబు, చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్, 26 జిల్లాల పీడీలు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో రైతుకు ఎంతో మేలు

ఈ వ్యవస్థను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలి.. ఈ-క్రాప్, ఈ-కేవైసీ, బ్యాంకింగ్ సేవలు అద్భుతం

- రాష్ట్రాలకు సూచించిన నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్
- ఢిల్లీలో జాతీయస్థాయి వ్యవసాయాధికారుల సమావేశం
- ఆర్బీకేలపై వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- పలు రాష్ట్రాల అధికారులను ఆకట్టుకున్న ఆర్బీకే వ్యవస్థ
- తమ రాష్ట్రాల్లోనూ అమలు చేస్తామని వెల్లడి



వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో పాల్గొన్న రమేష్ చంద్, పూనం మాలకొండయ్య

సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో రైతులకు సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ఆదర్శనీయమని, వాటిని అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త డాక్టర్ రమేష్ చంద్ చెప్పారు. ఢిల్లీలోని నీతి ఆయోగ్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ స్థాయిలో వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. నీతి ఆయోగ్ ఆహ్వానం మేరకు ఈ సమావేశానికి హాజరైన ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు, దాని ఆవశ్యకత, అందిస్తున్న సేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పౌర సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రతి రెండువేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారని, వాటికి అనుబంధంగా గ్రామస్థాయిలో రైతుల కోసం ఆర్బీకే వ్యవస్థను తీసుకొచ్చామని పూనం మాలకొండయ్య వివరించారు. రాష్ట్రంలో 10,778 ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి ఇన్‌పుట్స్‌ను రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు. వీటిని నాలెడ్జ్ హబ్‌లుగా, వన్‌స్టాప్ సెంటర్లుగా కూడా తీర్చిదిద్దామని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులతోపాటు ఆక్వా, పాడి రైతులకు కూడా ఆర్బీకేలు సేవలందిస్తున్నాయని తెలిపారు. పొలంబడులు, తోట, పట్టు, పశువిజ్ఞాన, మత్స్య సాగుబడుల ద్వారా రైతులకు శిక్షణ ఇస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నట్లు చెప్పారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ ద్వారా వాస్తవ సాగుదారులకే ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ ఫలాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందిస్తున్నామన్నారు. స్పెషల్ సీఎస్ చెప్పిన ప్రతి విషయాన్ని ఆసక్తిగా విన్న వివిధ రాష్ట్రాల అధికారులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆర్బీకే విధానం తమ రాష్ట్రాల్లో అమలుకు కృషి చేస్తామని ప్రకటించారు. త్వరలోనే ఏపీలో పర్యటించి క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. అనంతరం రమేష్ చంద్ మాట్లాడుతూ.. తాను స్వయంగా ఆర్బీకేలను పరిశీలించానని, వాటి సేవలు బాగున్నాయని తెలిపారు. వీటిని తప్పనిసరిగా అన్ని రాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేయాలన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ సేవలు అద్భుతమని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రమోద్, ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

కార్మికులకు మా సహకారం ఎప్పుడూ ఉంటుంది



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యేలా చర్యలు
- దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ వారికి ఉండాలి
- కార్మిక చట్టాల బలోపేతానికి ఈ సదస్సు ఉపయోగం
- జాతీయ కార్మిక సదస్సులో వర్చువల్ విధానంలో ప్రసంగించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి అమరావతి/తిరుపతి అర్బన్: కార్మికులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో జాతీయ కార్మిక సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మాట్లాడారు. తిరుపతి బాలాజీ సన్నిధిలో ఎంతో ముఖ్యమైన జాతీయ కార్మిక సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేవుడి ఆశీస్సులు కార్మికులకు ఎప్పుడూ నిండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. పారిశ్రామికవేత్తలకు, కార్మికులకు మేలు చేసేలా కార్మిక చట్టాల రూపకల్పన, బలోపేతంలో ఈ సదస్సు ద్వారా చేసిన మేధోమథనం ఉపయోగపడుతుందని చెప్పారు. రెండు రోజులుగా ఈ సదస్సులో చర్చించిన అంశాలు కార్మిక చట్టాల పటిష్టతకు మరింతగా ఉపయోగపడతాయని భావిస్తున్నానన్నారు. కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సుతో కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. తిరుపతిలో జాతీయ కార్మిక సదస్సును నిర్వహించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరో కేంద్ర మంత్రి రామేశ్వర్, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్మిక శాఖ మంత్రులకు, కార్యదర్శులకు, కమిషనర్లకు, సదస్సుకు హాజరైనవారందరికీ సీఎం వైఎస్ జగన్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కాగా, సీఎం వైఎస్ జగన్ వర్చువల్ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా అదే జోరు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో శుక్రవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవిస్తున్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



ఏలూరు 35వ డివిజన్‌లో వృద్ధుడికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కర్నూలు జిల్లా కౌతాళం మండలం మదిరె గ్రామంలో అవ్వకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

శ్రీశైలానికి 1.33 లక్షల క్యూసెక్కుల వరద

- సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

శ్రీశైలం ప్రాజెక్ట్/ విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం సాయంత్రానికి 1,33,101 క్యూసెక్కుల వరద వస్తోంది. కుడి, ఎడమ గట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 63,813 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 21,479 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 28 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,246 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 884.70 అడుగులకు చేరుకుంది. నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వచ్చే వరద నీరు తగ్గటంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను శుక్రవారం మూసివేశారు. సాగర్ జలాశయానికి 67,232 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయంలో ప్రస్తుతం 589.90 అడుగుల్లో 311.74 టీఎంసీల నీరు ఉంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 53,399 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

ధర్మవరంలో నేతన్నల భారీ బైక్ ర్యాలీ



చేనేతల బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: సీఎం వైఎస్ జగన్ నాలుగో విడత 'నేతన్న నేస్తం' నిధులను విడుదల చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వేలాది మంది చేనేత కార్మికులు తరలివచ్చారు. పట్టణంలోని కదిరిగేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 80,546 మంది నేతన్నలకు రూ.193.31 కోట్లను ఖాతాల్లో జమ చేయడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో 15,981 మంది కార్మికులకు రూ.38.35 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. చేనేతకు పూర్వ వైభవం జగనన్నతో సాధ్యమవుతోందన్నారు.

కర్మలను ఆచరించుట యందే నీకు అధికారము కలదు కానీ వాని ఫలితము పైన లేదు. అట్లని కర్మలను చేయుట మానరాదు.

– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, ఆగస్టు, 27

ఆజాద్ నిష్క్రమణ చెప్పేదేమిటి?

ఎన్నికల్లో ఓటమి పొందినప్పుడూ, జీ–23 నేతలు లేఖలు రాసినప్పుడూ మాత్రమే ఉనికి చాటుకునే కాంగ్రెస్ ఈమధ్యకాలంలో నేతలు పార్టీనుంచి తప్పుకున్నప్పుడు సైతం వార్తల్లోకెక్కుతోంది. తాజాగా శుక్రవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ నిష్క్రమించారు. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన ప్రముఖుల్లో కేంద్ర మాజీ మంత్రులు కపిల్ సిబల్, అశ్వినీకుమార్‌లతోపాటు జైవీర్ షేర్గిల్, హార్దిక్ పటేల్, సునీల్ జాఖడ్‌లున్నారు. మరో నేత ఆనంద్ శర్మ పార్టీ నుంచి తప్పుకోనంటూనే అధినేతలపై విమర్శలు చేశారు. హిమాచల్ ప్రచార సారథ్యం బాధ్యతలు తీసుకోదల్చుకోలేదని ప్రకటించారు. పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపైనా, ఆయన్ను పల్లెత్తు మాట అనని పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీపైనా ఆజాద్ పోతూ పోతూ పదునైన విమర్శలే చేశారు. అయితే ఇందులో కొత్తదనం ఏమీ లేదు. అవన్నీ గత పది పన్నెండేళ్లుగా పార్టీని వీడి పోతున్నవారంతా చెబుతున్నవే. వానాకాలం వచ్చిందంటే జనావాస ప్రాంతాల్లో శిథిల భవంతులపై స్థానిక సంస్థల అధికారులు ఆరా తీస్తారు. అక్కడ ఎవరైనా నివసిస్తుంటే ఖాళీ చేయిస్తారు. ప్రస్తుతం కాంగ్రెస్ అలాంటి శిథిలావస్థలోనే ఉంది. అందులో ఉండటం రాజకీయంగా ముప్పు కలిగిస్తుందన్న భయంతో కొందరు నిష్క్రమిస్తుంటే... వేరేచోట అవకాశం దొరక్క తప్పనిసరై ఉండిపోతున్నవారు మరికొందరు. నిష్క్రమిస్తున్నవారు అధికార వ్యామోహంతోనే ఆ పని చేస్తున్నారని రాహుల్, సోనియా విధేయులు చెప్పే మాటల్లో వాస్తవం లేదు. జనాగ్రహం సెగ తగిలి అధికారానికి దూరం కావటం పార్టీకి కొత్తేమీ కాదు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించిన చరిత్ర ఆ పార్టీకుంది. కానీ ఇప్పటి స్థితి వేరు. కాంగ్రెస్ జవసత్వాలతో ఉన్నదనీ, చిత్తశుద్ధితో, కలిసికట్టుగా ప్రయత్నిస్తే గత వైభవం ఖాయమనీ పార్టీ శ్రేణులు నమ్మడానికి తగిన పరిస్థితులు లేవు. కోటరీలే అక్కడ కొలువుదీరాయి. భజన బృందాలదే అక్కడ పైచేయి అయింది. జనాదరణ ఉన్న నేతలపై చాడీలు చెప్పేవారే ఎక్కువయ్యారు. వారికే పార్టీలో పెద్ద పీట. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఓటమి తప్పకపోవటం, నెగ్గిన చోట్ల సైతం అధికార భ్రష్టత సంప్రాప్తించటం స్వీయ వైఫల్యాలు, ముఠా కుమ్ములాటల పర్యవసానమే. కనీసం వీటిపై సక్రమంగా సమీక్షలు జరిగితే, ఏం చేయాలన్న అంశంలో అందరి అభిప్రాయాలూ తెలుసుకుంటే ముున్ముందు నష్టాలు రాకుండా చూసుకునే వీలుండేది. కానీ ఆ సమీక్షల జాడ లేదు. ఇలాంటి దుస్థితిలో ఆజాద్ పార్టీని వీడారంటే ఆశ్చర్యపడాల్సిందేముంది?

అయితే పార్టీ వర్తమాన దుస్థితికి తనను మినహాయించుకుని కారణాలు వెదకటం ఆజాద్‌కు తగదు. పలుమార్లు కేంద్రమంత్రిగా పనిచేయడంతోపాటు సంతోష, సంక్షోభ సమయాల్లో అధిష్ఠాన వర్గం దూతగా, పార్టీ పరిశీలకుడిగా, రాష్ట్రాల్లో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఎన్నో అవతారాలెత్తి పెత్తనం చెలాయించిన ఆజాద్‌కు ఇన్ని దశాబ్దాలుగా పార్టీలో పైనుంచి కిందివరకూ ఏం జరుగుతున్నదో తెలియలేదని ఎవరైనా అనుకుంటే వారి అమాయకత్వం. కాంగ్రెస్ సంస్కృతిగా స్థిరపడిన అనేక అవలక్షణాలకు ఆజాద్ కూడా బాధ్యుడే. అందులో తనకు కర్తృత్వం లేదని ఆయన వాదించవచ్చు. అలా చూసినా సీనియర్ నేతగా ఆ అవలక్షణాలను అడ్డుకున్నదెక్కడ? రాహుల్ పార్టీలోకి ప్రవేశించాక, ముఖ్యంగా 2013లో పార్టీ ఉపాధ్యక్షుడయ్యాక సంస్థాగత సలహాసంప్రదింపుల వ్యవస్థ ధ్వంసమైందన్న ఆయన ఆరోపణలో అబద్ధమేమీ లేదు. కానీ అంతక్రితం ఏమంత సవ్యంగా ఉన్నదని! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయాక ఆయన కుమారుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై సోనియా గాంధీ కక్షగట్టి అక్రమ కేసులతో ఆయన్ను ఇబ్బందులపాలు చేసినప్పుడు ఆజాద్ సీనియర్ నేతగా నిర్వహించిన పాత్రేమిటి? అదేమీ లేకపోగా హైదరాబాద్‌కొచ్చినప్పుడు 'మా మాట వింటే జగన్ కేంద్ర మంత్రి అయ్యేవారు, ముఖ్యమంత్రి కూడా అయ్యేవారు...' అంటూ వ్యాఖ్యానించిన సంగతి మరిచారా? అధికారంలో ఉండగా అధినేతలకు పరమ విధేయత నటించడం, అది కోల్పోయాక రాళ్లు రువ్వడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు. తప్పును తప్పని సూటిగా చెప్పలేకపోతే ఎంతో కొంత అర్థం చేసుకోవచ్చు. కనీసం అలా చెప్పేవారికైనా అండగా నిలవాలనీ, వారు లేవనెత్తే అంశాల్లో హేతుబద్ధత ఉన్నదనీ అధిష్ఠానానికి చెప్పాలని అనిపించని సీనియారిటీకి విలువేముంటుంది?

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ఏలుబడి సాగుతోంది. తమిళనాడు, జార్ఖండ్‌లలో అధికార కూటముల్లో భాగస్వామిగా ఉంది. మరి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగబోయే గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్‌కు అధికారయోగం అసాధ్యం. అక్కడ కాంగ్రెస్ స్థానాన్ని ఆప్ భర్తీ చేసిందని సర్వేలు చెబుతున్నాయి. మరో రాష్ట్రం మేఘాలయాలో మహా అయితే అధికార కూటమిలో మైనారిటీ పక్షంగా కొనసాగే చాన్సుంది. దేశంలో మరెక్కడా ఆ పార్టీకి ఆశాజనకమైన స్థితి లేదు. అంతర్గతంగా చూస్తే నాయకత్వం నిస్తేజంగా మారింది. పార్టీ అధ్యక్ష పదవికి వచ్చే నెలలో జరగాల్సిన ఎన్నికలు కాస్తా వాయిదా పడే అవకాశం ఉందంటున్నారు. మంచి రోజుల్లోకే ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ వర్గాలు అంటున్నాయి. సుముహూర్తాలు చూసుకుంటే సరిపోదు. ఎదురయ్యే వైఫల్యాలపై ఆత్మవిమర్శ ఉండాలి. స్వీయలోపాలపై దృష్టి సారించాలి. పార్టీ శ్రేణుల అభిప్రాయాలకు విలువివ్వాలి. ముఠా సంస్కృతిని ప్రోత్సహించడం ఆపాలి. అంతవరకూ కాంగ్రెస్‌కు మంచి రోజులు రావు. ఉండవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణమాసం, తిథి: అమావాస్య ప.1.05 వరకు, తదుపరి భాద్రపద శు.పాడ్యమి, నక్షత్రం: మఖ రా.8.54 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.7.58 నుండి 9.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.47 నుండి 7.28 వరకు, అమృతఘడియలు: సా.6.19 నుండి 8.03 వరకు, పోలాల అమావాస్య.

సూర్యోదయం: 5.47
సూర్యాస్తమయం: 6.18
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు

రూపాయి క్షీణతను నివారించాలంటే...

విశ్లేషణ



దాక్టర్ పీఎస్ చారి

ఇటీవల కాలంలో రూపాయి విలువ బాగా క్షీణిస్తోంది. ఇందువల్ల ఐటీ, ఫార్మా రంగాల్లో ఉన్న ఎగుమతిదార్లు విపరీతమైన లాభాలు గడిస్తున్నారు. అదేసమయంలో పెట్రోల్, వంటనూనెలు వంటి నిత్యావసరాలను దిగుమతి చేసుకోవడం వల్ల సామాన్య, మధ్య తరగతి జనాలు నానా యాతనా పడుతున్నారు. ద్రవ్యం విలువ పడిపోవడం దేశ కరెంట్ ఖాతా లోటు పెరిగిపోవడానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం పెరిగి అధిక శాతం జనాభా కనీసావసరాలను తీర్చుకోలేక ఇబ్బందుల పాలవుతారు. ఇంత ఇబ్బందికరమైన రూపాయి విలువలో వచ్చే హెచ్చు తగ్గులకు అనేక అంతర్గత, బాహ్య పరిస్థితులు కారణాలుగా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని భారతీయ కరెన్సీ క్షీణతను ఆర్‌బీఐ అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలి.

గత కొన్ని నెలలుగా రూపాయి విలువ హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఇది 2022 జులై 20 నాటికి డాలర్‌తో పోలిస్తే 80.05 రూపాయల కనిష్ఠానికి చేరుకుంది. 2022 ఆగస్టు 2కు 78.72 రూపాయలకు బలపడింది. ఇలా ఎందుకు జరుగుతోంది? రూపాయి విలువ పడిపోవడాన్ని రెండు రకాలుగా చెప్పు కోవచ్చు. రూపాయి విలువ తగ్గింపు వల్ల... అంటే ఇతర కరెన్సీలతో అధికారిక మారకపు రేటులో ఉద్దేశ పూర్వకంగా మన రూపాయిని తగ్గించడం (మూల్య హీనీకరణ) ఒకటి. ఇది 1949, 1966, 1991 సంవత్సరాలలో జరిగింది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడాన్ని సూచించే రూపాయి విలువ క్షీణత మరొకటి. ఇది ఆర్థిక ఒడిదుడుకులవల్ల డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనంగా మారిందని సూచిస్తుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, ఈక్విటీ అమ్మకాలు, డాలర్ తిరుగు ప్రవాహం, ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయడానికి ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల కఠినతరం వంటి కారకాలు ఇప్పుడు రూపాయి విలువ పడిపోవడానికి ప్రధాన కారణాలు.

బలహీన రూపాయి వల్ల సైద్ధాంతికంగా భారతదేశ ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుంది. భారతదేశానికి ప్రయాణం చౌకగా ఉంటుంది. స్థానిక పరిశ్రమ లాభపడవచ్చు. విదేశాలలో పని చేసే వారు తమ స్వదేశానికి డబ్బు పంపడం ద్వారా ఎక్కువ లాభం పొందవచ్చు. కరెంట్ ఖాతా లోటు తగ్గే అవకాశం ఉంది. ఇక నష్టాల సంగతి కొస్తే... ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను రికార్డు స్థాయిలో ఎక్కువ కాలం కొనసాగించడాన్ని కష్టతరం చేస్తుంది. భారత్ తన దేశీయ చమురు అవసరాలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. బలహీనమైన కరెన్సీ వల్ల దిగుమతి చేసుకున్న వంట నూనెల ధరలు మరింతగా పెరుగుతాయి. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుంది. రూపాయి కొనుగోలు శక్తి పడిపోవడం వల్ల దేశం కరెంట్ ఖాతా లోటు విస్తరిస్తుంది. విదేశీ ప్రయాణాలకూ, విదేశీ విద్యార్జనకూ ఎక్కువ ఖర్చు అవుతుంది. విదేశీ రుణంపై వడ్డీ భారం పెరుగుతుంది.

ఇప్పటి వరకు సంవత్సరానికి అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 7 శాతం పడిపోయింది. ఓవర్–ది–కౌంటర్, డెరివేటివ్స్ మార్కెట్‌లలో రూ. 80 మార్కును దాటింది. ఈ క్యాలెండర్ సంవత్సరం మూడో త్రైమాసికంలో డాలర్‌తో పోలిస్తే రూ. 82కి తగ్గుతుందని నోమురా సంస్థ అంచనా వేస్తోంది. ముడి చమురు ధరలు పుంజుకోవడం, డాలర్ తక్షణ కాలంలో సాపేక్షంగా బలంగా ఉంటుందనే అంచనాల మధ్య, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూపాయి 81కి బలహీనపడవచ్చని భావిస్తున్నారు. సమీప కాలంలో రూపాయి ఒత్తిడికి లోనవుతుందని క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (క్రిసిల్) అంచనా వేసింది. అంతే కాకుండా వాణిజ్య లోటు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి



పోవడం, అమెరికా డాలర్ ఇండెక్స్ బలపడటం వంటి కారణాల వల్ల సమీప కాలంలో రూపాయి–డాలర్ మారకం అస్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ రేట్ల పెంపుదల, భౌగోళిక రాజకీయ అస్థిరతల మధ్య డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి బలహీనపడవచ్చని అంచనా వేసింది.

ప్రస్తుతం రూపాయి విలువ బాగా పడిపోవడం ఆర్థిక వ్యవస్థలో కొన్ని పరిణామాలకు దారితీసింది. భారతదేశ ఫార్మసీ రంగం 2022 సంవత్సరంలో 22.5 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలను ఎగుమతి చేసింది. ఈ కంపెనీలు అమెరికా నుండి అత్యధిక ఆదాయాన్ని పొందుతున్నాయి. నికర ఎగుమతిదారు అయిన వస్త్ర (టెక్స్‌టైల్) పరిశ్రమ బలహీనమైన రూపాయి నుండి ప్రయోజనం పొందుతోంది. రత్నాలు, ఆభరణాల రంగం విషయానికొస్తే రూపాయి క్షీణత దాని యూనిట్లకు వ్యయ ప్రయోజనాన్ని ఇస్తోంది. ఐటీ సేవలు, సాంకేతిక పరిశ్రమ అమెరికా ఆదాయాలలో 50 శాతం వాటా కలిగి ఉన్నాయి కాబట్టి... క్షీణిస్తున్న రూపాయి అతిపెద్ద లాభాల్లో ఒకటిగా ఉంటుంది. రూపాయిలో ప్రతి 1 శాతం పతనానికీ వస్త్ర ఎగుమతులకు 0.25–0.5 శాతం లాభం పెరుగుతుంది. భారతదేశం తేయాకు(టీ) లాభాల ఎగుమతులు 5–10 శాతం పెరుగుతాయని అంచనా.

సరఫరా కొరత కారణంగా పెరుగుతున్న వస్తువుల ధరలతో, ఎగుమతిదారులకు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఇది వారి లాభాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదిలావుండగా, విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పటివరకు భారతీయ మార్కెట్ల నుండి 19 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకున్నారు. ముడి చమురు ఫ్యూచర్స్ ధరలో ఒక డాలర్ పెరుగుదలతో... భారత్ ముడి చమురు దిగుమతులు 1.703 మిలియన్ టన్నులు పెరిగాయని అంచనా. ప్రతి ఒక మిలియన్ టన్ను ముడి చమురు దిగుమతి... డాలర్‌ను మన రూపాయితో పోలిస్తే 0.266 బలపరుస్తుంది. జూలై 15తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 7.5 బిలియన్లు తగ్గి 572.71 బిలియన్లకు పడిపోయాయి. ఇది 20 నెలల కనిష్ఠ స్థాయి. భారతదేశ కరెంట్ ఖాతా లోటు 2022లో జీడీపీలో 1.5 శాతం నుండి 3 శాతం వరకు పెరుగుతుందని అంచనా.

అమెరికా డాలర్‌తో పోలిస్తే అనేక కరెన్సీలు హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఫలితంగా, భారతదేశంతో సహా వివిధ వర్ధమాన ఆర్థిక వ్యవస్థల నుండి విదేశీ మూలధన ప్రవాహం జరుగుతోంది. వారి దేశీయ కరెన్సీలపై ఒత్తిడి పెరిగింది. అమెరికా డాలర్‌తో రూపాయి విలువ క్షీణించడం... ఇతర ప్రధాన ప్రపంచ కరెన్సీలైన యూరో, బ్రిటిష్ పౌండ్, జపనీస్ ఎన్‌ల కంటే తక్కువగా ఉందని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. ప్రధాన కరెన్సీలకు వ్యతిరేకంగా అమెరికా యూనిట్ ఈ ఏడాది 11 శాతం ర్యాలీ చేసి రెండు దశాబ్దాల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా కరెన్సీల స్థిరమైన తరుగుదలకి కారణమైంది. ఫలితంగా, భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే 80 మార్కును దాటి రికార్డు కనిష్ఠ స్థాయికి చేరుకుంది. 2022లో రూపాయి దాదాపు 7 శాతం నష్టపోయినప్పటికీ, కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కరెన్సీలు మన రూపాయి కన్నా చాలా దారుణంగా క్షీణించాయి. యూరో 13 శాతం, బ్రిటిష్ పౌండ్ 11 శాతం, జపనీస్ ఎన్ 16 శాతం తగ్గాయి. ఫలితంగా ఈ కరెన్సీలతో రూపాయి విలువ పెరిగింది. దక్షిణ కొరియా వాన్, ఫిలిప్పైన్ పెసో, థాయ్‌లాండ్ బాట్, తైవాన్ డాలర్‌లు... అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి కంటే ఎక్కువగా పడిపోయాయి. అందువల్ల ఆయా దేశాల నుంచి మనం చేసుకునే దిగుమతులు మనకు లాభదాయకంగా ఉంటాయి.

ఇప్పుడు భారతీయ కరెన్సీ క్షీణతను ఆర్‌బీఐ ఎలా అదుపు చేయగలదో చూద్దాం. ఫారెక్స్ మార్కెట్‌లో జోక్యం చేసుకోవాలి.నాన్ రెసిడెంట్ ఇండియన్ బాండ్లను విక్రయించాలి. సావరిన్ బాండ్ల జారీని నిర్వహించాలి. భారతదేశం తన మొత్తం కరెంట్ ఖాతా లోటును తగ్గించుకోవడంపై దృష్టి సారించి, రష్యా వంటి స్నేహపూర్వక దేశాలతో రూపాయి చెల్లింపు విధానాన్ని లాంఛనప్రాయంగా పరిగణించాలి. ఇది అమెరికా డాలర్‌పై రూపాయి ఆధారపడటాన్ని తగ్గించడానికి మార్గం సుగమం చేస్తుంది. పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా వస్తువుల విక్రయానికి రూపాయి మార్పిడి అవసరం అవుతుంది. ఇది చివరికి అంతర్జాతీయ మార్కెట్లలో సంస్థాగతీకరణకు దారి తీస్తుంది. రూపాయిలో నల్లధనం లావాదేవీలను అరికట్టడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను లాంఛనప్రాయంగా మార్చడం కూడా చాలా అవసరం. రూపాయి బహు పాక్షిక స్వభావాన్ని పునరుద్ధరించడానికి, అంతర్జాతీయ మార్కెట్లలో రూపాయి వినియోగాన్ని పెంచాలి. ఎలా చూసినా కరెన్సీ విలువ పడి పోకుండా రక్షించేది ఆర్థికాభివృద్ధి మాత్రమే. కాబట్టి ప్రభుత్వం ఆ దిశలో మరిన్ని చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త మేనేజ్‌మెంట్ స్టడీస్ నిపుణులు
మొబైల్: 83090 82823

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మనుషులెలా?



గ్లోబల్ వార్మింగ్ కన్నా, తక్కువ జననాల రేటు వల్ల జనాభా పడిపోవడం అనేది నాగరికతకు మరింత పెద్ద ప్రమాదం.

– ఎలన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఒకరి తర్వాత ఒకరు...



కాంగ్రెస్ నుంచి 2022లో ఇప్పటివరకూ బయటకు వెళ్లిన నాయకులు: హార్దిక్ పటేల్, సునీల్ జాఖడ్, అశ్వినీ కుమార్, ఆర్‌పీఎన్ సింగ్, కపిల్ సిబాల్, కులదీప్ బిష్ణోయ్, ఆనంద్ శర్మ, రాజు పర్మార్, నరేశ్ రావల్, శ్రావణ్ దాసోజు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జైవీర్ షెర్గిల్, గులామ్ నబీ అజాద్.

– అభినవ్ ప్రకాశ్, బీజేపీ నాయకుడు

ఆపండి బాబులు



బాలీవుడ్ విలన్‌గా 1970లు, 80ల్లో ప్రసిద్ధుడైన రంజీత్ తన ఆత్మకథలో డిస్ట్రిబ్యూటర్లు సినిమాల్లో తన రేప్ సీన్ ఉండాలని డిమాండ్ చేసేవారని వెల్లడించారు. రంజీత్ 350 సినిమాల్లో రేప్ సీన్స్ చేశారు. ఒక దశలో ప్రభుత్వం సినిమా నిర్మాతలను రేప్ సీన్లు తగ్గించమని కోరిందని మరో నటుడు ప్రేమ్ చోప్రా వెల్లడించారు.

– స్వాతి గోయల్ శర్మ, జర్నలిస్ట్

దేనికోసం ఇదంతా?



ఎంతమాత్రమూ ప్రజా పునాది లేని నాయకుడు (గులామ్ నబీ ఆజాద్) దశాబ్దాల పాటు అధికారాన్ని అనుభవించారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ పెద్ద పదవులు స్వీకరించారు. ఢిల్లీ లూట్యెన్స్ ప్రాంతంలో బంగళాను ఇచ్చే రాజ్యసభ సీటును నిరాకరించడంతో తిరుగుబాటు చేశారు. మళ్లీ ఇప్పుడు మరోసారి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నారు.

– ఔరంగజేబ్ నక్షాబందీ, జర్నలిస్ట్

కలిసి పాడుదాం



నియంత్రణ రేఖ దగ్గర సిద్ధూ మూసేవాలా (ఇటీవల హత్యకు గురైన గాయకుడు) పాటలు వినిపిస్తుండగా ఇండియా, పాకిస్తాన్ సైనికులు డ్యాన్సులు చేస్తున్నారు. ఇలాంటి పాటలే మన దేశాల మధ్య విభేదాలను బోగొట్టే వంతెనలు.

– హెచ్‌జీఎస్ ధలీవాల్, ఐపీఎస్ అధికారి

కాపాడుకోవడానికే...



తమకోసం డబ్బు సంపాదించుకోవడానికి రాయ్‌లు (ప్రణయ్ రాయ్, రాధికా రాయ్) తమ వాటాలను 'వీసీపీఎల్'కు వాగ్దానం చేయలేదు. 2010 నుంచీ వాళ్ల వేతనాలు నాకు ఇచ్చినదాని కంటే తక్కువ. ఎన్డీ టీవీ న్యూస్‌రూమ్‌లో ఉన్న ఎందరో పెద్ద జర్నలిస్టులకు వాళ్లకంటే చాలా ఎక్కువ వచ్చేది. వాళ్లు అప్పు చేసింది ఎన్డీ టీవీని, వందల ఉద్యోగాలను కాపాడుకోవడం కోసమే.

– అనింద్యో చక్రవర్తి, ఎన్డీ టీవీ మాజీ జర్నలిస్ట్

అదీ అవసరమే



ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నిరాశపరిచిన కొందరు నాయకులు... గులామ్ నబీ ఆజాద్ పార్టీని నిరాశ పరిచారని జ్ఞానబోధ చేస్తున్నారు. సరే, విషయం ఏమిటంటే– కాంగ్రెస్‌ను రక్షించుకోండి. కానీ ఒంటరిగా ఉన్నప్పుడు ఆత్మపరిశీలన కూడా చేసుకోండి.

– పల్లవి ఘోష్, సంపాదకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

నేతాజీ అంగరక్షకుడు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్ రాజకీయాలను వదిలేసి విదేశాలకు వెళ్లి బ్రిటిష్ వాళ్లపై యుద్ధం ప్రకటించిన రోజులవి. అప్పట్లో ఆయన అంగరక్షకునిగా పనిచేసిన అచంచల దేశభక్తుడు గోపరాజు వేంకట అనంత శర్మ. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా ఆలమూరులో 1920లో జన్మించిన ఆయన 1941లో బ్రిటిష్ ఇండియా ఆర్మీ (బీఐఏ)లో గుమాస్తాగా చేరారు. తరువాత ఆఫీసర్‌గా ఎంపికై శిక్షణ నిమిత్తం మలేషియాలోని కోటాబహార్‌కు వెళ్లారు. బ్రిటన్– జపాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో వేలాదిమంది బీఐఏ సైనికులు యుద్ధ ఖైదీలుగా జపాన్‌కు చిక్కారు. అందులో గోపరాజు ఒకరు.

జపాన్‌తో ఒప్పందం కుదుర్చుకొని ఆ దేశస్థుల సాయంతో భారత మాతకు విముక్తి కలిగించాలని నేతాజీ తన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్‌ఏ) ద్వారా ప్రయత్నించారు. ఆయన సిద్ధాంతాలకు ఆకర్షితులైన గోపరాజు నేతాజీని బ్యాంకాక్‌లోని రత్నకోసిన్ హోటల్‌లో కలిసి ఐఎన్‌ఏలో చేరారు. నేతాజీ అంగరక్షకులలో ఒకరుగా పనిచేశారు. ఎప్పుడూ మిలటరీ దుస్తులలో ఉండే నేతాజీని చూసి ఎంతో ప్రేరణ, గౌరవం కలిగేదని గోపరాజు అంటూ ఉండేవారు. బ్రిటిష్ వాళ్లు ఇండియన్ నేషనల్ ఆర్మీవారిని యుద్ధఖైదీలుగా ఫిరోజ్‌పూర్ కంటోన్మెంటుకు తరలించారు. వారిలో గోపరాజు అనంత శర్మ కూడా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ దీప్తి నేతాజీ... కనుసన్నలలో గడిపిన మూడేళ్ల కాలం తన జీవితంలో స్వర్ణమయ సమయం అనేవారు వేంకట అనంత శర్మ. ఈయన కొంతకాలం పాటు స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి కార్యదర్శిగా కూడా వ్యవహరించారు. ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రోత్సాహంతో భారతీయ రైల్వేలో ఉద్యోగిగా చేరి ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీవిరమణ చేశారు. ఈమధ్య జూలై నెలలో ఐకానిక్ వారోత్సవాల వేడుకలలో అమృతోత్సవమును పురస్కరించుకొని దక్షిణ మధ్య రైల్వే వారు విజయవాడలో స్వాతంత్ర్య సమరవీరులైన శర్మ కుటుంబ సభ్యులను ఉచిత రీతిన గౌరవించడం ముదావహం.

– డా॥ ధర్మాల సూర్యనారాయణ మూర్తి, చాంగీ కాండో, సింగపూర్

చదువుల్లో 'వివక్ష' తొలగింపు కోసమే!

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించుకునే కుటుంబాలకు – 'ఇంగ్లిష్ మీడియం' అందుబాటులోకి తీసుకురావాలని కొంతకాలం క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భిన్న అభిప్రాయాలకు, చర్చలకు దారి తీసింది. ఇప్పుడు 'ఉచిత– పథకాల' గురించి కోర్టుకు వెళ్లినట్టుగానే, అప్పట్లో 'ఇంగ్లిష్–మీడియం' విషయం కూడా కోర్టు వరకూ వెళ్ళింది. మన దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన 30 ఏళ్ళ కాలంలో విద్య, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారిలో ఎక్కువ మంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఉండడం తెలిసిందే. మరి పరిస్థితి ఇలా ఉన్న ప్పుడు, ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లల విద్య నాణ్యత విషయంగా ప్రభుత్వం ఎటువంటి వైఖరిని అనుసరించాలి? ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ తర్వాత, ఒక ఉద్యోగి ఇండియాలో పనిచేసినా లేదా విదేశాల్లో పనిచేసినా పని నాణ్యతా ప్రమాణాల విషయంలో ఈ రోజున ఎటు వంటి వ్యత్యాసం లేదు.

అటువంటప్పుడు చదువు పూర్తి చేసుకుని 'జాబ్ మార్కెట్'లోకి వచ్చే యువతకు ప్రాథమిక విద్య స్థాయిలోనే 'వర్క్ ప్లేస్' సవాళ్లు ఎదుర్కొనే నైపుణ్యాలను బోధించడం ఇప్పుడు తప్పనిసరి అవుతుంది. 'ప్రొఫెషనల్ కోర్సు'లు పూర్తి చేసుకుని, ఉద్యోగాల్లో చేరుతున్న దశలో నైపుణ్యాల బోధన లేని కారణంగానే, మళ్ళీ వారికీ 'స్కిల్ డెవలప్మెంట్' కోర్సులు అవసరం అవుతున్నాయి. ప్రభుత్వం ఆ అవసరాన్ని గుర్తించి దాన్ని కనుక పట్టించుకోకపోతే, చదివిన డిగ్రీలతో పనిలేకుండా... జీవిక కోసం 'మార్కెట్'లో చౌక 'లేబర్'గా వీరు మారుతారు. దాంతో వీరి చదువుల కోసం ప్రభుత్వం చేసిన 'వ్యయం', తిరిగి వీరి సర్వీసుల ద్వారా జాతీయ స్థూల ఉత్పత్తికి అవుతున్న 'జమ' మధ్య వ్యత్యాసం తగ్గదు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి, ప్రభుత్వ



బడుల్లో చదివిన పిల్లలు స్థిరంగా– 'జాబ్ మార్కెట్'లో నిలబడగలగడానికి– ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య స్థాయిలో ఇవ్వాల్సిన తర్ఫీదు ఎలా ఉండాలి? కొన్నేళ్లుగా 'ఇంటర్నేషనల్ స్కూళ్లు' ఉనికిలోకి వచ్చాయి. వాటి 'కేంపస్'లు కూడా విశాలమైన స్థలం, భవనాలు, వసతులతో అలరారుతున్నాయి. అటువంటప్పుడు– అదే కాలంలో అదే ప్రాంతంలోని సమాజాల్లో ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలకు అందించే బోధనా ప్రమాణాలు ఎలా ఉండాలి? పబ్లిక్ స్కూళ్లలో 'యజమాని' ప్రభుత్వ స్కూళ్లలో 'ఉద్యోగి' తయారయ్యే ఇటువంటి వైరుధ్యం, వ్యత్యాసం ఇలా విద్యార్థికి 'కిండర్ గార్డెన్' దశలోనే మొదలవుతున్నప్పుడు, దీనిపై... సమీక్ష సంస్కరణల చర్యల అవసరం ఉందా లేదా? ఇంకా ఈ వ్యత్యాసం కొనసాగడానికి ప్రభుత్వం 'చెక్' పెట్టే చర్యలు కనుక చేపడితే, అందుకు మన పౌర సమాజ స్పందన ఎలా ఉండాలి?

ఉపాధి అంశం కంటే సున్నితమైనది మరొకటి ఉంది. అది– ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలకు అందవలసిన 'ఎమోషనల్ సపోర్ట్'. దీన్ని అర్థం చేసుకోవడానికి, ఒకప్పుడు మురికివాడలు అని మనం పిలిచిన పట్టణ శివారు కాలనీల్లోని పోలీస్ స్టేషన్లలో నమోదు అయ్యే 'ఫ్యామిలీ కేసులు' ఎటువంటివో చూస్తే, ఆ కుటుంబాల్లో పెరిగే పిల్లలకు బడిలో టీచర్ల నుంచి అందవలసిన సాంత్వన ఎటువంటిదో మనకు అర్థమవుతుంది. విజయవాడ వంటి రైల్వే జంక్షన్ పరిధిలో వీధి బాలల కోసం పని చేస్తున్న– ఎన్జీఓలు చెప్పగలరు– పిల్లల పట్ల మనం చూపే నిర్లక్ష్యం ముగింపు ఎలా ఉంటుందో!


పాఠశాల విద్యాశాఖలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల విషయంలో జరుగుతున్న వాద వివాదాలను... బయట నుంచి, దూరం నుంచి చూస్తున్న పౌరసమాజపు క్రియాశీలత అవసరమైన సమయమిది. ఈ పిలుపు ఒకరికి అనుకూలం, మరొకరికి ప్రతికూలం కాదు. ఇది మన కొత్త రాష్ట్రం కోసం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

మనో ప్రక్షాళన

ప్రతి రైతూ తన పంట పొలంలో ఉన్న మురికి నీటిని తొలగించిన తర్వాతే మంచినీరు పారిస్తాడు. ఇది మన మనోక్షేత్రానికీ వర్తిస్తుంది. ఈ లోకంలో 'వీరు మంచివారు, 'వీరు చెడ్డవారు' అని పరిపూర్ణ లక్షణాలతో ఎవ్వరూ పుట్టరు. ఈ లక్షణాలు మనకు అలవడేవి. మధ్యలోనే వచ్చాయి కాబట్టి, వీటిని మధ్యలోనే వదిలించుకోనూవచ్చు. మనుషులకు జీవలక్షణాలు తప్ప, నడత, నడవడికలకు సంబంధించిన లక్షణాలన్నీ మధ్యలో వచ్చినవే!

మంచీ, చెడులు అనేవి ఉష్ణం, శీతలం లాంటివి. నిజానికి వేడి, చల్లదనం అనేవి వేరువేరుగా ఉండవు. మన శరీర స్థితిని బట్టి అలా



అనిపిస్తాయి. గోరువెచ్చని నీరు వేడిగానే ఉంటుంది. మనం ముందుగా బాగా వేడిగా ఉన్న నీటిలో మన వేలిని ముంచి తీసి, అదే వేలిని గోరువెచ్చని నీటిలో ఉంచితే ఆ నీరు చల్లగా అనిపిస్తాయి. కాబట్టి ఉష్ణోగ్రత వ్యత్యాసాలే తప్ప ఉష్ణం, శీతలం అనేవి వేరు వేరు స్థితులు కావు. అలాగే మంచీ చెడూనూ! ప్రతి మనిషిలో ఈ రెండూ కలిసిపోయి ఉంటాయి. రెండింటికీ కచ్చితమైన విభజన రేఖ ఉండదు. దుర్వ్యసనాలు ఉన్న ఒక ఉద్యోగి 'లంచం' తీసుకోకపోవచ్చు. వ్యసనాలు లేని మరో వ్యక్తి లంచం తీసుకోనూవచ్చు.

అయితే... ఆ మంచీచెడులలో బుద్ధుడు ముందుగా చెడ్డ లక్షణాల్ని వదులు కోవాలని అంటాడు. చెడును తొలగించగానే... ఆ చిత్తం లోకి మంచి తానంతట తానుగానే వచ్చేస్తుంది. మనో క్షేత్రాన్ని మంచితో ముంచేస్తుంది. కోపం, ఈర్ష్య, ద్వేషం, మోహం ఇవన్నీ మనస్సును కల్లోలపరచే మలినాలు. మన మనస్సులోంచి కోపాన్ని తీసివేస్తే చాలు... అదే శాంతం. శాంతం అనేది వేరే ప్రత్యేకంగా ఉండే మనో స్థితి కాదు. కోపం లేకపోవడమే! అలాగే... పగను తీసేస్తే ప్రేమ, మోహాన్ని తీసేస్తే నిర్మోహం, కాఠిన్యాన్ని తొలగిస్తే కరుణ... వాటంతట అవే వచ్చేస్తాయి! కాబట్టి ప్రతి మనిషీ తనలోంచి చెడును తీసివేస్తే మనోక్షేత్రంలో 'మంచితనం' అనే పంట పండుతుంది.

– బొర్రా గోవర్ధన్

3 నెలల్లో రూ.9,029 కోట్ల విద్యుత్ కొనుగోలు

- యూనిట్ ధర రూ.5.22 నుంచి రూ.5.35
- మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో అదనంగా రూ.1,048 కోట్లు
- సర్దుబాటుకు అనుమతించాలని కోరిన డిస్కంలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు 2021–22 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికం విద్యుత్ కొనుగోలు ఖర్చుల సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి దరఖాస్తు చేశాయి. 2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో అనుకున్నదానికి మించి మూడు డిస్కంలు కలిపి రూ.9,029 కోట్లను విద్యుత్ కొనుగోలుకు ఖర్చుచేశాయి. యూనిట్ విద్యుత్‌కు రూ.5.22 నుంచి రూ.5.35 వరకు వెచ్చించాయి. మార్కెట్‌లో విద్యుత్‌కు డిమాండ్ పెరగడంతో రూ.1,048 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఈ మొత్తాన్నిబిల్లుల్లో సర్దుబాటు (ట్రూఅప్ చార్జీలు) చేసేందుకు అనుమతించాలని డిస్కంలు ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనలపై సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. దీనికి హాజరుకాలేని వారు సెప్టెంబర్ 9వ తేదీన 'వెబ్ హియరింగ్'లో పాల్గొని ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని ఏపీఈఆర్‌సీ శుక్రవారం తెలిపింది.

డిస్కంలు నివేదించిన అంశాల్లో ప్రధానమైనవి

◆ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో అనుమతించిన విద్యుత్ కొనుగోలు ఖర్చు 6,231 మిలియన్ యూనిట్లకు రూ.2,843 కోట్లు కాగా ఈ సంస్థ రూ.3,463 కోట్లతో 6,541 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసింది. యూనిట్ రూ.4.56కు కొనాల్సి ఉన్నప్పటికీ డిమాండ్ దృష్ట్యా సరాసరిన రూ.5.29 వెచ్చించింది. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలతో కలుపుకొంటే ప్రతి యూనిట్‌కు 79 పైసలు అదనంగా ఖర్చయింది. ◆ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)కు రూ.3,146 కోట్లతో యూనిట్ రూ.4.26 చొప్పున 7,392 మిలియన్ యూనిట్లు కొనేందుకు అనుమతించగా.. యూనిట్ సరాసరిన రూ.5.22 రేటుకి రూ.3,509 కోట్లతో 6,726 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేసింది. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలతో కలుపుకొంటే ప్రతి యూనిట్‌కు రూ.1.06 ఎక్కువైంది. ◆ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్)లో యూనిట్ రూ.4.96 చొప్పున 4,015 మిలియన్ యూనిట్లను రూ.1,992 కోట్లతో కొనుగోలు చేసేందుకు అనుమతించారు. యూనిట్‌కు సరాసరిన రూ.5.35 ధరతో 3,842 మిలియన్ యూనిట్లను రూ.2,057 కోట్లకు కొనుగోలు చేశారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలతో కలుపుకొంటే ప్రతి యూనిట్‌కు 43 పైసలు ఎక్కువ ఖర్చయింది.

బంగ్లాదేశ్ దొంగల ముఠా గుట్టురట్టు

- ఏటీఎంలను చోరీ చేసి ఆ డబ్బుతో బంగారం కొనుగోలు
- రూ.1.3 లక్షలు, 32 కాసుల బంగారం స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్..పరారీలో నలుగురు


దొంగల అరెస్ట్ చూపిస్తున్న ఎస్పీ, డీఎస్పీ, సీఐ

గన్నవరం: బంగ్లాదేశ్‌కు చెందిన దొంగల ముఠాను కృష్ణా జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా శుక్రవారం మీడియాకు చెప్పారు. బంగ్లాదేశ్ వాసులు ఆరుగురు ఈ నెల 5న జయంతిపూర్ బోర్డర్ వద్ద అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి రైలులో ఈ నెల 10న విజయవాడ చేరుకున్నారు. ఏటీఎంల్లో చోరీ నిమిత్తం మాచవరం డౌన్, రామ్‌గోపాల్ థియేటర్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా బందోబస్తు ఎక్కువగా ఉండటంతో ఈ నెల 14న గోవాకు మకాం మార్చారు. అక్కడ హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా బ్యాంక్ ఏటీఎంలను ఎత్తుకుపోయి రూ.15 లక్షలు దోచుకున్నారు.అక్కడి నుంచి కర్ణాటకలోని హుబ్లీ చేరుకుని బంగారం కొనుగోలు చేశారు. తిరిగి ఈ నెల 19న విజయవాడకు చేరుకున్నారు. 21న గన్నవరంలో పార్కింగ్ చేసి ఉన్న ట్రక్ ఆటోను అపహరించి హైవే పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వచ్చి ఏటీఎం చోరీకి యత్నించారు. బీట్ కానిస్టేబుల్ మణీంద్రకుమార్, హోంగార్డు నాగరాజు అక్కడికి వెళ్లడంతో వారిపై దాడిచేసి పరారయ్యేందుకు యత్నించారు. మణీంద్ర ఇతర సిబ్బంది సహాయంతో ముఠాలోని నదీమ్‌ఖాన్, మహమ్మద్ జహంగీర్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.1.3 లక్షల నగదు, 32 కాసుల బంగారం, ట్రక్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నేరస్తులు సైమన్, బాద్‌షా, శరణ్‌సింగ్ సుమన్, కోకోన్ ముల్లా పరారీలో ఉన్నారు. మణీంద్ర ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి ఎంబసీ అధికారులకు సమాచారమిచ్చారు. మిగిలిన వారు బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మణీంద్ర, నాగరాజు, వీరికి సహకరించిన మరో ఇద్దరు కానిస్టేబుల్స్, సీఐ శివాజీ, ఎస్‌ఐలు శ్రీనివాస్, రమేష్‌బాబుకు ఎస్పీ రివార్డులను అందజేశారు.

• ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త టూరిజం పాలసీని ప్రవేశపెట్టిందని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కె.కన్నబాబు చెప్పారు. విజయవాడ బెర్మ్‌పార్క్‌లో ఏపీ టూరిజం హోటల్స్, రిసార్ట్స్ ఉద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐటీసీ హోటల్ గుంటూరు నుంచి ట్రైనర్ బాలాజీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం కన్నబాబు పాల్గొని మాట్లాడారు. ఈ పాలసీని ఉద్యోగులు అర్థం చేసుకుని నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు.

గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.569 కోట్ల నిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు శుక్రవారం మరో రూ.569.01 కోట్లు విడుదలయ్యాయి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.395.92 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.85.83 కోట్లు, జిల్లా పరిషత్‌లకు రూ.87.26 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం కేంద్రం గ్రామీణ స్థానిక సంస్థలకు ఏటా అన్‌టైడ్, టైడ్ గ్రాంట్‌ల పేరుతో ఒక్కో కేటగిరి గ్రాంట్‌ను రెండేసి విడతల చొప్పున నిధులిస్తుంది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత టైడ్ గ్రాంట్‌ను విడుదల చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రటరీ సునీల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వుల లేఖను పంపారు. నిధులను గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల వారీగా జమ చేసే అవకాశం ఉంది. కాగా, గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.379.34 కోట్ల రెండో అన్‌టైడ్ గ్రాంట్ నిధులను 20 రోజుల కిందట రాష్ట్రంలోని మూడు రకాల కేటగిరి గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ రూ.379.34 కోట్లను మూడు కేటగిరి గ్రామీణ స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. తాజా నిధులను పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లు గ్రామాల్లో తాగు నీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఏపీ, తెలంగాణకు 'సుప్రీం' నోటీసులు

ఉక్రెయిన్ విద్యార్థుల పిటిషన్లపై విచారణ సెప్టెంబర్ 5కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: భారత్‌లో వైద్య విద్య కొనసాగించేలా ఆదేశాలివ్వాలంటూ ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు ఆర్.బసంత్, రవి సిక్రీ, న్యాయవాది రమేశ్ అల్లంకి వాదనలు వినిపించారు. రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులు సుమారు 20 వేల మందికి దేశంలో వైద్యవిద్య కొనసాగించేందుకు అనుమతించాలని కోరారు. ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన విద్యార్థులను ప్రైవేటు కళాశాలల్లో చేర్చడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు ఆగస్టు 3న విదేశీ వ్యవహారాల శాఖ లోక్‌సభ కమిటీ సమర్పించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా విద్యార్థుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ మెడికల్ కమిషన్ తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. "20 వేల మంది విద్యార్థులు అంటున్నారు. భారత దేశంలో అంతమందికి ప్రవేశాలు కల్పించగలమా? విద్యార్థులు మెరిట్ కాదు కదా?"అని జస్టిస్ హేమంత్ గుప్తా ప్రశ్నించారు.

వారంతా నీట్ ఉత్తీర్ణులే...

పిటిషనర్లు తక్కువ మెరిట్ ఏమీ కాదని, దేశంలోని ప్రైవేటు కళాశాలల్లో రుసుములు భరించలేక ఉక్రెయిన్ వెళ్లాల్సి వచ్చిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. ఉక్రెయిన్ వెళ్లిన విద్యార్థులు కూడా నీట్ ఉత్తీర్ణులు అయినవారేనని, పరిమిత సంఖ్యలో ఉన్న ప్రభుత్వ సీట్లలో వారికి ప్రవేశం దక్కలేదని వివరించారు. జీవితాన్ని, డబ్బుని పెట్టుబడిగా పెట్టిన విద్యార్థులు అనుకోని ఘటనల కారణంగా కోర్సు మధ్యలోనే వదిలేయాల్సి వచ్చిందని, ఇలాంటి అసాధారణ పరిస్థితిని గుర్తించాలని న్యాయవాదులు కోరారు. కరోనా నేపథ్యంలో విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేయలేకపోయిన విద్యార్థుల నిమిత్తం పాలసీ రూపొందించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుపై ధర్మాసనం ఈ సందర్భంగా ఆరా తీసింది. అనంతరం తదుపరి విచారణ సెప్టెంబరు 5కు వాయిదా వేస్తూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, కేంద్రం, నేషనల్ మెడికల్ కమిషన్లకు కౌంటరు దాఖలు చేయాలని కోర్టు నోటీసులు జారీ చేసింది.

మదర్ థెరిసా స్ఫూర్తితో బహుజన హక్కులు సాధిస్తాం

బహుజన పరిరక్షణ సమితి

తాడికొండ: మదర్ థెరిసా స్ఫూర్తితో బహుజనుల హక్కులను సాధించి విజయ బావుటా ఎగురవేస్తామని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 698వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పలువురు పాల్గొన్నారు. పేదలకు రాజధాని ప్రాంతంలో 54 వేల పట్టాలు అందజేస్తే సామాజిక అసమతుల్యత వస్తుందని కోర్టులో చంద్రబాబు తప్పుడు కేసులు వేయించారని మండిపడ్డారు. అభివృద్ధి అందరికీ అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోన్న సీఎం వైఎస్ జగన్ పాలనకు బహుజనులంతా సంతృప్తితో ఉన్నారని చెప్పారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయము
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు.

Rc. G1/310/2022. Dt. 25.08.2022

ఫారం నెం. 6(ఎ)

2013 సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసము, పునః స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19 సబ్ రూల్ (1) ననుసరించి.

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ సూచించిన షెడ్యూల్ దాఖలా భూమలకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం మొహమ్మదాపురం గ్రామం నందు నెల్లూరుకు పోయే పైపు లైన్ కొరకు విరువూరు గ్రామములో యె 1.45 ట్ల పట్టా భూమి ప్రజా ప్రయోజనాల నిమిత్తము అవసరమని, భూమి కావలయునని శ్రీయుత జిల్లా . కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013 వ సంవత్సరము వ చట్టం వలన భూసేకరణ పునరావాసం పునస్థాపనలలో న్యాయ పరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19 సబ్ రూల్ (I). అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు. శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు వారు చట్టములోని విభాగము 12. క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించేందుకు శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారికి, వారి సిబ్బంది పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, మరియు శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకము మరియు కొనుగోలు (క్రయ, విక్రయాలు) ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

భూ సేకరణపై ఏమైనా అభ్యంతరములు ఆక్షేపణలు ఉన్న యెడల సంభందించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరవై) దినములలోగా భూసేకరణ అధికారి మరియు శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

సంబంధిత భూముల యొక్క ప్లానులు కార్యాలయపు పని దినములలో శ్రీయుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరు, నెల్లూరు, వారి కార్యాలయములోగాని, శ్రీయుత నెల్లూరు రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయములో గాని తనిఖీ చేసుకొనవచ్చును.

కావున పైన చెప్పబడిన ప్రాజెక్ట్ కొరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం లోని, విరువూరు గ్రామం నందు విస్తీర్ణం యె.1.45 సెంట్లు లేదా హెక్టార్ల లో 0.586806 వాటి భూముల వివరములు క్రింది విధంగా ఉన్న వని తెలియజేయటమైనది.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : పొదలకూరు మండలం విరువూరు గ్రామం నందు వాటర్ సప్లై స్కీమ్ పైపు లైను నిర్మాణము కొరకు

జిల్లా: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలము: పొదలకూరు | గ్రామము: విరువూరు

క్రమ సంఖ్య	సర్వే నెం./సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం	భూమి రకం	సేకరించిన విస్తీర్ణం (ఎకరాలు)	సంబంధిత ఆసామి పేరు మరియు పట్టదారుచిరునామా (పట్టాదారు/అనుభవదారు)	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు మరియు ఇతర వివరములు
1.	30-1A	2.72	పట్టా (మాగాణి)	0.09	ఐచ్చుల సురేశ్ కుమార్ రెడ్డి	ప్రభుత్వ భూమి	ఐచ్చుల సురేశ్ కుమార్ రెడ్డి	శ్రీనివాసులు రెడ్డి	ప్రభుత్వ భూమి	వరి పైరు
2.	30-2B	0.50	పట్టా (మాగాణి)	0.03	పంచాయతీ స్థలం	ప్రభుత్వ భూమి	పంచాయతీ స్థలం	ఐచ్చుల సురేశ్ కుమార్ రెడ్డి	ప్రభుత్వ భూమి	ఖాళీ స్థలం
3.	31-1	1.87	పట్టా (మాగాణి)	0.13	శ్రీ రామమందిరం	ప్రభుత్వ భూమి	గొరపు శ్రీనివాసులు	పయ్యల రావమ్మ	ఐచ్చుల సురేశ్ కుమార్ రెడ్డి	ఖాళీ స్థలం
4.	32-1A	0.73	పట్టా (మాగాణి)	0.05	పయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	గొరపు శ్రీనివాసులు	వరి పైరు
5.	32-2A	0.75	పట్టా (మాగాణి)	0.04	పయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	వరి పైరు
6.	32-3A	0.39	పట్టా (మాగాణి)	0.02	పయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	వరి పైరు
7.	32-4A	0.64	పట్టా (మాగాణి)	0.04	పయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	పయ్యల రావమ్మ	వరి పైరు
8.	32-5A	0.60	పట్టా (మాగాణి)	0.04	సూతి శ్రీనివాసులు తండ్రి చిన పెంచలయ్య	ప్రభుత్వ భూమి	సూతి పెంచలయ్య	సూతి శ్రీనివాసులు	పయ్యల రావమ్మ	వరి పైరు
9.	33-1A	2.87	పట్టా (మాగాణి)	0.09	సూతి శ్రీనివాసులు తండ్రి చిన పెంచలయ్య	ప్రభుత్వ భూమి	సూతి శ్రీనివాసులు	ఐచ్చుల సుమేధ	సూతి కృష్ణయ్య	వరి పైరు , బోరు-1, షెడు-1
10.	33-2A	1.05	పట్టా (మాగాణి)	0.11	సూతి చిన పెంచలయ్య	ప్రభుత్వ భూమి	సూతి కృష్ణయ్య	సూతి శ్రీనివాసులు	సూతి చిన పెంచలయ్య	వరి పైరు
11.	33-2A		పట్టా (మాగాణి)	0.06	సూతి శ్రీనివాసులు	ప్రభుత్వ భూమి	సూతి కృష్ణయ్య	సూతి శ్రీనివాసులు	సూతి చిన పెంచలయ్య	వరి పైరు
12.	34-1	1.46	పట్టా (మాగాణి)	0.14	ఐచ్చుల సుమేధా భర్త సురేశ్ కుమార్ రెడ్డి	ప్రభుత్వ భూమి	ఐచ్చుల సుమేధ	డొంక	సూతి శ్రీనివాసులు	వరి పైరు, బోరు-1, షెడు-1, టెంకాయ చెట్టు-1
13.	36-2A	0.66	పట్టా (మాగాణి)	0.07	చిల్లా నిర్మలా భర్త రామచంద్రా రెడ్డి	డొంక	చిల్లా గిర్జాతి	చిల్లా గిర్జాతి	డొంక	వరి పైరు
14.	37-2	1.60	పట్టా (మాగాణి)	0.34	చిల్లా నిర్మలా భర్త రామచంద్రా రెడ్డి	ప్రభుత్వ భూమి	చిల్లా గిర్జాతి	చిల్లా పెంచల రెడ్డి	చిల్లా పెంచల రెడ్డి	వరి పైరు , బోరు-1, షెడు-1
15.	38-1	8.05	పట్టా (మాగాణి)	0.20	చిల్లా పెంచల రెడ్డి తండ్రి విజయ నరశింహా రెడ్డి	చిల్లా పెంచల రెడ్డి	రోడ్డు	కాలువ	చిల్లా రామచంద్ర రెడ్డి	వరి పైరు
మొత్తము		23.89		1.45						

సం/- కె.వి.యన్. చక్రధర్ బాబు,IAS
జిల్లా కలెక్టర్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు.

కాంగ్రెస్‌కు ఆజాద్ గుడ్‌బై

- 50 ఏళ్ల అనుబంధానికి తెర
- రాహుల్‌పై నిప్పులు, సోనియాకు లేఖ
- అపరిపక్వత, సీనియర్లను గౌరవించదని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: వరుస పరాజయాలు, నేతల నిష్క్రమణతో నీరసించిన కాంగ్రెస్‌కు మరో భారీ షాక్. గాంధీల కుటుంబానికి విధేయుడైన సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్ (73) కాంగ్రెస్‌ను వీడారు. పార్టీతో ఐదు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకున్నారు. అన్ని పదవులతో పాటు ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. రాహుల్‌గాంధీపై ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. ఇప్పటిదాకా పార్టీ వీడిన ఏ నాయకుడూ చేయని రీతిలో తీవ్ర విమర్శలు చేశారు. ''రాహుల్‌వి పిల్ల చేష్టలు. సీనియర్లను గౌరవించని తత్వం'' అంటూ దుయ్యబట్టారు. అలాంటి అపరిపక్వ వ్యక్తి నాయకత్వంలో పనిచేయలేనంటూ అధినేత్రి సోనియాగాంధీకి ఐదు పేజీల లేఖ రాశారు. ''పార్టీలో సంప్రదింపుల యంత్రాంగాన్ని రాహుల్ పూర్తిగా కుప్పకూల్చారు. ప్రశ్నించిన సీనియర్లపై కోటరీతో వ్యక్తిగత దాడి చేయించారు. శవయాత్రలు చేయించారు. పార్టీని అన్నివిధాలుగా పతనావస్థకు చేర్చారు. ఏమాత్రం సీరియస్‌నెస్ లేని అలాంటి వ్యక్తికే పగ్గాలిచ్చేందుకు నాయకత్వం ఎనిమిదేళ్లుగా విఫలయత్నం చేస్తూ వచ్చింది. తద్వారా జాతీయ స్థాయిలో బీజేపీని, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను చేజేతులారా అందలమెక్కించింది'' అని ఆరోపించారు. అందుకే బరువెక్కిన హృదయంతో పార్టీతో నా 50 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకోవాలనే నిర్ణయానికి వచ్చానన్నారు. భారత్ జోడో యాత్ర ప్రారంభించడానికి ముందు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ జోడో అంటూ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్‌లో అసమ్మతి నేతలతో కూడిన జీ23 గ్రూప్‌లో ఆజాద్ కీలక నేతగా వ్యవహరించడం, పార్టీ తీరును కొన్నేళ్లుగా విమర్శిస్తూ ఉండటం తెలిసిందే. ఆయన రాజీనామాను దురదృష్టకరంగా కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. బీజేపీతో పోరు కీలక దశకు చేరిన సమయంలో ఇలా చేయడం దారుణమంటూ వాపోయింది. ఆజాద్ డీఎన్ఏ 'మోదీ'పై అయిందంటూ దుయ్యబట్టింది. ఏడాది కాలంలో దాదాపు15 మంది దాకా నేతలు కాంగ్రెస్‌ను వీడారు!



రాహుల్ రాకతో సర్వం నాశనం

సోనియాకు రాసిన లేఖలో రాహుల్ తీరును ఆజాద్ తూర్పారబట్టారు. ''పార్టీ అధినేత్రిగా కేంద్రంలో యూపీఏ1, 2 ప్రభుత్వాల ఏర్పాటులో మీరు కీలక పాత్ర పోషించారు. సీనియర్ల సలహాలను పాటించడం, వారి తీర్పును విశ్వసించడం, వారికి అధికారాలప్పగించడం అందుకు ప్రధాన కారణాలు. దురదృష్టవశాత్తు 2013లో రాహుల్ ఉపాధ్యక్షుడయ్యాక పార్టీలో సంప్రదింపుల యంత్రాంగాన్నే కుప్పకూల్చారు. సీనియర్లు, అనుభవజ్ఞులైన నాయకులందరినీ పక్కన పెట్టారు. ఏ అనుభవమూ లేని కొత్త కోటరీయే పార్టీ వ్యవహారాలను నడుపుతోంది. కాంగ్రెస్ కోర్ గ్రూప్‌లో పొందుపరిచి, కేంద్ర మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించి, రాష్ట్రపతి కూడా ఆమోదముద్ర వేసిన ఆర్డినెన్స్‌ను రాహుల్ మీడియా ముందు చించిపారేశారు. ఇలాంటి చిన్నపిల్లల ప్రవర్తన వల్లే 2014లో అధికారానికి దూరమయ్యాం. ముందు సోనియా, తర్వాత రాహుల్ నాయకత్వంలో 2014–22 మధ్య 49 అసెంబ్లీ ఎన్నికలకు గాను ఏకంగా 39సార్లు ఘోరంగా ఓడిపోయాం. వరుసగా రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం పాలయ్యాం. పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యవర్గ సభ్యునిగా నేనిచ్చిన ప్రతిపాదనలన్నీ స్టోర్ రూమ్‌కే పరిమితమయ్యాయి. 2013 జైపూర్ చింతన్‌శిబిర్‌లో పార్టీ పునరుజ్జీవం కోసం చేసిన సిఫార్సులదీ తొమ్మిదేళ్లుగా అదే గతి! రాహుల్‌కు వ్యక్తిగతంగా పదేపదే గుర్తు చేసినా వాటిని పట్టించుకోలేదు. పార్టీని గాడిలో పెట్టేందుకు 23మంది సీనియర్లం లేఖలు రాస్తే రాహుల్ కోటరీ నేతలు మాపై వ్యక్తిగత దాడి చేసి అవమానించారు. కోటరీ ఆదేశాల మేరకు జమ్మూలో నా శవయాత్ర చేశారు. ఇంకో సీనియర్ ఇంటిపైకి గూండాలను పంపారు. వారిని రాహుల్ వ్యక్తిగతంగా సన్మానించారు'' అని ఆరోపించారు. రిమోట్ కంట్రోల్ మోడల్ ద్వారా యూపీఏ ప్రభుత్వ సమగ్రతను కుప్పకూల్చారంటూ సోనియాపైనా ఆజాద్ విమర్శలు గుప్పించారు. ''మన ఓటమికి కారణమైన అదే మోడల్‌ను పార్టీకీ వర్తింపజేసి రాహుల్ సర్వనాశనం చేశారు. కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రహసనం, బూటకం. దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ స్థాయిలోనూ ఎన్నికలు జరగలేదు. ఏఐసీసీ కార్యాలయంలో కూర్చున్న కోటరీ తయారు చేసిన కమిటీ జాబితాలపై సంతకం చేయాల్సిందిగా బలవంతపెట్టారు'' అంటూ దుయ్యబట్టారు.

కోటరీ గుప్పెట్లో బందీ

కోటరీ గుప్పెట్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బందీ అయిందని ఆజాద్ ఆరోపించారు. ''తద్వారా పోరాట పటిమను, కాంక్షను పూర్తిగా కోల్పోయింది. పుంజుకునే అవకాశమే లేనంతగా పతనావస్థకు చేరింది. ఇప్పుడు కూడా అసమర్థులకు పగ్గాలు అప్పగించే ఫార్సు మొదలవబోతోంది'' అని కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను ఉద్దేశించి ఆరోపించారు. ''ఇదీ విఫల ప్రయోగంగా మిగిలిపోతుంది. ఎందుకంటే మళ్లీ ఓ కీలుబొమ్మనే గద్దెనెక్కిస్తారు'' అన్నారు. స్వాతంత్ర్యం అమృతోత్సవాల వేళ పార్టీకి ఇంతటి దురవస్థ ఎందుకు ప్రాప్తించిందో ఏఐసీసీ నాయకత్వం తనను తాను ప్రశ్నించుకోవాలని సూచించారు. తను, తన సహచరులం జీవితాంతం నమ్మిన విలువల కోసం కృషి చేస్తామని చెప్పారు. కపిల్ సిబల్, అశ్వనీకుమార్ తదితర నేతలు కాంగ్రెస్‌ను వీడటం తెలిసిందే.

ఆజాద్ నైజం బయటపడింది: కాంగ్రెస్

దశాబ్దాల పాటు అన్ని పదవులూ అనుభవించి కీలక సమయంలో పార్టీని వీడటం ద్వారా ఆజాద్ తన అసలు నైజం బయట పెట్టుకున్నారంటూ కాంగ్రెస్ మండిపడింది. పదవి లేకుండా ఆజాద్ క్షణం కూడా ఉండలేరంటూ ఏఐసీసీ మీడియా హెడ్ పవన్ ఖేరా చురకలు వేశారు. ''అందుకే రాజ్యసభ సభ్యునిగా పదవీకాలం ముగియగానే పార్టీ వీడారు. పార్టీని బలహీనపరిచేందుకు నిత్యం ప్రయత్నించారు. ఇప్పుడేమో పార్టీ బలహీనపడిందని విమర్శలు చేస్తున్నారు'' అంటూ ఆక్షేపించారు. రాహుల్‌పై ఆజాద్ విమర్శలను కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ కొట్టిపారేశారు. ''మోదీని పార్లమెంటులోనే ఆజాద్ ఆకాశానికెత్తారు. పద్మభూషణ్ స్వీకరించారు. ఆయన రిమోట్ మోదీ చేతిలో ఉందనేందుకు ఇవన్నీ నిదర్శనాలు'' అంటూ ట్వీట్ చేశారు. ఆజాద్‌కు కాంగ్రెస్ అన్నీ ఇచ్చిందని ఆ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే గుర్తు చేశారు. రాహుల్‌పై ఆయనా చేసిన విమర్శలు దారుణమన్నారు. పార్టీలో పదవులు అనుభవించి ఇప్పుడిలాంటి విమర్శలు చేయడం ఆజాద్ దిగజారుడుతనానికి నిదర్శనమని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోట్ అన్నారు.

రాహుల్‌పై ఆజాద్ ఆరోపణలు...

- రాహుల్ ఏ మాత్రం పరిపక్వత లేని వ్యక్తి. అన్నీ పిల్లచేష్టలే. ఆయన రంగప్రవేశంతో, ముఖ్యంగా 2013లో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడయ్యాక పార్టీ సర్వనాశనమైంది.
- అనుభవజ్ఞులైన సీనియర్లందరినీ రాహుల్ పక్కన పెట్టారు. తొత్తులతో కూడిన కోటరీ ద్వారా పార్టీని నడుపుతూ భ్రష్టు పట్టించారు.
- సోనియా పేరుకే పార్టీ చీఫ్. ముఖ్య నిర్ణయాలన్నీ రాహుల్‌వే. కొన్నిసార్లు ఆయన సెక్యూరిటీ గార్డులు, పీఏలూ నిర్ణయాలు తీసేసుకుంటున్న దారుణ పరిస్థితి నెలకొంది!
- ప్రభుత్వ ఆర్డినెన్స్‌ను మీడియా సాక్షిగా చించేయడం రాహుల్ అపరిపక్వతకు పరాకాష్ట. ప్రధాని అధికారాన్ని పూర్తిగా పార్టీ ముందు మోకరిల్లేలా చేసిన ఈ పిల్లచేష్ట 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ ఘోర ఓటమికి ప్రధాన కారణంగా నిలిచింది.
- కాంగ్రెస్‌ను పూర్తిగా చెప్పుచేతల్లో పెట్టుకునే క్రమంలో రాహుల్ నేతృత్వంలోని చెంచాల బృందం పార్టీకి చెప్పలేనంత ద్రోహం తలపెట్టింది. జాతీయోద్యమానికి నాయకత్వం వహించి దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన పార్టీ వారివల్లే ఇప్పుడు శిథిలావస్థకు చేరింది.
- 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత సారథ్య బాధ్యతల నుంచి తప్పుకునే ముందు పార్టీ కోసం జీవితాలను ధారపోసిన సీనియర్ నాయకులందరినీ వర్కింగ్ కమిటీ భేటీలోనే రాహుల్ తీవ్రంగా అవమానించారు.

విధేయుని అసమ్మతి



సోనియా గాంధీ, రాహుల్‌తో గులాం నబీ ఆజాద్(ఫైల్)

గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్‌ను వీడటం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. ఆయన కొంత కాలంగా పార్టీపై బాహాటంగానే అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. గాంధీ కుటుంబానికి విధేయుడిగా దశాబ్దాల పాటు ఆయన పార్టీలో, ప్రభుత్వంలో ఎన్నో కీలక పదవులు అనుభవించారు.

ఏ సంక్షోభాన్నయినా సులువుగా పరిష్కరిస్తారని పేరు తెచ్చుకున్నారు. ఏ రాష్ట్రంలోనైనా పార్టీలో చీలికలొచ్చినా, ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలన్నా అధిష్టానానికి మొదట గుర్తుకొచ్చే పేరు ఆజాదే. ఎన్నో రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అంతర్గత సమస్యల్ని తనదైన శైలిలో పరిష్కరించారు.

నాయకత్వంపై బహిరంగ విమర్శలు

1970లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచీ అర్ధ శతాబ్దం పాటు గాంధీల కుటుంబానికి వీరవిధేయుడిగా ఆజాద్‌కు పేరుంది.

అలాంటి నేత దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రాభవాన్ని కోల్పోతున్న సమయంలో పార్టీకి కాయకల్ప చికిత్స జరగాలనే డిమాండ్‌తో 2020లో ఏర్పాటైన జీ23 సభ్యుల గ్రూప్‌లో ఆజాద్ కీలకంగా వ్యవహరించడం అందరినీ విస్మయానికి లోను చేసింది. ఇప్పటికైనా మేల్కొనకపోతే పార్టీ మునిగిపోతుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పార్టీలో కలకలం రేపాయి. నాటినుంచీ పలు సందర్భాల్లో పార్టీ నాయకులపై ఆజాద్ తీవ్ర విమర్శలు చేస్తూనే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరసగా ఓటముల నేపథ్యంలో పార్టీలోని ఫైవ్ స్టార్ కల్చర్‌ను ఏకిపారేశారు. 'టికెట్ రాగానే మా నాయకులు ఫైవ్ స్టార్ హోటల్ రూమ్ బుక్ చేస్తారు. ఏసీ కారులేకుండా బయటకు అడుగు కూడా వేయరు. ఈ సంస్కృతి మారనిదే ఎవరూ గెలవలేరు'' అన్నారు.

మోదీపై 'వీడ్కోలు' పొగడ్తలు

ఈ ఏడాది జనవరిలో కేంద్రం ఆజాద్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. అప్పుడే ఆయన బీజేపీలో చేరతారన్న విశ్లేషణలు వినిపించాయి. దాన్ని ఆయన స్వీకరించరని పార్టీ ఆశించింది. కానీ ఆజాద్ మౌనమే వహించారు. ఎనిమిదిసార్లు రాజ్యసభ ఎంపీగా చేసిన ఆయన, తాజాగా ఫిబ్రవరిలో పదవీ కాలం ముగిసిన సందర్భంగా చేసిన వీడ్కోలు ప్రసంగం కూడా కలకలం రేపింది. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు ప్రధాని మోదీని కూడా ఆకాశానికెత్తారు. ''మోదీపై నేనెన్నోసార్లు మాటల దాడి చేశా. అయినా ఆయనెప్పుడూ వ్యక్తిగతంగా తీసుకోలేదు. అందుకు ధన్యవాదాలు. ఆయనకు కృతజ్ఞుడినై ఉంటా'' అని చెప్పుకొచ్చారు. ఇటీవల జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ పదవి చేపట్టడానికి ఆజాద్ నిరాకరించారు.

సొంత కుంపటే!

బీజేపీలో చేరతారన్న ఊహాగానాలకు ప్రస్తుతానికైతే ఆజాద్ తెరదించారు. ''కశ్మీర్‌లో ఎన్నికలున్నందున సొంత పార్టీ పెట్టి బరిలో దిగుతా. అక్కడ గెలిచాక జాతీయ స్థాయిలో పార్టీని విస్తరిస్తా'' అని ఓ చానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఆ పార్టీ వెనక బీజేపీ హస్తమే ఉందంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

దేశవ్యాప్తంగా 21 నకిలీ వర్సిటీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ నకిలీ యూనివర్సిటీ అని విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ) ప్రకటించింది. దేశవ్యాప్తంగా 21 నకిలీ యూనివర్సిటీల వివరాలను బహిర్గతం చేసింది. ఆయా వర్సిటీలు యూజీసీ చట్టానికి విరుద్ధంగా పనిచేస్తున్నాయని పేర్కొంది. వాటికి ఎలాంటి డిగ్రీలను అందజేసే అధికారం లేదని తేల్చిచెప్పింది. ఢిల్లీలో 8, ఉత్తరప్రదేశ్‌లో 4, పశ్చిమబెంగాల్‌లో 2, ఒడిశా లో 2, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరిల్లో ఒక్కొక్కటి చొప్పున నకిలీ యూ నివర్సిటీలు ఉన్నట్లు వెల్లడించింది.

డ్రగ్ టెస్టులో పైలట్ ఫెయిల్

న్యూఢిల్లీ: డ్రగ్ పరీక్షలో విఫలమైన ప్రముఖ విమానయాన సంస్థ పైలట్‌ను ఫ్లైట్ డ్యూటీ నుంచి తొలగించినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) శుక్రవారం వెల్లడించారు. పైలట్లకు డ్రగ్ టెస్టు నిర్వహించడం ఈ ఏడాది జనవరి 31 నుంచి ప్రారంభమయ్యింది. తాజా కేసుతో కలుపుకొని ఇప్పటిదాకా నలుగురు పైలట్లు, ఒక ఏటీసీ అధికారి ఈ టెస్టులో ఫెయిలయ్యారు. విమానయాన సిబ్బంది మాదక ద్రవ్యాలు తీసుకున్న తేలితే మొదట డి–అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తారు. రెండోసారి కూడా పరీక్షలో ఫెయిలైతే మూడేళ్ల పాటు విధుల నుంచి సస్పెండ్ చేస్తారు. మూడోసారి సైతం ఫెయిలైతే లైసెన్స్ రద్దు చేస్తారు.

'ఉచితాల'పై లోతైన అధ్యయనం జరగాలి

న్యూఢిల్లీ: ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు 'ఉచిత' హామీలను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ బాధ్యతను ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సుప్రీంకోర్టు అప్పగించింది. నాలుగు వారాల తర్వాత విచారణ ప్రారంభించాలని ధర్మసనానికి సూచించింది. ఉచిత హామీలను అడ్డుకోవాలని సీనియస్ అడ్వొకేట్ అశ్వినీ కుమార్‌తోపాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఉచితాలపై లోతైన అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఉచిత హామీలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ల విషయంలో కొన్ని ప్రాథమిక అంశాలపై చర్చ జరగాలని పేర్కొంది. ఎస్.సుబ్రమణియం బాలాజీ వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం, ఇతరుల కేసులో 2013లో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలన్న వాదనలు విని పిస్తున్నాయని వెల్లడించింది. ఉచిత హామీల విషయంలో సంక్లిష్టతలను, ద్విసభ్య ధర్మాసనం తీర్పును దృష్టిలో పెట్టుకొని వ్యాజ్యాలపై విచారణ బాధ్యతను త్రిసభ్య ధర్మాసనానికి అప్పగిస్తున్నట్లు స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు ఇస్తున్న ఉచిత హామీలు ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారుతున్నాయంటూ పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారని గుర్తుచేసింది. ''ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లే అంతిమ న్యాయ నిర్ణేతలు. ఏ పార్టీ లేదా ఏ అభ్యర్థి అధికారంలోకి రావాలో ఓటర్లే నిర్ణయిస్తారు. పదవీ కాలం ముగిసిన తర్వాత సదరు పార్టీ లేదా అభ్యర్థి పనితీరు ఎలా ఉందో ఓటర్లే నిర్ణయించుకొని, తదుపరి ఎన్నికల్లో తీర్పు చెప్తారు'' అని ధర్మాసనం ఉద్ఘాటించింది.

మాటల యుద్ధం

- ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆప్ వర్సెస్ బీజేపీ
- సభ నుంచి 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల గెంటివేత
- కేంద్ర ప్రభుత్వాన్ని సీరియల్ కిల్లర్‌గా పేర్కొన్న సీఎం కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం రణరంగాన్ని తలపించింది. ఆపరేషన్ లోటస్, లిక్కర్ కుంభకోణంపై సభలో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ సభ్యుల పరస్పర నిందారోపణలు, నినాదాలతో మారుమోగింది. ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందనే ఆరోపణలపై చర్చించేందుకు, తాము సాధించిన విజయాలను వివరించేందుకు కేజ్రీవాల్ ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపర్చింది. అయితే, బీజేపీ తమ వారిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొంటూ ఆప్ సభ్యులు డబ్బు–డబ్బు(ఖోకా–ఖోకా) అంటూ నినాదాలు ప్రారంభించారు. పోటీగా బీజేపీ సభ్యులు కేజ్రీవాల్ సర్కార్ లిక్కర్ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపిస్తూ మోసం–మోసం (ధోఖా–ధోఖా) అంటూ ప్రతినినాదాలకు దిగారు. దీంతో డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా వారిని సముదాయించేందుకు యత్నించారు. నిబంధనలకు విరుద్ధంగా సభా కార్యక్రమాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్నారంటూ అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈ విషయంలో తన ప్రశ్నకు జవాబివ్వకుండా, కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తున్నారంటూ బీజేపీకి చెందిన మొత్తం 8 మందినీ డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా మార్షల్స్‌తో బయటకు గెంటించివేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

అభద్రతాభావంలో ప్రధాని మోదీ

ఆప్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం కేజ్రీవాల్, మాట్లాడారు. తమ పార్టీ ఎమ్మెల్యేలెవరూ బయటకు వెళ్లలేదని నిరూపించేందుకు ఈ నెల 29న అసెంబ్లీలో బలపరీక్ష చేపట్టాలనుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ చేపట్టిన ఆపరేషన్ లోటస్ కాస్తా ఆపరేషన్ బురద జల్లుడుగా మారిందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు బీజేపీ సీరియల్ కిల్లర్ మాదిరిగా కాచుక్కూర్చుందన్నారు. ప్రధాని మోదీలో అభద్రతాభావం పెరిగిపోయిందని డిప్యూటీ సీఎం సిసోడియా పేర్కొన్నారు.

వాట్సాప్‌ను తప్పుపట్టిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక వేదిక వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీని ఢిల్లీ హైకోర్టు ఆక్షేపించింది. యూజర్లను 'స్వీకరించండి లేదా వదిలేయండి' అనే పరిస్థితిలోకి నెట్టేలా ఈ విధానం ఉందని పేర్కొంది. ఎండమావుల వంటి చాయిస్‌లతో వాట్సాప్‌తో ఒప్పందం కుదుర్చుకునేలా యూజర్లను ఒత్తిడి చేస్తోందని, వారి వ్యక్తిగత డేటాను మాతృసంస్థ ఫేస్‌బుక్‌తో షేర్ చేసుకుంటోందని తప్పుపట్టింది. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీపై దర్యాప్తు జరపాలంటూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టి వేసింది.

ఫోగాట్‌ది హత్యే

- డ్రింక్స్‌లో డ్రగ్స్ కలిపి తాగించారు
- అనుచరుల పనే: గోవా పోలీసులు



పనాజీ: బీజేపీ నాయకురాలు, టీవీ నటి సొనాలీ ఫోగాట్‌ది సాధారణ మరణం కాదని, దారుణ హత్యేనని తేలింది. ఆమె అనుచరులు సుధీర్ సగ్వాన్, సుఖ్వీందర్ సింగ్ ఈ దారుణానికి పాల్పడ్డట్టు గోవా పోలీసులు వెల్లడించారు. ఆమె డ్రింక్‌లో 1.5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ కలిపి తాగించినట్టు విచారణలో తేలిందన్నారు. దానివల్లే ఆమె మరణించారని గోవా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఓంవీర్ సింగ్ బిష్ణోయ్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక కారణాలే హత్యకు దారి తీసినట్టు భావిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఫోగాట్‌కు డ్రగ్స్ తాగించినట్టు సగ్వాన్, సుఖ్వీందర్ అంగీకరించారు. ఆమె శరీరం స్వాధీనం తప్పి నడవలేకపోవడంతో ఆగస్టు 23 తెల్లవారుజామున 4.30 ప్రాంతంలో ఆమెను పట్టుకుని వాష్‌రూమ్‌లోకి తీసుకెళ్లారు. ఇదంతా సీసీటీవీలో రికార్డయింది. 2 గంటలకు పైగా లోపలే ఉన్నారు. ఆ సమయంలో ఏం జరిగిందో చెప్పడం లేదు'' అని బిష్ణోయ్ తెలిపారు. సోనాలీ గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు తొలుత ప్రకటించడం తెలిసిందే. కానీ ఆమె శరీరంపై గాయాలున్నాయని, వాటివల్లే మరణించిందని పోస్టుమార్టం నివేదికలో తేలింది. సోదరుడు రింకూ ఫిర్యాదుతో నిందితులను అరెస్టు చేసి విచారించగా నిజం బయటికొచ్చింది. ఆమెపై అత్యాచారం కూడా చేశారని రింకూ ఆరోపిస్తున్నారు.

న్యాయవ్యవస్థను బలోపేతం చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపు



వీడ్కోలు సమావేశంలో అభివాదం చేస్తున్న సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యు.యు. లలిత్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో న్యాయవ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. సమ వాటాదారులైన కేంద్ర ప్రభుత్వం, బార్, బెంచ్‌లు ఈ మేరకు చొరవ తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఎన్నో పోరాటాల తర్వాతే ఈ స్థాయికి చేరుకున్నానని, ఆ క్రమంలో అనేక కుట్రపూరిత పరిశీలనలకు గురయ్యాయని చెప్పారు. తన పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడారు. బాల్యం నుంచి సీజేఐ వరకూ సుదీర్ఘ ప్రయాణంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు. తల్లిదండ్రులను, విద్యనేర్పిన గురువులను స్మరించుకున్నారు. తన అనుభవాల్లో తీపి కంటే చేదు ఎక్కువగా ఉందన్నారు. అనేక ఆందోళనలు, పోరాటాల్లో భాగస్వామి అయిన తాను ఎమర్జెన్సీ సమయంలో బాధలు పడ్డానని తెలిపారు. ఆయా అనుభవాలే ప్రజలకు సేవ చేయాలన్న అభిరుచిని తనలో పెంపొందించాయని వ్యాఖ్యానించారు. మొదటి తరం న్యాయవాదిగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని, విజయాలకు షార్ట్‌కట్ ఉండదని తెలుసుకున్నానని వెల్లడించారు. ఎప్పటికైనా సత్యమే జయిస్తుందని ఉద్ఘాటించారు.

న్యాయ వ్యవస్థ ఉద్దేశం అదే..

గొప్ప న్యాయమూర్తినని తాను ఎప్పుడూ చెప్పుకోలేదని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. సామాన్యులకు న్యాయం చేయడమే న్యాయ వ్యవస్థ అంతిమ ఉద్దేశమని నమ్ముతానన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి బార్ కృషి చేయాలని కోరారు. న్యాయ వ్యవస్థపై సాధారణ ప్రజల్లో అవగాహన, విశ్వాసం పెంపొందించాలని అన్నారు. న్యాయవ్యవస్థను భారతీయాకరణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 16 నెలల తన పదవీ కాలంలో 11 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, 15 మంది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, 224 మంది హైకోర్టు న్యాయమూర్తుల నియామకం జరిగిందని గుర్తుచేశారు. న్యాయ వ్యవస్థ సమస్యలు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని వివరించారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను భీష్మ పితామహుడిగా జస్టిస్ ఎన్వీ రమణ అభివర్ణించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ వికాస్ సింగ్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీజేఐ (నియమిత) జస్టిస్ యు.యు.లలిత్ మాట్లాడారు. హైకోర్టుల్లో నియామకాలు, మౌలిక సదుపాయాల కోసం జస్టిస్ ఎన్వీ రమణ సాగించిన కృషిని అభినందించారు. నూతన సీజేఐగా తన పదవీ కాలంలో కేసుల జాబితా, అత్యవసర విషయాల ప్రస్తావన, రాజ్యాంగ ధర్మాసనాలపై దృష్టి సారిస్తానన్నారు.

పెండింగ్ కేసులే అతిపెద్ద సవాల్

విచారించాల్సిన కేసుల జాబితా సమస్యలను పరిష్కరించడంపై తగిన శ్రద్ధ చూపలేకపోయినందుకు జస్టిస్ ఎన్వీ రమణ క్షమాపణలు కోరారు. దేశంలోని కోర్టులు పెండింగ్ కేసుల రూపంలో అతిపెద్ద సవాలును ఎదుర్కొంటున్నాయని చెప్పారు. న్యాయ వ్యవస్థను ఒక ఉత్తర్వు, ఒక తీర్పుతో నిర్వచించలేమని, అదేవిధంగా ఒక తీర్పుతో మార్చలేమని పేర్కొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టుల పనితీరును సంస్కరించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. శాశ్వత పరిష్కారాలకు ఆధునిక సాంకేతికతను, కృత్రిమ మేధను వాడుకోవాలన్నారు. జస్టిస్ ఎన్వీ రమణ వీడ్కోలు సందర్భంగా సీనియర్ లాయర్ దుష్యంత్ దవే భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. జస్టిస్ ఎన్వీ రమణను ప్రజా న్యాయమూర్తి అంటూ కొనియాడారు.. జస్టిస్ రమణ సేవలను సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రశంసించారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో 34 మంది జడ్జీలతో సాయంతో పూర్తిస్థాయిలో పనిచేశారని జస్టిస్ రమణను అభినందించారు.

కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం

సుప్రీంకోర్టు శుక్రవారం చరిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచింది. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేపట్టిన విచారణలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. సుప్రీంకోర్టును ప్రజలకు చేరువ చేసే దిశగా జస్టిస్ ఎన్వీ రమణ తీసుకున్న చొరవను పలువురు అభినందించారు. అన్ని కోర్టుల నుంచి ప్రత్యక్ష ప్రసారాలు జరగాలని సీజేఐ ఆకాంక్షించారు. సుప్రీంకోర్టులో విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేయడం ఇదే మొదటిసారి.

నేడు జస్టిస్ యు.యు.లలిత్ ప్రమాణం

సుప్రీంకోర్టు 49వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి భవన్‌లో జస్టిస్ లలిత్‌తో ప్రమాణం చేయించనున్నారు.

ఇండియన్స్ గో బ్యాక్

వాషింగ్టన్: అమెరికాలో మరోసారి జాతి విద్వేషం బుసలు గొట్టింది. టెక్సాస్‌లో నలుగురు ఇండియన్ అమెరికన్ మహిళలపై మెక్సికన్ అమెరికన్ అయిన ఎస్మరాల్డా ఉప్టాన్ విద్వేషపూరితంగా దాడి చేసింది. అమెరికాని భారతీయులు నాశనం చేస్తున్నారని గో బ్యాక్ ఇండియా అని అరుస్తూ విషం చిమ్మింది. టెక్సాస్‌లోని డల్లాస్‌లో పార్కింగ్ ప్రాంతంలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు. ''నాకు భారతీయులంటే ద్వేషం. వాళ్లంతా మంచి లైఫ్ కోసం ఇక్కడికి వస్తున్నారు. ఈ దేశాన్ని నాశనం చేస్తున్నారు. గో బ్యాక్ ఇండియా'' అంటూ ఇద్దరు మహిళలపై చెయ్యి చేసుకుంది. ఈ దాడికి సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. బాధిత మహిళలు వారించినా ఆమె వినిపించుకోలేదు.పోలీసులు ఎస్మరాల్డాను అరెస్ట్ చేసి దాడి, గాయపరచడం, ఉగ్రవాద హెచ్చరికలు వంటి అభియోగాలు మోపారు. ఎస్మరాల్డా వద్ద తుపాకీ ఉండడంపై భారతీయ అమెరికన్లు ఆందోళన వ్యక్తం చేశారు.

సోరెన్‌పై వేటే!

- నేడు గవర్నర్ నిర్ణయం
- పాలక సంకీర్ణంలో ఆందోళన
- జేఎంఎం, కాంగ్రెస్ మల్లగుల్లాలు

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శాసనసభ్యత్వంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సొంతానికి మైనింగ్ లీజు కేటాయించుకున్నందుకు ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ గవర్నర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం సిఫార్సు చేయడం తెలిసిందే. దాంతో గవర్నర్ రమేశ్ బైస్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సీఎం శాసనసభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఆయన నిర్ణయం తీసుకున్నారంటూ శుక్రవారం మధ్యాహ్నం నుంచీ పుకార్లు షికారు చేశాయి. కానీ శనివారం నిర్ణయం వెలువడుతుందని రాజ్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి. ''సోరెన్‌పై వేటు ఖాయం శాసనసభ్యత్వాన్ని రద్దు చేస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకుంటారు. అదే విషయాన్ని ఈసీకి నివేదిస్తారు'' అని ఆ వర్గాలను ఉటంకిస్తూ వార్తలొస్తున్నాయి. ఇలాంటి విషయాల్లో ఈసీ అభిప్రాయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని నిబంధనలు ఉన్నందున మరోవిధంగా వ్యవహరించే అవకాశం లేదని చెబుతున్నారు. మరోవైపు ఈ పరిణామాలపై జార్ఖండ్‌లోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వంలో ఆందోళన మొదలైంది. సంకీర్ణ భాగస్వాములైన జేఎంఎం, కాంగ్రెస్ శుక్రవారం సోరెన్ నివాసంలో రెండుసార్లు సమావేశమై దీనిపై మల్లగుల్లాలు పడ్డాయి. 40 మంది దాకా ఎమ్మెల్యేలు కూడా భేటీకి హాజరయ్యారు. ఏం జరిగినా ప్రభుత్వ మనుగడకు ముప్పు లేకుండా చూసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. బీజేపీ ఆకర్షణలో పడి ఎమ్మెల్యేలు జారిపోకుండా పొరుగు రాష్ట్రాల్లో క్యాంపులకు తరలించే యోచన కూడా జరిగినట్టు చెబుతున్నారు. 81 మంది సభ్యుల జార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎంకు 30, కాంగ్రెస్‌కు 18 మంది, మరో భాగస్వామి ఆర్జేడీకి ఒక ఎమ్మెల్యే ఉన్నాడు. విపక్ష బీజేపీకి 26 మంది సభ్యులున్నారు.

బెదిరేది లేదు: సోరెన్

తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని సోరెన్ ఆరోపించారు. శుక్రవారం ఆయన లతేహార్‌లో ఓ సభలో మాట్లాడారు. జార్ఖండ్‌ను నాశనం చేసేందుకు బయటి శక్తులు కంకణం కట్టుకున్నాయంటూ బీజేపీపై నిప్పులు చెరిగారు. ''మాతో రాజకీయంగా పోరాడలేక రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు. ఈడీ, సీబీఐ, ఐటీలను ఉసిగొల్పుతున్నారు. నేను గిరిజన బిడ్డను. భయం మా డీఎన్ఏలోనే ఉండదు. చివరి రక్తపు బొట్టు దాకా పోరాడతా. మాకు అధికారమిచ్చింది ప్రజలే తప్ప ఈ ప్రత్యర్థులు కాదు'' అన్నారు. సోరెన్‌పై వేటు పడితే సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని జేఎంఎం ప్రకటించింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 27 । ఆగస్టు । 2022



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఎల్‌డీ. ప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ స్వాగతం పలికారు.



కరెన్సీ నోట్లతో వాసవీమాత

నందిగామ: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పట్టణంలోని శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రూ. 40 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.



విద్యార్థులకు పరామర్శ

జగ్గయ్యపేట అర్బన్: జ్వరాల బారిన పడిన గురుకుల పాఠశాల విద్యార్థులను డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని పరామర్శించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని పాఠశాలను ఆమె సందర్శించారు.

న్యూస్‌రీల్

మోపిదేవిలో హైకోర్టు జడ్జి శివశంకర్



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ జడ్జి శివశంకర్ శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఎండోమెంట్ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్. సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ ఈఏపీ సెట్–2022 ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన స్పెషల్ కేటగిరీ అభ్యర్థులైన ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం నుంచి నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొదలు కానుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒకటి నుంచి 50 వేల ర్యాంకు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేస్తామని హెల్ప్‌లైన్ సెంటర్ ఇన్‌చార్జి వరప్రసాద్ తెలిపారు.

ప్రైవేటు కార్గోల ఆకస్మిక తనిఖీ



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఏపీఎస్ ఆర్టీసీలో రవాణా చేస్తున్న పార్సిల్ కార్యాలయాన్ని ఆర్టీసీ విజయవాడ జోన్–2 డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.రాజశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రైవేట్ కార్గోలను పరిశీలించారు. ప్రతి రోజూ వెళ్లే రవాణా సరుకు, నూతనంగా ప్రవేశ పెట్టిన డోర్ డెలివరీ సదుపాయాలపై వినియోగదారుల నుంచి వస్తున్న సూచనలు, సలహాలపై ఆరా తీశారు. వినియోగదారులు, ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులు, వాటిని సరిద్దుకునే సూచనలు సలహాలను పార్సిల్ నిర్వాహకులకు సూచించారు. వినియోగదారులు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సంస్థ అభివృద్ధికి కార్గో సేవలు ఎంతో ముఖ్యమన్నారు. సరైన సమయంలో వస్తువులను ప్రయాణికులకు అందించినప్పుడే సంస్థపై నమ్మకం కలుగుతుందని తద్వారా సంస్థ లాభాల బాటలో నడుస్తుందని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.90 అడుగుల వద్ద ఉంది. ఇది 311.7462 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,833, ఎడమ కాలువకు 7,190, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,576, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకి 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 53,397 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 67,232 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 884.70 అడుగుల వద్ద ఉంది. ఇది 213.8824 టీఎంసీలకు సమానం.

బందరు చేప భలే భలే!



గిలకలదిండి ఫిషింగ్ హార్బర్



దేశ, విదేశాల నుంచి మంచి డిమాండ్

- కాలుష్యం లేని చేపలు ఇక్కడ ప్రత్యేకం
- నాణ్యత, రుచికి పెట్టింది పేరు
- వందల రకాలకు పైగా చేపలు.. 20 రకాల చేపలకు డిమాండ్
- పోటీపడి కొనుగోలు చేస్తున్న యూరోపియన్, జపాన్ దేశాలు

సాక్షి, మచిలీపట్నం: బందరుకు ఆనుకుని బంగాళాఖాతంలో లభ్యమయ్యే చేప నాణ్యతకు.. రుచికి పెట్టింది పేరు. ఇక్కడ లభ్యమయ్యే చేపల్లో ఎలాంటి రసాయన ధాతువులు ఉండవు. అందుకే ఈ చేపలకు మంచి డిమాండ్. ఇక్కడ వందల రకాలు లభ్యమవుతుండగా వాటిలో 20 నుంచి 25 రకాల చేపలకు మాత్రం మంచి గిరాకీ ఉంది. ఈ చేపల కోసం విదేశీయులు కూడా ఎగబడుతున్నారు. అలాగే దేశంలోని విశాఖ, కాకినాడ, చెన్నై, ముంబై, కోల్‌కతా నగరాలకు చెందిన ఏజెంట్లు ఎగరేసుకుపోతుంటారు. రాష్ట్రంలోని ఇతర తీర ప్రాంతాలతో పోల్చుకుంటే మచిలీపట్నంలో కాలుష్యం చాలా తక్కువ. ఇక్కడ నుంచి గత కొన్నేళ్లుగా సముద్ర ఉత్పత్తులు పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 111 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. జిల్లాలో ఏకైక ఫిషింగ్ హార్బర్ మచిలీపట్నం సమీపంలోని గిలకలదిండిలో ఏర్పాటైంది. ఈ హార్బర్‌కు యూరోపియన్ దేశాల గుర్తింపు కూడా ఉంది.

వందల రకాల మచిలీలు..

మచిలీపట్నం తీరంలో ఎక్కువగా తెల్ల చందువా (సిల్వర్ అండ్ వైట్ పాంప్రెట్), నల్ల చందువా (బ్లాక్ పాంప్రెట్), కోణాం, ముక్కు కోణాం (స్వర్డ్ ఫిష్), నెమలి కోణాం (సెయిల్ ఫిష్), వంజరం (సీర్ ఫిష్), నాలుకలు (సోల్), నామాల తూర (స్కిప్ జాక్ టూనా), పసుపురెక్క తూర (ఎల్లో ఫిన్), పెద్దకన్ను తూర (బిగ్ ఐ), కానా కంతలు (మాకేరల్స్), పావడాయి (రిబ్బన్), గొరక (క్రోకర్స్), సొర చేప, కండువ, మూడు చుక్కల పీత (త్రీస్పాట్ స్విమ్మింగ్ క్రాబ్)లతోపాటు టైగర్, వైట్ నారన్, పింక్, పువ్వలన్ (కలందన్), కరికేడి, శంఖు, డీప్ సీ ప్రాన్స్, కుక్కరొయ్యలు, సారగొరక, గులిగింత, జల్లలు, కుక్కసావడాయి, మెత్తాళ్లు, తెంగుడు రొయ్యపొట్టు ఎక్కువగా దొరుకుతాయి. వీటిలో ప్రధానంగా టూనా, కోణాంలతోపాటు వంజరం, చందువా, రొయ్యలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. అయితే అత్యధిక ధర తెల్ల చందువా (కిలో రూ.2 వేల వరకు), కోణం (కిలో రూ.700) పలుకుతున్నాయి. వేటకు వెళ్లిన వారు రోజూ అనేక రకాల చేపలను గిలకలదిండి హార్బర్‌కు తెస్తున్నారు. అక్కడ వ్యాపారులు వేలంపాట ద్వారా చేపలను కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. మరికొందరు నేరుగా విశాఖ, కాకినాడ, చెన్నై తీసుకెళ్లి అక్కడే విక్రయిస్తున్నారు. సీజన్‌ను బట్టి వీటికి మరింత ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మచిలీపట్నంలో చేపల చెరువుల్లో ప్రత్యేకంగా పెంచే చేపల్లో పండుగప్ప, శీలవతి, తుల్లులు, నేమ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

ఎన్నో రకాల చేపలు ఉన్నాయి..



సముద్రంలో చాలా రకాల చేపలు దొరుకుతాయి. ఇక్కడ దొరికే చేపలు మరెక్కడా దొరకవు. దొరికినా ఇంత నాణ్యంగా ఉండవు. అందుకే మేము తెచ్చే చేపలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

– కోదండ బోస్, మత్స్యకారుడు, గిలకలదిండి

టూనా చేపలకు డిమాండ్..

మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో ఎటువంటి రసాయన పరిశ్రమలు లేవు. పెద్ద ఓడల రాకపోకలూ తక్కువే. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో దొరికే వాటిలో రసాయన ధాతువులు ఎక్కువగా ఉంటున్నాయని.. మచిలీపట్నంలో నామమాత్రంగా కూడా ఉండడం లేదని యూరోప్, జపాన్ దేశస్తులు గుర్తించడం విశేషం. మచిలీపట్నం తీరంలో దొరికే టూనా చేపల కోసం జపాన్ దేశస్తుల నుంచి మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు ఇక్కడ దొరుకుతున్నాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపెడా) నుంచి తీసుకునే క్యాచింగ్ సర్టిఫికెట్‌లో మచిలీపట్నం సీకోస్ట్ అని ఉంటే చాలు ఎలాంటి ఆంక్షలు విధించడం లేదని చెబుతున్నారు. బందరు చేపల కోసం విశాఖ, కాకినాడ, చెన్నై, కోచి, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, సికింద్రాబాద్ వ్యాపారులు ఇక్కడ కొందరు ఏజెంట్లను కూడా నియమించుకున్నారు. రోజూ మత్స్యకారుల నుంచి కొనుగోలు చేసిన చేపలను ఏజెంట్లు ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



వేలానికి సిద్ధం చేసిన వివిధ రకాల చేపలు



పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఉద్యోగ సంఘాల నిరసనకు అనుమతి లేదు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా

విజయవాడ స్పోర్ట్స్: సెప్టెంబర్ ఒకటో తేదీన ఉద్యోగ సంఘాల నాయకులు నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి పోలీస్ అనుమతి లేదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఈ యాక్ట్ అమలులో ఉన్న సమయంలో ఎలాంటి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేయకూడదన్నారు.

లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు

ఉద్యోగ సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు ఎవరైనా ఆందోళన చేస్తారనే ఉద్దేశంతో ముందస్తుగానే పోలీసులు అప్రమత్తమయ్యారు. విజయవాడ నగరంతో పాటు నందిగామ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నంలోని 22 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న 350 లాడ్జి, హోటళ్లలో 250 మందికి పైగా లా అండ్ ఆర్డర్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా హోటళ్లలో ఆందోళనకారులు, సంఘ విద్రోహ శక్తులు ఎవరైనా బస చేశారేమోనని అన్ని గదుల్లో సోదాలు చేశారు. ఆందోళన చేసేందుకు ఎవరైనా వచ్చినట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని హోటళ్ల యజమానులకు సూచించారు.

సరికొత్తగా సీసీఎస్



సత్యాన్వేషణలో విభిన్న పంథా

- చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి
- 18 నెలల్లో 1,169 కేసుల ఛేదన
- రూ.12.35 కోట్ల సొత్తు స్వాధీనం
- అందుబాటులోని సాంకేతికతతో పాటు పాత కాలపు విధానాలతో అనుకూల ఫలితాలు



విజయవాడ స్పోర్ట్స్: పెరుగుతున్న ఆధునిక సాంకేతికత పోలీసుల దర్యాప్తును సులభతరం చేసింది. సీసీ టీవీ పుటేజీ, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఇటీవల కాలంలో పోలీసులకు కీలకంగా మారుతున్నాయి. ఫలితంగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చి.. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు జరిగిన వెంటనే క్రైం పోలీసులు అప్రమత్తమవుతున్నారు. కేవలం ఒకటి, రెండు రోజుల్లోనే నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వారి నుంచి నగదు రికవరీ కూడా చేస్తున్నారు. అయితే ఇటీవల వెలుగుచూసిన పలు కేసులు విజయవాడ సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) పోలీసులను ముప్పు తిప్పలు పెట్టాయి. ఎంతగా సాంకేతిక సాయం ఉన్నా అవి కేసును మరింత సంక్లిష్టం చేశాయి తప్ప పరిష్కారం చూపలేదు. ఈ పరిణామాలు ఖాకీలను మళ్లీ పాత కాలం నాటి విచారణ అస్త్రాల వైపు మళ్లించాయి.

కళ్లు తెరిపించిన చెడ్డీ గ్యాంగ్..

ఆరు నెలల క్రితం చెడ్డీ గ్యాంగ్ నగరంలో అలజడి సృష్టించింది. సెల్ ఫోన్ వాడకుండా, తల వెంట్రుకలు రాలకుండా, సీసీ పుటేజీలకు దొరక్కుండా ఈ గ్యాంగ్ నగరంలో దోపిడీలకు పాల్పడింది. దోపిడీ జరిగిన ప్రాంతాలను పరిశీలించిన వెంటనే ఆనవాయితీ ప్రకారం సాంకేతిక ఆధారాల కోసం పోలీసుల అన్వేషణ కొనసాగినా ఫలితం లేకపోయింది. చివరకు దశాబ్దం క్రితం చేసిన దారి దోపిడీల తీరునే ప్రస్తుతం చెడ్డీ గ్యాంగ్ అవలంబిస్తోందని గుర్తించి.. ఆ మాదిరిగానే మెదడుకు పని పెట్టి దొంగల ఆలోచననే అనుసరించారు. అప్పటికే పరారయిన దొంగలను రాష్ట్రాలు దాటి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఇదే విధంగా ఇటీవల మహేంద్ర జ్యూవెలర్స్, క్యారెట్ జ్యూవెలర్స్‌లో జరిగిన చోరీలతో పాటు ఈ ఏడాది జరిగిన 13 అతిపెద్ద చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించి నూరు శాతం సొమ్మును రికవరీ చేశారు. గడిచిన మూడు నెలల్లో జరిగిన దోపిడీల్లో 95 శాతం చోరీలను ఛేదించి, 98 శాతం సొత్తును రికవరీ చేశారు.

ఏటీఎం చోరీ నుంచి వృద్ధుల హత్య వరకూ..

గత ఏడాది అక్టోబర్‌లో పెనమలూరులో ఏటీఎం చోరీకి ఓ దొంగల ముఠా ప్రయత్నించి విఫలమైంది. ఏటీఎంలో నగదు చోరీకి గురికాకపోవడంతో అప్పట్లో పెనమలూరు పోలీసులు నామమాత్రపు దర్యాప్తుతో కేసును పక్కన పడేశారు. నెల తర్వాత ఈ కేసు విజయవాడ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)కు చేరింది. దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు, నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా నివసిస్తున్న నలుగురు వృద్ధులను హత్య చేసి, వారి ఇళ్లలో చోరీలు చేసినట్లు వారు పోలీసుల వద్ద అంగీకరించారు. దొంగల ముఠా పేర్కొన్న వృద్ధుల ఇళ్లకు సీసీఎస్ పోలీసులు వెళ్లి, విచారణ చేసి వారి హత్యలు వాస్తవమేనని ధ్రువీకరించి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

వేగంగా ఛేదన..

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారుల లెక్కల ప్రకారం 2021లో 1,110 వివిధ రకాల దొంగతనాలు జరగ్గా రూ.11.43 కోట్ల సొత్తు చోరీ జరిగింది. ఈ ఏడాది జూన్ వరకు 678 ఘటనలు జరగ్గా రూ. 5.34 కోట్ల సొత్తు చోరీ జరిగింది. 2021లో జరిగిన ఘటనల్లో 785 కేసులను పోలీసులు ఛేదించి రూ.9 కోట్లను రికవరీ చేయగా, ఈ ఏడాది 384 కేసుల ఛేధించి రూ. 3.89 కోట్లు రికవరీ చేశారు. ఈ కేసుల్లో వందలాది మంది నేరగాళ్లను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. నగరంలోని నున్న, సింగ్‌నగర్, పటమట, గవర్నర్‌పేట, భవానీపురం, కృష్ణలంక స్టేషన్‌లలో ఈ తరహా చోరీలు అత్యధికంగా చోటు చేసుకుంటున్నాయి.

నగదు ప్రోత్సాహంతో ఉత్సాహం..

కేసుల దర్యాప్తులో పురోగతి సాధించిన పోలీస్ అధికారులతో పాటు సిబ్బందిని పోలీస్ కమిషనర్ టి.కె. రాణా అభినందిస్తూ నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది జరిగిన 90 చోరీలను ఛేదించినందుకు గానూ ఎంతో మంది పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్ నుంచి నగదు ప్రోత్సాహాన్ని అందుకున్నారు. దీంతో సిబ్బంది ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

పక్కగా నిఘా..

కమిషనరేట్ పరిధిలో జరిగే దొంగతనాలతో పాటు ఇతర నేరాలను ప్రణాళికాబద్ధంగా పోలీస్ శాఖ అదుపులోకి తీసుకొస్తోంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించడం, వాహనాల తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించడం చేస్తున్నారు. గతానికి భిన్నంగా పోలీసుల తీరు ఉండటం, కేసుల దర్యాప్తులో పోలీసులు చురుగ్గా వ్యవహరించడంతో దొంగల్లో వణుకు మొదలైంది.

దొంగతనాలపై దృష్టి..



గతంతో పోల్చితే నగరంలో దొంగతనాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. శాఖలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని విచారణలో భాగం చేస్తున్నాం. అందరూ కలిసికట్టుగా పని చేయడంతో దర్యాప్తు సులభతరమవుతోంది. గత కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలతో పాత నేరస్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– టి.కె. రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

కృష్ణా పరీక్షల విభాగంలో పలు మార్పులు



కృష్ణా యూనివర్సిటీ

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ పరీక్షల విభాగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. యూజీ, పీజీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న భవానీ, శ్రావణిలను తొలగించారు. వారి స్థానంలో బయోసైన్స్, బయో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్. సుశీల, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. జ్యోతిర్మయిని నియమించారు. పరీక్షల విభాగాన్ని మరింత పటిష్టం చేసేలే వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ ఆమోదంతో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్ష విభాగం ప్రాధాన్యం దృష్ట్యా ఇక్కడ మరికొంతమందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. యూజీ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ జి. కిషోర్, పీజీ కో–ఆర్డినేటర్‌గా డి. వాసుబాబును నియమించారు. అదే విధంగా ప్రొఫెషనల్ కోర్సుల పర్యవేక్షణకు కో–ఆర్డినేటర్‌గా ఎస్. రాజీవ్, ఫిజిక్స్ విభాగం కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్. సైమా బేగమ్‌ను నియమించారు.

లక్ష్యం.. సకాలంలో ఫలితాలు..

ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి శుక్రవారం తన చాంబర్‌లో నూతనంగా నియమితులైన పరీక్ష విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు విడుదల అనేది ఓ సవాల్‌గా తీసుకోవాలన్నారు. సకాలంలో ఫలితాలు ఇవ్వటం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందన్నారు.

పోటెత్తిన ఇంద్రగిరి



ఆలయంలో మెట్ల పూజ చేస్తున్న మహిళా భక్తులు

మెట్ల పూజలు, ఆర్జిత సేవల్లో తరించిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రావణ మాసం చివరి శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు మెట్ల పూజలతో పాటు ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు నిర్వహించే ఖడ్గమాలార్చన, శ్రీచక్రార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, చండీహోమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కిక్కిరిసిన క్యూలైన్లు..

మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మహా నివేదన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన అయ్యేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. రూ. 300, రూ. 100 టికెట్ క్యూలైన్‌లతో పాటు సర్వ దర్శనం క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. మరో వైపున పెరిగిన ఎండ తీవ్రతతో రాజగోపురం, ఘాట్‌రోడ్డు ఓం టర్నింగ్ వద్ద భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. సర్వదర్శనం క్యూలైన్‌లో మహా మండపం ఆరో అంతస్తు, ఇటు లక్ష్మీ గణపతి విగ్రహం వరకు ఉండటంతో చిన్న పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులను వీఐపీ క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, దర్బారు సేవల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



ఆలయంలో రావిచెట్టుకు ముడుపులు కడుతున్న మహిళా భక్తులు

పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు

కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులు అనుమతుల కోసం వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నవి గడువు దాటకుండా పరిష్కరించాలని సూచించారు.

- ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం ద్వారా జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 45 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి రూ. 95 లక్షలతో 20 యూనిట్లు స్థాపించేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. వీటిలో రూ. 67 లక్షలతో 15 యూనిట్లు ఏర్పాటయ్యాయన్నారు. తొమ్మిది దరఖాస్తులను బ్యాంకు అధికారులు తిరస్కరించారని తెలిపారు. మిగిలిన దరఖాస్తులకు వెంటనే అనుమతులు మంజూరు చేసి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.
- వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తదితరులు ఏర్పాటు చేసుకున్న 65 ఎంఎస్ఎంఈ యూనిట్లకు పెట్టుబడి సబ్సిడీ, వడ్డీ రాయితీ, విద్యుత్ సబ్సిడీ, పన్నుల సబ్సిడీ రూ. 2.85 కోట్లు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు.
- గన్నవరం మండలం మల్లవల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.
- పామర్రు మండలం నిమ్మకూరులో ఏర్పాటు చేస్తున్న బెల్‌కంపెనీ యూనిట్‌కు నీటి సరఫరాకు సంబంధించి సమస్యను పరిష్కరించాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.
- జిల్లాలో ఎగుమతుల అభివృద్ధికి అవకాశాలు ఉన్న ఆక్వా, కలంకారీ, ఇమిటేషన్ జ్యూవెలరీ, టెక్స్‌టైల్స్ రంగాల్లో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఎంయూడీఏ వీసీ బీవీ నారాయణరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాస్, పరిశ్రమలశాఖ డీడీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

30,120 బస్తాల మిర్చి అమ్మకం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 28,616 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,120 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.26,300 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చికి రూ.7,000 నుంచి 26,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 3,353 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

చోరీ కేసులో వ్యవసాయ అధికారి అరెస్ట్

విజయవాడ స్పోర్ట్స్: కారులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికుడి బ్యాగులో ఉన్న రూ.14 లక్షలను కాజేసిన ఘటనలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న మొర్రిమేకల నాగరాజును కృష్ణలంక, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సౌత్ ఏసీపీ డాక్టర్ బిబి.రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని ఓ గోల్డ్ కంపెనీకి చెందిన విజయవాడ బ్రాంచ్‌లో ఎన్టీఆర్ జిల్లా యనమలకుదురుకు చెందిన షేక్ సైరుద్దీన్ ట్రావెలింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. తన యజమాని ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీన సైరుద్దీన్ హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ తన యజమాని ఇచ్చిన రూ.14 లక్షలను బ్యాగులో పెట్టుకుని యజమాని మేనల్లుడి కారులో విజయవాడకు అదే రోజు రాత్రి బయలుదేరాడు. సైరుద్దీన్, యజమాని మేనల్లుడితో పాటు నిందితుడు నాగరాజు అదే కారులో ప్రయాణించి కోదాడలో దిగాడు. విజయవాడ చేరుకున్న తరువాత సైరుద్దీన్ బ్యాగును పరిశీలించి అందులో నగదు పోయినట్లు గుర్తించి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్, కృష్ణలంక పోలీసులు నాగరాజును నిందితుడుగా గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే మాటలతో ఏమార్చి బ్యాగులోని నగదును కాజేసినట్లు విచారణలో నాగరాజు అంగీకరించాడు. నిందితుడి నుంచి పూర్తి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనతికాలంలోనే కేసును ఛేదించిన కృష్ణలంక ఎస్ఐ ఎం.దుర్గారావు, క్రైం ఎస్ఐ కృష్ణబాబును పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ విశాల్‌గున్ని అభినందించారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, చిత్రంలో నిందితుడు నాగరాజు

కృష్ణా, గుంటూరు జట్లు శుభారంభం



78 రన్స్ చేసిన అనంత కార్తికేయ



101రన్స్(నాటౌట్) చేసిన మహీప్‌కుమార్

విజయవాడ స్పోర్ట్స్: సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జట్లు విజయం సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యాన ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని క్రికెట్ మైదానాల్లో ఈ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. సీపీ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై కృష్ణాజిల్లా జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమగోదావరి జట్టు 38 ఓవర్లకు 131 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్ జగదీష్‌రామ్‌రెడ్డి 93 బాల్స్‌కు నాలుగు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 63 పరుగులు చేశాడు. కృష్ణా జట్టు బౌలర్లు వై.ప్రమోద్ మూడు, బ్రహ్మతేజ రెండు కీలకమైన వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 23.4 ఓవర్లకు రెండు వికెట్లు నష్టపోయి 134 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ అనంత కార్తికేయ(59 బాల్స్, 5ఫోర్లు, 7 సిక్స్‌లు, 78 రన్స్) అర్ధ సెంచరీతో రాణించగా మరో బ్యాట్స్‌మెన్ సందీప్ 39 పరుగులు చేశాడు. డీవీఆర్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై గుంటూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు 47.1 ఓవర్లకు 179 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు వీణు(60 రన్స్) అర్ధ సెంచరీతో రాణించగా, షేక్ అబ్దుల్లా 34 పరుగులు చేశాడు. గుంటూరు జట్టు బౌలర్లు ప్రణయ్‌కుమార్, అఖిల్, సుధాకర్ రెండేసి వికెట్లు చొప్పున తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 40.3 వ ఓవర్ వద్ద రెండు వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ మహీప్‌కుమార్(126 బాల్స్, 101 రన్స్, 13 ఫోర్లు, ఒక సిక్స్, నాటౌట్) సెంచరీతో అదరగొట్టగా మహీమ్‌కుమార్ (54 రన్స్, నాటౌట్) అర్ధసెంచరీ సాధించాడు.

తెలుగు భాషా సేవకులకు పురస్కారం



గుత్తికొండ సుబ్బారావు



డాక్టర్ గాజులపల్లి రామచంద్రారెడ్డి

విజయవాడ కల్చరల్/మచిలీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విశాఖపట్నంలో ఈ నెల 29న నిర్వహించే భాషా ఉత్సవాలలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఇరువురు రచయితలు తెలుగు భాషా పురస్కారాలు అందుకోనున్నారు. వీరికి పురస్కార సన్మానంతో పాటు రూ.10 వేల నగదు అందజేస్తారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన సాహితీవేత్త, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, విజయవాడకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు బహు గ్రంథకర్త డాక్టర్ గాజులపల్లి రామచంద్రారెడ్డిలకు అధికార భాషా సంఘం ఈ పురస్కారాలను ప్రకటించింది. గుత్తికొండ సుబ్బారావు కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం వ్యవస్థాపకులలో ఒకరు. తెలుగు భాష అమలు కోసం జరిగిన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పరిశోధకుడు భాషావేత్త, బహు గ్రంథకర్త డాక్టర్ గాజులపల్లి రామచంద్రారెడ్డి కడప జిల్లాలో జన్మించారు. విజయవాడ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఈయన ఆంగ్ల భాషలో విద్యాబోధన, సామాజిక రాజకీయ అంశాలపై పలు పుస్తకాలను రచించారు.

ఏఎన్‌యూ బీఓఎస్ చైర్మన్‌గా ప్రసాద్‌బాబు



పన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైకాలజీ పీజీ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రముఖ మనస్తత్వ శాస్త్రవేత్త, ఇగ్నో అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఓఎస్ చైర్మన్‌గా ప్రసాద్ బాబు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

కాలేయ వ్యాధులు ప్రాణాంతకం

- ఇటీవల పెరుగుతున్న సిర్రోసిస్ కేసులు
- అశ్రద్ధ చేయవద్దంటున్న వైద్య నిపుణులు
- ఏడాదికోసారి పరీక్షలు తప్పనిసరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రమ లేని జీవన విధానం, ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న మధుమేహంలు వెరసి లివర్ సిర్రోసిస్ కేసులు పెరుగుతున్నాయి. ఒకసారి ఫ్యాటీ లివర్ ఉన్నట్లు నిర్ధారణ అయినప్పటికీ జీవనశైలిని మార్చుకోకపోవడంతో అది కాస్త ముదిరి సిర్రోసిస్‌కు దారి తీస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. విజయవాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు లివర్ సమస్యలతో వస్తున్న వారిలో ఇటీవల కాలంలో నాన్ ఆల్కాహాలిస్టుల్లోనూ సిర్రోసిస్ కేసులు చూస్తున్నామని వైద్యులు చెపుతున్నారు. ఫ్యాటీ లివర్ సమస్యను అధిగమించేందుకు ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని వైద్యులు చెపుతున్నారు.



సిర్రోసిస్ లివర్

పెరుగుతున్న సిర్రోసిస్

విజయవాడ ప్రభుత్వాస్పత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి రోజుకు 150 నుంచి 200 మంది వరకూ వస్తుంటారు. వారిలో నెలలో రెండు, మూడు లివర్ సిర్రోసిస్ కేసులను చూస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. నాన్ ఆల్కాహాలిస్టుల్లో ఫ్యాటీలివర్ సిర్రోసిస్‌కు దారితీస్తే ప్రాణాంతకం కావచ్చునని వైద్యులు అంటున్నారు. ఫ్యాటీలివర్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3లో దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చని, కానీ సిర్రోసిస్‌కు దారితీస్తే లివర్ గట్టిపడి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదని, ఆ పరిస్థితుల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గమని వైద్యులు అంటున్నారు.

ముందు జాగ్రత్త మేలు

శారీరక శ్రమలేని జీవన విధానానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడ్డారు. దానికి తోడు ఫ్యాట్ ఎక్కువగా ఉన్న జంక్‌ఫుడ్స్‌ను తింటున్నారు. దీంతో శరీరంలో కొలస్ట్రాల్ స్థాయిలు విపరీతంగా పెరిగి, లివర్‌పై ప్రభావం చూపుతున్నాయి. వయస్సు 40 ఏళ్లు దాటిన వారు ప్రతిఏటా లివర్ ఫంక్షన్ టెస్ట్, కొలస్ట్రాల్ లెవల్స్, థైరాయిడ్, షుగర్ పరీక్షలతో పాటు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కూడా చేయించుకుంటే మంచిది. ఇప్పుడు లివర్ పనితీరును కచ్చితంగా నిర్ధారించేందుకు ఫైబ్రో స్కాన్ అందుబాటులోకి వచ్చింది.

లివర్ డ్యామేజ్ అయిన కేసులు చూస్తున్నాం



ఒకప్పుడు ఆల్కాహాల్ ఎక్కువగా తాగే వారిలో లివర్ సిర్రోసిస్ వ్యాధి సోకేది. ఇప్పుడు కొలస్ట్రాల్ కారణంగా నాన్ ఆల్కాహాలిస్టుల్లో కూడా సిర్రోసిస్ చూస్తున్నాం. మధుమేహం, హైపో థైరాయిడ్, హెపటైటీస్ సి ఉన్న వారిలో లివర్ సిర్రోసిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ. గ్రేడ్ 1 ఫ్యాటీ లివర్ వచ్చినప్పుడు అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ ఎ.కవిత, ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ

యువకుల్లోనూ ఫ్యాటీ లివర్



ఇటీవల 30 ఏళ్ల వయస్సు వారిలోనూ ఫ్యాటీ లివర్ చూస్తున్నాం. 30 నుంచి 40 ఏళ్ల మధ్య వారిలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఎక్కువగా వస్తున్నాయి. ఫ్యాటీ లివర్ ఉన్న వారిలో లివర్ ఏమైనా డ్యామేజ్(గట్టిపడిందా) అనే దానిని టిష్యూ ఎలాస్టిసిటీ అనే ఫీచర్ ద్వారా అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా తెలుసుకుంటాం. మధుమేహం, హైపో థైరాయిడ్, కొలస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్న వారు ఏడాదికి ఒకసారి అల్ట్రాసౌండ్ స్కాన్ చేయించుకోవడం మంచిది. కొలస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారిలో ఫ్యాటీలివర్‌తో పాటు గాల్‌స్టోన్స్ కూడా ఉంటున్నాయి.

–డాక్టర్ ఎన్.దీప్తిలత, రేడియాలజిస్ట్

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పితాని రాజా(32) ఇటీవల ఆటో ఫైనాన్స్‌లో తీసుకుని నడుపుతున్నాడు. ఆటో ఫైనాన్స్ కిస్తీ కట్టడానికి శుక్రవారం ఉదయం తల్లి బేబీని డబ్బులు అడిగాడు. అయితే ఆమె లేవని చెప్పింది. దీంతో భార్య, తల్లి ఇంట్లో లేని సమయంలో రాజా బెడ్‌రూమ్‌లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఫార్మా కార్నివాల్ 2కే 22



కార్నివాల్‌లో నృత్యాలు చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. విద్యార్థుల ఆటవిడుపు కోసం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫార్మా కార్నివాల్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థినులు డ్యాన్స్, ఫ్యాషన్ షో, మిమిక్రీ, స్పాట్ ఫొటోగ్రఫీ, నిధి వేట వంటి పలు రకాల వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ వత్తిడిని తట్టుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. కార్యక్రమంలో 14 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కల్చరల్ కార్యనిర్వహణాధికారి చెంచులక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): పున్నమి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ కన్యకాపరమేశ్వరి విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియచేశారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యాధరపురం గుప్తా సెంటర్ డౌన్, షాదీఖానా ఏరియా, రాచకొండవారి వీధి, వెంకటరత్నం వీధి పరిసర ప్రాంతాలలో కరెంట్ ఉండదని వివరించారు. చిట్టినగర్ సెక్షన్ డాక్టర్ కెఎల్ రావునగర్ విద్యుత్ ఉప కేంద్రం 11 కేవీ ఫోర్‌మెన్ బంగ్లా ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఫోర్‌మెన్ బంగ్లా ఏరియా, యూసఫ్ ఖాన్ వీధి, ఫ్రైజర్‌పేట, ఎర్రకట్ట ఏరియా తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లలితాంబికకు పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని భీమనవారిపేటలోని లలితాంబికా అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పీఠంలో లలితాంబికా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చనను పీఠాధీశ్వరి శివలీల నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు పీఠానికి తరలివచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో కన్వీనర్ చైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది.

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు అవగాహన

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో గల 119, 159 వార్డ్ సచివాలయాల పరిధిలో ఇంటి స్థలం మంజూరయిన లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇంటి స్థలం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఇంటి స్థలం మహిళల పేరుమీదే మంజూరు చే సిన సీఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకోవడం ద్వారా జగనన్న ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ అరుణ మాట్లాడుతూ లబ్ధిదారులు డ్వాక్రా గ్రూప్‌లో ఉంటే బ్యాంక్ ద్వారా రుణం పొందవచ్చని చెప్పారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ వనజ, సచివాలయాల అడ్మిన్లు లక్ష్మణ్, యేబేలు, వెల్ఫేర్ సెక్రటరీ జాఫర్, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రూరల్ మండలాలకు బస్సులు పెంచాలని వినతి

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతిని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని ఆమె కార్యాలయంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గా కలిశారు. రూరల్ మండలాలకు బస్సుల సంఖ్యను పెంచాలని, జగనన్న కాలనీలకు బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో బస్సుషెల్టర్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాధరపురం బస్సు డిపోలో మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన జోనల్ చైర్మన్ పద్మావతి ఈ విషయాలపై పరిశీలించి అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి. గౌతం రెడ్డిని దుర్గా అయన కార్యాలయంలో కలిశారు.

సంక్షేమం, నగరాభివృద్ధితో ప్రజల్లోకి..

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి



మహిళలతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, నగరాభివృద్ధితో ప్రజల్లోకి వెళుతున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 49వ డివిజన్ 168వ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, పలువురు కార్పొరేషన్ అధికారులు టైలర్‌పేటలోని తాటికొండ వారి వీధి, కొండ్రు వారి వీధి, పెనుమాక దేవదాసు వీధి, శ్రీనివాసరావు వీధి, తిరుమలయ్య వీధుల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

గడప గడపకు అనూహ్య స్పందన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని సమస్యను ప్రజలు వివరించారని, సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

చంద్రబాబు కుప్పంకు– లోకేష్ మంగళగిరికి..

జగనన్న దెబ్బకు చంద్రబాబు కుప్పంకు పారిపోతే, లోకేష్ మంగళగిరి నియోజక వర్గానికే పరిమితం అయ్యాడన్నారు. ఇక వీక్లీబోయ్ పవన్ కళ్యాణ్ ప్యాకేజీకే పరిమితమై సినిమాలు చేసుకుంటున్నాడన్నారు. అమరావతి పేరుతో విజయవాడ నగరాభివృద్ధిని చంద్రబాబు గాలికి వదిలేస్తే, జగనన్న ప్రభుత్వం విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

డివిజన్‌లోని ముక్కా వెంకట రమణ హైమావతి కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజలు నిర్వహించారు. రెల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 25 లక్షలు ఎమ్మెల్యే నిధులు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు జి.సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, యర్రజోన్న విజయలక్ష్మి, తంగిరాల కృప, పల్లెపోగు ప్రసాద్, చేవూరి శ్రీను, బత్తిన నాగపావని, బెవర బాలకృష్ణ, బడుగు అప్పారావు, మేదర కృష్ణలతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు నిరుపమానం



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంజీవ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

పార్లమెంట్ సభ్యుడు సంజీవ్‌కుమార్

భవానీపురం(విజయవాడ పశ్చిమ): మానవ సేవే మాధవ సేవగా భావించి తన జీవితాన్ని సేవలకే అంకితం చేసిన మదర్ థెరిసా సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు ఎస్.సంజీవ్‌కుమార్ అన్నారు. భారత రత్న, నోబుల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ, కుష్టు రోగులు, హెచ్‌ఐవీ బాధితుల పట్ల ఎనలేని ప్రేమానురాగాలు చూపుతూ ప్రేమతో సేవలందించిన మానవతామూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. ప్రపంచంలోని 123 దేశాలలో మదర్ థెరిసా సేవా సంస్థల ద్వారా నిరంతరం సేవలందించారని తెలిపారు. బీసీ నాయకులు ఎస్వీ శేషగిరిరావు, మాదల తిరుపతిరావు, టి. పూర్ణయ్య, పి.వెంకటేశ్వరరావు, వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్, వి.నాగాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మదర్ థెరిస్సా జయంతి వేడుకలు శుక్రవారం కేఎల్‌రావు పార్కు రోడ్డులో ఘనంగా నిర్వహించారు. హెల్ప్ ది హోప్‌లెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ.రుహుల్లా పాల్గొన్నారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం నివాళులర్పించారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఈదులూరి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కర్నాటి రాంబాబు, నగర కార్యదర్శి రాయన నరేంద్ర, కొత్తపేట ఫైర్ స్టేషన్ ఆఫీసర్ టీ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళి...

భవానీపురం(విజయవాడ పశ్చిమ): మదర్ థెరిసా జయంతి సందర్భంగా విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో థెరిసా చిత్రపటానికి హెచ్‌ఎం కోటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులకు స్వయంగా సేవ చేసి ఎందరికో మదర్‌థెరిస్సా స్ఫూర్తి కలిగించారని పేర్కొన్నారు. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న ఆమె సందేశంతో ఎందరో సేవా కార్యక్రమాలను నిర్వహించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆమె సేవా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలి



డాక్టర్ కోలా విజయశేఖర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ సమరం తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. స్వేచ్ఛ గోరా ఐ బ్యాంకు ఆధ్వర్యంలో వాసవ్య మహిళా మండలి భవనంలో నిర్వహిస్తున్న 37వ నేత్రదాన ప్రచార పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ అంధత్వం అనేది భరించలేని బాధ అన్నారు. ఎంతోమంది అంధులు కంటిచూపు లేక చీకటి బతుకులతో మరొకరిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రకృతి అందాలను చూడలేక, కనీసం తన రూపాన్ని సైతం చూసుకోలేని దుర్భరమైనది అంధత్వ జీవితం అన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని చెప్పడం కాదని, ఆచరణలో పెట్టి చూపాలన్నారు. తన నేత్రాలు దానం చేస్తానంటూ ప్రకటించి గోరా ఐ బ్యాంకుకు నేత్ర దాన ప్రతిజ్ఞ పత్రం అందించారు. చూపు కోల్పోయిన వారికి మరలా చూపువస్తే వారి ఆనందాన్ని మాటల్లో వర్ణించలేమన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులు నేత్రదానంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత అమ్మా..మీరు నాకు కనిపించడం లేదు. మిమ్మల్ని చూసేందుకు నాకెవరూ సహాయం చేయలేరా అంటూ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. వైద్యులు కోలా విజయ్‌శేఖర్, పీపీ శాస్త్రి, డాక్టర్ ఎ.శ్రీనివాస్‌ను కలెక్టర్ సత్కరించారు.

జూడో పోటీలకు అలేఖ్య ఎంపిక



అలేఖ్యను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థిని కృష్ణవరపు అలేఖ్య దేశంలో తొలిసారిగా జరగనున్న ఖేలో ఇండియా మహిళల జూడో టోర్నీలో పాల్గొనుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 13వ తేదీన నూజివీడులో రాష్ట్ర స్థాయి జూడో సెలక్షన్స్ జరిగినట్లు పేర్కొన్నారు. జూనియర్ కేటగిరి (15 – 20 ఏళ్ళ వయస్సు)కు సంబంధించి అలేఖ్య మొదటి స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. సెప్టెంబర్ ఒకటి నుంచి కేరళలోని త్రిసూర్‌లో జరిగే దక్షిణ భారత పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. అలేఖ్యను, ఆమెను తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ ఎం. విక్టర్‌జాన్సన్‌లను కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనంద సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతంజలి శాస్త్రి అభినందించారు.

విద్యారంగంలో రామకృష్ణ సేవలు అభినందనీయం



రామకృష్ణను సత్కరిస్తున్న కమిటీ యజమాన్యం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విద్యా రంగానికి డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టూరి ఆనందసుధాకర్, గోపిశెట్టి మల్లయ్య అన్నారు. విద్యారంగంలో కేంద్ర జాతీయ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అభినందన కార్యక్రమం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టూరి ఆనంద సుధాకర్, గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ గణితం, తెలుగు, సైకాలజీ, జర్నలిజం వంటి విభిన్న రంగాల్లో రామకృష్ణ విశేష కృషిని కొనసాగిస్తున్నారన్నారు. ఆ రంగాలకు సంబంధించి అనేక గ్రంథాలు రచించడం రామకృష్ణలోని బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనమని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పత్రికారంగం అనే అంశంపై రామకృష్ణ రాసిన పరిశోధన గ్రంథం బీఏ జర్నలిజం విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా యూజీసీ ప్రకటించిందన్నారు. ఎస్ఆర్ఎస్‌వీ బీఈడీ కళాశాల కమిటీ కార్యదర్శి జి.గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 300 బీఈడీ కళాశాలల్లో రామకృష్ణ మాత్రమే జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకోవటం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. కేవలం పాఠ్యాంశ బోధనతో సరిపెట్టుకోకుండా కళాశాల అభివృద్ధికి అనేక విధాలుగా అండగా నిలవటం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ రామకృష్ణ తోటి అధ్యాపకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. బీఈడీ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు, కోశాధికారి మహంకాళి మోహనరావు, హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయ్ కుమార్ తదితరులు రామకృష్ణ సేవలను కొనియాడారు. కేబీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు రామకృష్ణను అభినందించారు. సన్మాన గ్రహీత రామకృష్ణ ప్రతిస్పందిస్తూ యాజమాన్య కమిటీ అందించిన సహకారం వల్ల తాను ఈ విజయాలు సాధించగలిగానని చెప్పారు.

సమాజానికి సేవ చేయడంలోనే నిజమైన తృప్తి

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



ఎమ్మెల్సీ రుహుల్లాను సత్కరిస్తున్న మేదర సురేష్, అద్దంకి రాజా యోనా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజానికి సేవలు అందించడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని శాసనమండలి సభ్యుడు ఎండీ రుహుల్లా అన్నారు. ఐలాపురం హోటల్‌లో ఫిలాంత్రోపిక్ సొసైటీ, డ్రీమ్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా మదర్ థెరిసా జయంతి శుక్రవారం నిర్వహించాయి. విభిన్న రంగాల్లో సేవలు అందించిన 24 మంది సామాజిక వేత్తలకు మదర్ థెరిసా జాతీయ ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ నిస్వార్థంగా సామాజిక సేవలు అందిస్తున్న మానవతామూర్తులకు ఈ పురస్కారాలివ్వడం అభినందనీయమని చెప్పారు. ది అమెరికన్ యూనివర్సిటీ సౌత్ ఇండియన్ చాప్టర్ పీస్ అంబాసిడర్ డాక్టర్ అద్దంకి రాజా యోనా మాట్లాడుతూ కుష్టు రోగులు, వృద్ధులు, అనాథలు, మహిళలకు సేవలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. సామాజిక ఉద్యమ నేత, డ్రీమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మేదర సురేష్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో థెరిసా పేరిట పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ చేతులు మీదుగా జ్ఞాపిక, మెడల్, ప్రసంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 24 మంది పురస్కారాలను అందుకున్నారు. పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆకుమర్తి చిన్న, నెహ్రూ యువ కేంద్రం కోర్డినేటర్ వినోద్ కుమార్, ఈదా శామ్యూల్ రెడ్డి, షేక్ రసూల్, డాక్టర్ జల్లి విక్టర్, దొమ్మేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నృసింహునికి లక్షతులసీ దళార్చన



లక్ష్మీ నృసింహులకు లక్ష తులసీ దళార్చన

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): లక్ష్మీనృసింహ స్వామి వారికి లక్ష తులసీ దళార్చన శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రావణమాసం ముగింపును పురస్కరించుకొని కొత్తగుళ్ల ప్రాంగణంలోని కోదండరాముని ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవమూర్తులకు శుక్రవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహస్వామి వారిని లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై వేంచేయించారు. అనంతరం స్వామి వారి నామాలతో తులసీ దళార్చన చేశారు. లక్ష్మీకరవలంబ పారాయణం 11 సార్లు పఠించి లక్ష తులసీ దళార్చను పూర్తి చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఈ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పూజలు నిర్వహించారు.

కార్మికులకు బీజేపీ తీరని ద్రోహం



కేజీ మార్కెట్ సెంటర్‌లో కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయు ధర్నా

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): తప్పుడు విధానాలతో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీరని ద్రోహం చేస్తుందని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ అన్నారు. కార్మిక చట్టాల మార్పు, సీఐటీయు రాష్ట్ర నేతల అరెస్టులకు నిరసనగా కేజీ మార్కెట్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరామమ్మ మాట్లాడుతూ కార్మిక హక్కులను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక హక్కులకు సంబంధించిన 44 చట్టాల నుంచి నాలుగు కోడ్లుగా మార్చడం కార్మికులను బానిసత్వంలోకి నెట్టి వేయడమేనన్నారు. తిరుపతిలో 26, 27 తేదీల్లో జరుగుతున్న దేశవ్యాప్త కార్మిక మంత్రుల సదస్సును సీఐటీయు ఇతర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఆ క్రమంలో నిరసన తెలుపుతున్న సీఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్, మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధులను అక్రమంగా అరెస్టులు చేశారని దుయ్యబట్టారు. రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చట్టాలు ప్రజా వ్యతిరేక చట్టాలు చేయడం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. సీఐటీయూ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు మాట్లాడుతూ దేశలో కార్మికులకు మోడీ ద్రోహం చేస్తున్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు ఈవీ నారాయణ, నగర సహాయ కార్యదర్శి జి.వెంకట్రావు నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, సూరిబాబు, వి.సాంబ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.


ఏఆర్‌టీ సెంటర్‌లు నిబంధనలు పాటించాలి



డాక్టర్ ఎం. సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత ప్రభుత్వం నిర్దేశించిన ఏఆర్‌టీ (అసిస్టెడ్ రీప్రొడక్టివిటీ టెక్నిక్స్), సరోగసీ యాక్ట్ 2021 అమలులో భాగంగా ఏఆర్‌టీ సెంటర్‌లు, సరోగసీ కేంద్రాలు వైద్య ఆరోగ్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జిల్లాలో ఏఆర్‌టీ క్లినిక్స్, ఏఆర్‌టీ బ్యాంకులు, సరోగసీ క్లినిక్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు నిబంధనలు పాటించాలని తెలిపారు. దరఖాస్తులను ప్రతి పేజీపై డైరెక్టర్ సంతకం, స్టాంపుతో పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందచేయాలని సూచించారు. దానితో పాటు క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ కాపీ, పీ.సి, పీఎన్‌డీటీ రిజిస్ట్రేషన్ నకలు, ఎమ్.టీ.పీ సర్టిఫికెట్, గైనకాలజిస్టు, అండ్రాలజిస్టు, అనస్థీషియా, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్, కౌన్సిలర్ అర్హత, అనుభవం సర్టిఫికెట్, ఏఆర్‌టీ క్లినిక్, ఏఆర్‌టీ బ్యాంకు, సరోగసీ క్లినిక్, ఈ మూడు ఉన్న సదుపాయాలు ఉన్న వారు హద్దులు, బిల్డింగ్‌ప్లాన్ కచ్చితంగా నిర్దేశించిన కాపీ సమర్పించాలని స్పష్టం చేశారు. ఫీజు ఏఆర్‌టీ బ్యాంకుకు రూ.50 వేలు, ఏఆర్‌టీ క్లినిక్ లెవల్ 1కు రూ. 50 వేలు, లెవల్ 2కు రూ. 2లక్షలు, సరోగసీ క్లినిక్‌కు రూ. 2 లక్షలు డీడీ రూపంలో చెల్లించాలని సూచించారు. ఇవన్నీ కలిపి సెప్టెంబరు 7లోగా జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందచేయాలని చెప్పారు. అనుమతులు లేని క్లినిక్స్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వెంకన్న సన్నిధిలో సామూహిక వ్రతాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): బ్రాహ్మణ వీధిలోని వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాతాలు శుక్రవారం నిర్వహించారు. పద్మావతి అమ్మవారు సైతం వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం పలు కార్యక్రమాలను ప్రముఖ ఆగమ పండితులు నేతృత్వంలో నిర్వహించారు. మహాలక్ష్మీ స్వరూపమైన వరలక్ష్మీదేవిని పూజించటం ద్వారా మహిళలకు సుమంగళి యోగంతో పాటుగా సిరిసంపదలను అమ్మవారు అనుగ్రహిస్తుందని వివరించారు. వ్రతానికి అవసరమైన పూజాద్రవ్యాలు, ప్రసాదాలను మహిళలకు ఉచితంగా అందించారు. ఈవో గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు. అర్చక స్వాములు పొన్నంగపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షత్ నిర్వహించారు.

విజయవాడ ఫ్లై ఓవర్‌లపై డీపీఆర్‌ల తర్వాతే నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ : విజయవాడలో మూడు ఫ్లైఓవర్లు ప్రతిపాదన పరిశీలనలో ఉందని, డీపీఆర్‌లు వచ్చిన తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇటీవల విజయవాడ మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీ నివారణ కోసం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రతిపాదించిన సుమారు 6.5 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం బదులుగా విజయవాడ ఎంపీ కేశినేని నాని ప్రతిపాదించిన మూడు ఫ్లైఓవర్ల నిర్మాణ విషయంలో కేంద్రమంత్రి శుక్రవారం ఒక లేఖ ద్వారా బదులిచ్చారు. మహానాడు జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, ఎనికేపాడు జంక్షన్ల వద్ద మూడు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదించిన ఎంపీ కేశినేని నాని లేఖకు కేంద్ర మంత్రి స్పందించారు.

ప్రకటన

క్లయింటుయగు శ్రీ Mohanlal Kothari, S/o. Danmalji Kothari గారి సంజాయిషీతో తెలియజేయునది - విజయవాడ వాస్తవ్యులైన జాన చంద్రయ్య గారికి చెందినట్టి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ... దస్తావేజు నెం. 2258/1952 ... ది. 21-10-1952 ... ది. 15-05-1956 ... దస్తావేజు నెం. 1417/1956 ... ది. 20-12-1970 ... ది. 09-07-1976 ... ది. 13-01-2015 ... ది. 05-02-2018 ... దస్తావేజు నెం. 1351/2018 ... [illegible] ... 7 రోజులలోపుగా ... రిజిస్టరు పోస్టల్ కరస్పాండెన్స్ (తిరుగు రశీదుతో) ద్వారా తెలియజేయవలయునని ... అందరికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ-1 టౌన్, కొత్తపేట, సైకంవారి వీధిలో యున్నట్టి స్థిరాస్తికి ప్రస్తుత మునిసిపల్ వార్డు నెం. 38, రెవిన్యూ వార్డు నెం. 4, బ్లాకు నెం. 5, ఎన్.టి.యస్.నెం. 293, పాత అసెస్‌మెంట్ నెం. 6219, 5784, 51281లు, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం. 1079021961, పాత డోరు నెం. 8/219లు, ప్రస్తుత డోరు నెం. 9-65-34లు దాఖలా చ.గ. 201-3లు ... ఈ హద్దులు. తూర్పు: సైకం వారి వీధి అనే మున్సిపల్ రోడ్డు, అ. 57-10లు, దక్షిణం: మున్సిపల్ రోడ్డు అ 31-1లు, పడమర: ... గోడ, అ. 57-1లు, ఉత్తరం: ... స్వామి గారి సందు అ 31-4లు.

ఇట్లు: మారుపెద్ది రాజ్‌కుమార్, VNM, న్యాయవాది
39-8-14/1, పైడయ్య వీధి, లబ్బీపేట, విజయవాడ-10. సెల్: 98484 21199)

కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో నిర్వహిస్తోన్న అగ్రికల్చరల్ ఎన్‌ఆర్‌ఐ, ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కోట, కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు తేదీని ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించారు. ఈ విషయాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు శుక్రవారం తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

29 నుంచి 'ఎడ్యుఫెస్ట్-2022'

సాక్షి, అమరావతి: టీచర్స్ డే ను పురస్కరించుకొని ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 5 వరకు విద్యా వారోత్సవాలను నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కె.సురేష్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. ఎడ్యుఫెస్ట్-2022 పేరుతో నిర్వహించే ఈ వారోత్సవాల్లో పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా ప్రాంతాల్లోని ప్రముఖులు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్లు, రిటైర్డ్ టీచర్లను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. 31న వినాయక చవితి సెలవు రోజు మినహాయించి 29 నుంచి ఏ రోజున ఏ కార్యక్రమాలను చేపట్టాలో సర్క్యులర్‌లో పొందుపరిచారు.

మాది ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వం

- మెరుగైన జీపీఎస్ అందించేలా ప్రతిపాదనలు
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- ఆర్థికమంత్రి బుగ్గనతో కలిసి సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో చర్చలు
- తమకు పాత పెన్షన్ విధానమే కావాలంటూ సీపీఎస్ ఉద్యోగ సంఘాల పట్టు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) ఉద్యోగులకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ (గ్యారంటీడ్ పెన్షన్ స్కీం)ను ప్రతిపాదిస్తోందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలిసి సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో చర్చించారు. అనంతరం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో హామీ ఇచ్చాం. కానీ, ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవు. అయినా ఉద్యోగులకు న్యాయం చేయాలనే సంకల్పం మా ప్రభుత్వానికి ఉంది. మాది ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వం. అందుకే సీపీఎస్ స్థానంలో అంతకంటే మెరుగైన జీపీఎస్‌ను ప్రతిపాదిస్తున్నాం. ఉద్యోగ సంఘాలు జీపీఎస్ వద్దు.. అవసరమైతే ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)లో కొన్ని అంశాలను సవరించమంటున్నారు. ప్రభుత్వం జీపీఎస్‌లో మరిన్ని ప్రయోజనాలను చేకూరుస్తానంటోంది. త్వరలోనే రెండింటి మధ్య ఎక్కడోచోట సమస్య పరిష్కారమవుతుంది. అప్పుడు దానికి ఏ పేరైనా పెట్టుకోవచ్చు. ఈ విషయంలో ఉద్యోగుల సంక్షేమాన్ని కోరే ప్రభుత్వంగా ఎన్నిసార్లైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం'.. అని బొత్స అన్నారు.

జీపీఎస్‌లో అదనపు బెనిఫిట్స్ ప్రతిపాదించారు..

మంత్రుల కమిటీ ద్వారా పాత పెన్షన్ విధానంపై తీపికబురు వస్తుందనుకుంటే నిరాశే ఎదురైందని రాష్ట్ర సీపీఎస్ ఉద్యమ వ్యవస్థాపకుడు పి. రామాంజనేయులు యాదవ్ అన్నారు. అయితే, కొత్తగా జీపీఎస్‌లో హెల్త్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కల్పిస్తామనడం సానుకూలంగా ఉందన్నారు. ఇక జీపీఎస్‌పై అయితే భవిష్యత్తులో చర్చలకు వచ్చేదిలేదని.. పాత పెన్షన్‌పై అయితేనే చర్చలకు వస్తామని ఆయన స్పష్టంచేశారు. ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఓపీఎస్‌ను అమలుచేయమంటే జీపీఎస్‌పై చర్చిస్తున్నారన్నారు. దీంతో సెప్టెంబర్ 1న సీఎం ఇంటి ముట్టడిని చేపడతామన్నారు.

ఎవరో పిలుపునిస్తే.. మేమా బాధ్యులమా?

ఇక సీపీఎస్ ఉద్యోగుల బ్లాక్ డే సందర్భంగా విజయవాడలో శాంతియుతంగా సభ పెట్టుకుంటామంటే.. ఎవరో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తే.. తమ సంఘ నాయకులను బైండోవర్ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు అన్నారు. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఛలో విజయవాడ నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఉప సర్పంచ్ కిడ్నాప్

చెన్నేకొత్తపల్లి: మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ అండతో శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. తాజాగా శుక్రవారం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత మాడెం రాజారెడ్డిని కిడ్నాప్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కుటుంబసభ్యులు వారిని వెంబడించి మార్గంమధ్యలో అడ్డుకుని ఉప సర్పంచిని కాపాడారు. బాధితుడు రాజారెడ్డి చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు తాను ఇంటి నుంచి పల్లెన్నగారిపల్లి వద్దనున్న తోటకు వెళుతుండగా టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ అంకె అమరేంద్ర, వడ్డే దుర్గ, జి.అమరేంద్రరెడ్డి, బోయ రవి, బోయ ఆది, బెస్త నాగార్జున, ఆంధ్రజ్యోతి విలేకరి దేవేంద్రరెడ్డి, బోయ నాగరాజు, మట్టా మహేష్ రెండు వాహనాల్లో వచ్చి తనను అడ్డగించి బలవంతంగా వారి వాహనంలోకి ఎక్కించుకున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. తనను కిడ్నాప్ చేసి తీసుకెళుతున్న విషయం తెలిసిన తమ పార్టీ నేతలు రామగిరి మండలం కుంటిమద్ది చెరువుకట్టపైన కిడ్నాపర్ల వాహనాలను అడ్డగించి తనను రక్షించినట్లు పేర్కొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో అలా చేస్తే ఘర్షణలే

అందుకు మేం అంగీకరించం

- జీవనభృతి పేరుతో సామరస్యాన్ని దెబ్బతీయకూడదు
- చింతామణి నాటకంపై తేల్చిచెప్పిన హైకోర్టు
- తదుపరి విచారణ సెప్టెంబర్ 26కి వాయిదా



సాక్షి, అమరావతి : భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఓ వర్గం వారిని మరో వర్గం కించపరిచేందుకు అనుమతినిస్తే ఆ వర్గాల మధ్య ఘర్షణలకు ఆస్కారం కల్పించినట్లేనని, అందుకు తాము అంగీకరించబోమని హైకోర్టు స్పష్టం చేసింది. నాటకంలోని పాత్రల పేరుతో ఓ వర్గాన్ని కించపరిచేందుకు అనుమతించబోమని చెప్పింది. జీవనభృతి పేరుతో సామరస్యాన్ని దెబ్బతీయకూడదని స్పష్టం చేసింది. చింతామణి నాటకం ఒరిజినల్ తెలుగు పుస్తకం ఆన్‌లైన్ కాపీని ప్రభుత్వ న్యాయవాదులకు, ఆర్య వైశ్య సంఘాల తరఫు న్యాయవాదులకు అందజేయాలని ఎంపీ రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 26కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర ద్వారా ఆర్యవైశ్యులను వేశ్యాలోలురుగా చూపుతున్నారని, అందువల్ల నాటకాన్ని నిషేధించాలన్న ఆర్యవైశ్య సంఘాల వినతి మేరకు ప్రభుత్వం ఆ నాటకం ప్రదర్శనపై నిషేధం విధించింది. దీనిని సవాలు చేస్తూ నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు, కళాకారుడు త్రినాథ్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ రెండు వ్యాజ్యాలు శుక్రవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయన్న కారణంతో మొత్తం నాటకంపై నిషేధం తగదన్నారు. దీనివల్ల వేలాది కళాకారుల జీవనభృతి దెబ్బతిందని తెలిపారు. వ్యభిచారం కుటుంబ వ్యవస్థను దెబ్బతీస్తుందని చెప్పడమే ఆ నాటకం ప్రధాన ఉద్దేశమని, సుబ్బిశెట్టి పాత్రతో అదే చెప్పించారని ఉమేశ్ వివరించారు. ఓ వర్గం పేరు ప్రతిబింబించేలా మీరెందుకు నాటకం ప్రదర్శిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఓ వర్గాన్ని మరో వర్గం కించపరిచేందుకు అనుమతినిస్తే పౌర యుద్ధానికి దారి తీస్తుందని తెలిపింది. త్రినాథ్ తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ స్పందిస్తూ, 2002లో ఈ నాటకంపై విధించిన నిషేధాన్ని ఆ తర్వాత హైకోర్టు ఆదేశాలతో తొలగించారని వివరించారు. ఈ నాటకం కల్పితమని, అభ్యంతరకర డైలాగులు లేకుండా చూడాలని 2002లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందన్నారు. నాటకం మొత్తంపై నిషేధం వల్ల కళాకారుల జీవనభృతి దెబ్బతిందన్న శ్రవణ్ కుమార్ వాదనతో ధర్మాసనం విభేదించింది. పూర్తిస్థాయి వాదనల సమయంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామంది.

బాబు అరాచకాలను ప్రజలు క్షమించరు

- కుప్పంలో విధ్వంసాన్ని ప్రేరేపించిన చంద్రబాబును అరెస్టు చేయాలి
- డీజీపీని బెదిరించడం సిగ్గుచేటు
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజం



సాక్షి, అమరావతి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. కుప్పంలో తన గూండాల ముఠాతో బాబు చేయించిన రౌడీయిజం రాష్ట్రమంతా చూసిందన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరి మీడియాతో మాట్లాడారు. కుప్పంలో చంద్రబాబు ప్రేరేపించడం వల్లే టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు దిగారని మండిపడ్డారు. కర్రలతో రౌడీయిజం చేస్తూ.. వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీలు చింపుతూ.. దాడులకు పాల్పడుతూ అరాచకం సృష్టించారని దుయ్యబట్టారు. అతి చిన్న వయసులోనే ఎంపీపీ అయిన బీసీ మహిళపైన చంద్రబాబు రాళ్లదాడి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు అరాచకాలను రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. పైగా డీజీపీని బెదిరించడం సిగ్గుచేటన్నారు. కుప్పంలో విధ్వంసాన్ని ప్రేరేపించిన చంద్రబాబును అరెస్టు చేయాలని డీజీపీని కోరారు. మరోవైపు పార్టీ లేదు.. బొక్కా లేదన్న అచ్చెన్నాయుడు వెంటనే యాక్షన్... డైరెక్షన్ అన్నట్లు డీజీపీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారని మండిపడ్డారు. దీన్ని బట్టి ముందుగానే వ్యూహాత్మకంగా కుప్పంలో విధ్వంసం సృష్టించారని స్పష్టమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని తేల్చిచెప్పారు.

బాబూ చర్చకు సిద్ధమా?

సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన దెబ్బకు కుప్పంలో కూడా చంద్రబాబు రోడ్డుపైన కూర్చునే దుస్థితి వచ్చిందన్నారు. 33 ఏళ్లలో చంద్రబాబు ఏంచేశారో.. మూడేళ్లలో వైఎస్ జగన్ ఏం చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇన్నేళ్లూ కుప్పం ప్రజలను ఓట్లు వేసే యంత్రాలుగానే బాబు చూశారని మండిపడ్డారు. యనమల రామకృష్ణుడు ఒక అవుట్‌డేటెడ్ లీడర్ అని విమర్శించారు. కనీసం తన తుని నియోజకవర్గంలో ఏం జరుగుతుందో కూడా తెలియని వ్యక్తన్నారు. యనమల ఎన్టీఆర్‌ను బాధపెట్టినందుకు క్షోభ పడతారన్నారు.

న్యాయ వ్యవస్థపై దాడులు పెరిగిపోయాయి

- వాటిని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు
- సోషల్ మీడియాలో పోస్టులపై హైకోర్టు వ్యాఖ్య
- తదుపరి విచారణ 26కి వాయిదా

సాక్షి, అమరావతి : న్యాయవ్యవస్థపై దేశవ్యాప్తంగా దాడులు పెరిగిపోయాయని హైకోర్టు పేర్కొంది. ప్రస్తుతం న్యాయవ్యవస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోందని, ప్రతి ఒక్కరూ న్యాయవ్యవస్థపై దాడి చేస్తున్నారంది. దీనికి ఎలా అడ్డుకట్ట వేయాలో తమకు బాగా తెలుసంది. సోషల్ మీడియాలో న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన వ్యాజ్యాల్లో విచారణను సెప్టెంబర్ 26కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులను దూషిస్తూ, కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నా.. పోలీసులు సరిగా స్పందించడం లేదంటూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ హైకోర్టులో గతేడాది పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలు మార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారించింది. సీబీఐ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న న్యాయవాది మెట్టా చంద్రశేఖరరావు స్పందిస్తూ.. ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభ్యంతరకరంగా మాట్లాడానంటూ హైకోర్టు సుమోటోగా నమోదు చేసిన వ్యాజ్యంలో తనను ప్రతివాదిగా చేర్చారని తెలిపారు. తాను బేషరతుగా హైకోర్టుకు క్షమాపణ చెప్పానని, దీంతో హైకోర్టు తనను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించిందన్నారు. ఇది జరిగాక సీబీఐ తనను నిందితునిగా చేర్చి చార్జిషీట్ దాఖలు చేసి జైలుకు పంపిందన్నారు. ఇది తన హక్కులను హరించడమేనన్నారు. తనను జైల్లో ఉంచడం అన్యాయమని, సీబీఐపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ వివరాలన్నింటితో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఈ అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 26కి వాయిదా వేసింది.

రేపు గుంటూరు మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నడవనున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబర్ 07153 నరసాపూర్-యశ్వంత్‌పూర్ రైలు ఈ నెల 28వ తేదీన గుంటూరు డివిజన్ మీదుగా వెళుతుందని, తిరుగు ప్రయాణంలో ఈ నెల 29వ తేదీన రైలు నంబర్ 07154 యశ్వంత్‌పూర్ నుంచి నరసాపూర్ వెళ్తోందని వివరించారు.

ఏఎన్‌యూలో క్రీడోత్సవం

● ఉత్సాహంగా జూనియర్ అథ్లెటిక్స్ ప్రారంభం ● నాలుగు కేటగిరీల్లో పోటీలు ● రాష్ట్రం నలుమూలల నుంచి 1100 మందికిపైగా అథ్లెట్లు హాజరు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 కేటగిరీల్లో బాలుర, బాలికల విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. తొలిరోజు అథ్లెట్లు సత్తాచాటారు. నువ్వానేనా అన్నట్టు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో గెలిచి సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో పాల్గొనాలనే దృఢసంకల్పంతో పోటీపడ్డారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వర రావు, హైమ, టెక్నికల్ కమిటీ చైర్మన్ వైఎం బాషా తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

తొలిరోజు పోటీలు ఇలా..

తొలిరోజు అండర్-20 విభాగంలో పోటీలు జరిగాయి. 200 మీటర్ల పరుగుపందెంలో సెమీఫైనల్ పోటీలు జరిగాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పలు క్రీడల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతల వివరాలివీ..



పరుగు పందెంలో జూనియర్ అథ్లెట్లు

- అండర్-20 బాలుర హైజంప్‌లో సీహెచ్ గాయత్రి వర ప్రసాద్, ఐ.శ్యామ్, బి.సోను.
- ట్రిపుల్ జంప్‌లో సి.జయకృష్ణ,, ఆర్.కరుణ మూర్తి, ఆర్.మణికంఠ.
- షాట్‌పుట్‌లో ఎ.సంజయ్ బాబు, డి.సాత్విక్, పి.ప్రశాంత్.
- జావలిన్‌త్రోలో వి.లావణ్య కుమార్, చిన్నరాజు, ఎ.సహాస్.
- ట్రిపుల్ జంప్‌లో బి.నవీన్, టి.గోపాలకృష్ణ, బి.నరశింహ నాయుడు.

క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం

క్రీడా రంగ అభివృద్ధికి ఏఎన్‌యూలో అధిక ప్రాధాన్యమిస్తున్నామని రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ చెప్పారు. జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వర్సిటీ రాష్ట్రస్థాయి క్రీడా వేదికగా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగేశ్వరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఏపీఏఏ కృషి చేస్తోందన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి హైమ మాట్లాడుతూ ఈ పోటీలలో అర్హత సాధించిన అండర్-14, 16, 18, 20 విభాగాల్లోని బాలబాలికలు సెప్టెంబర్‌లో ఇదే ప్రాంగణంలో జరగబోయే దక్షిణ మండల అంతరాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్యా సంచాలకులు డాక్టర్ పి.జాన్సన్, టెక్నికల్ కమిటీ చైర్మన్ వై.ఎం.బాషా, శిక్షకులు కష్ణమోహన్, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత జూనియర్ ప్రపంచ క్రీడల పోటీలలో రెండుసార్లు పాల్గొన్న కృష్ణా జిల్లా క్రీడాకారిని కుమారి రజిత క్రీడా ప్రతిజ్ఞ చేశారు.

సాంకేతిక విద్యతో అపార ఉపాధి అవకాశాలు

ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి



కళాశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడుతున్న సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, అందువల్ల యువత వారిలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి అన్నారు. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల భవనాన్ని మొత్తాన్ని ఆమె స్వయంగా తిరిగి పరిశీలించారు. తరగతి గదులతో పాటుగా వర్క్‌షాప్, కంప్యూటర్ ల్యాబ్‌లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మెకానికల్ ల్యాబ్‌లోని విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ ఒక ప్రయోగాన్ని చేసి చూపించమని అడిగారు. తరగతులు ఎలా జరుగుతున్నది ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో పాటుగా అధ్యపకేతర సిబ్బంది నాగరాణికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందచేశారు.

మహిళా వసతి గృహ నిర్మాణాన్ని పూర్తి చేయాలి..

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని చివరి దశలో ఆగిపోయిన మహిళా వసతి గృహాన్ని గురించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ విజయసారథి డైరెక్టర్ నాగరాణి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంటనే స్పందించి విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా వసతి గృహం లేకపోతే ఎలా వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అవసరమైతే ప్రవేటు భవనం అద్దెకు తీసుకుని అయినా విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యాన్ని కల్పించాలని ఆమె సూచించారు. కళాశాల ఆవరణలో నిర్మాణ పనులు ఆగిపోయిన అకడమిక్ బిల్డింగ్ భవనాన్ని కూడా పరిశీలించారు. అనంతరం కళాశాల ఆవరణలోని ఏపీ ఈఏపీ సెట్ హెల్ప్ లైన్ సెంటర్‌లో జరుగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు.

జ్వరాల కేసులను ప్రాథమిక దశలోనే నివారించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని



జ్వరంతో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి సుహాసిని

జగ్గయ్యపేట అర్బన్: ఇంటింటి పరిశీలన నిర్వహించి జ్వరాల కేసులు ఉంటే గుర్తించి ప్రాథమిక దశలోనే నివారించాలని ఎన్టీఆర్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సత్యనారాయణపురంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో జ్వరాల బారిన పడిన విద్యార్థులను ఆమె పరామర్శించారు. గురువారం, శుక్రవారాల్లో ఆమె పాఠశాలను సందర్శించారు. గురువారం రాత్రి స్థానిక ప్రభుత్వాస్పత్రిని, ఎస్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. జ్వరాల నివారణ చర్యల్లో భాగంగా స్థానికంగా ఉన్న వైద్యాధికారి, ఇతర అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. హాస్టల్ కిటికీలకు దోమ తెరలను ఏర్పాటు చేయాలని వార్డెన్‌కు సూచించారు. అదేవిధంగా దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. హాస్టల్‌లో మొత్తం 170 మంది పిల్లలకు గాను ముగ్గురు జ్వరంతో బాధపడుతున్న దృష్ట్యా వారికి మలేరియా, టైఫాయిడ్, ర్యాపిడ్ టెస్ట్‌లు చేయగా, నెగటివ్‌గా నిర్ధారణ అయినప్పటికీ 24 గంటలు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తరువాత పరిస్థితులను అంచనా వేయడానికి గాను శుక్రవారం కూడా జిల్లా వైద్యాధికారి సుహాసిని ఆస్పత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీయగా వారి పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకున్నారని తెలిపారు. అనంతరం ఎస్‌వీబీడీ సీపీ జాయింట్ డైరెక్టర్ రామనాథరావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రుక్మాగదరయ్య, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, ఎపిడమియాలజిస్ట్ శృతిమౌనిక, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, తహసీల్దార్ కె.నాగేశ్వరరావు, డీటీ నాగరాజు, పీపీ యూనిట్ వైద్యాధికారి వాసంతి తదితర అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఫీవర్ సర్వే నిర్వహణ, వైద్య శిబిరం కొనసాగించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో మహేష్, డాక్టర్లు నాగరాణి, ప్రవీణ్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కిచెన్ టిప్స్



● బియ్యం కడిగిన నీటిని ఒక డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ నీటిని మొక్కలకు ఎరువుగా వాడవచ్చు. ఈ నీటిని స్ప్రేడబ్బాలో వేసి స్టవ్‌ను క్లీన్ చేస్తే తళతళా మెరుస్తుంది.



● నిమ్మకాయ తొక్కలను పడేయకుండా ఒక గిన్నెలో వేసి రిఫ్రిజిరేటర్‌లో పెడితే .. రిఫ్రిజిరేటర్‌లో వచ్చే దుర్వాసన తొలగిపోతుంది.



స్కూల్ పిల్లలతో సునీతారావు

గురు దేవోభవ!

బడి... బిడ్డను విద్యార్థిగా మార్చే అక్షరాల ఒడి. ఆ ఒడిలో పిల్లలు హాయిగా అక్షరాలు దిద్దాలి. భవిష్యత్తును బంగారంగా దిద్దుకోవాలి. బిడ్డల భవిష్యత్తును దిద్దే చేతులకు వందనం. ఉపాధ్యాయ వృత్తికి వందనం. వృత్తికి వన్నె తెచ్చిన గురువులకు వందనం.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అంటే విద్యా బోధనలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు ఓ గుర్తింపు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం అందుకుంటున్న వారిలో ఇద్దరు మహిళలున్నారు. ఒకరు ఆంధ్రప్రదేశ్‌లోని కానూరు 'జిల్లా పరిషత్ హైస్కూల్' ఫిజిక్స్ టీచర్ రావి అరుణ. మరొకరు హైదరాబాద్, నాచారం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ సునీతారావు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు ఐదవ తేదీన న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వీరికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరుగుతుంది. సునీతారావు, రావి అరుణ ఈ సందర్భంగా తమ సంతోషాన్ని సాక్షితో పంచుకున్నారు.

''మాది మైసూర్. బాల్యం హైదరాబాద్‌లోనే. ఐదవ తరగతి వరకు సెయింట్ ఆన్స్‌లో చదివాను. ఆరవ తరగతి నుంచి చెన్నై. నా బోధన ప్రస్థానం కర్నాటక రాష్ట్రం తుముకూరులోని టీవీఎస్ అకాడమీలో మూడవ తరగతి టీచర్‌గా మొదలైంది. ఆశ్చర్యంగా అనిపించే విషయం ఏమిటంటే నేను చదువు చెబుతూ చదువుకున్నాను. ఉద్యోగం చేస్తూ ఎంఏ ఎకనమిక్స్, ఎంఫిల్ పూర్తి చేశాను. ఆ తర్వాత కేంబ్రిడ్జిలో డిప్లమో, హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను... ఇలా ఏటా స్కూల్ వెకేషన్‌ని నేను ఏదో ఒక కోర్సు



పాఠం చెప్పి ఊరుకుంటే చాలదు!

ప్రిన్సిపల్‌గా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా కరికులమ్ రూపొందిస్తుంటాను. గ్లోబల్ ఎక్స్‌పోజర్ ఉండాల్సిన తరం ఇది. ఒకప్పటిలా సిలబస్‌కే పరిమితమైతే సరిపోదు. క్యారెక్టర్ బిల్డింగ్ చాలా ముఖ్యం. విలువలు, క్రమశిక్షణ, ధైర్యం, అంకితభావం, నిజాయితీ వంటివన్నీ వ్యక్తిత్వానికి ఒక రూపునిస్తాయి. అలాగే ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన నైపుణ్యం ఏదో ఒకటి ఉంటుంది. దానిని గుర్తించి ప్రోత్సహించాలి. అప్పుడే పిల్లలకు పరిపూర్ణమైన విద్య అందుతుంది. మా దగ్గర స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేసే విద్యార్థులకు అవసరమైన సెలవులు ఇవ్వడం, వారి కోసం సాయంత్రం ప్రత్యేక తరగతులు చెప్పించి పరీక్షలు పెట్టడం వంటి మార్పులు చేశాను. టీచర్ అంటే విద్యార్థులకు పాఠం చెప్పడమే కాదు, వారి భవిష్యత్తు కలలకు ఒక రూపం ఇవ్వాలి. ఆ కలల సాకారానికి అవసరమైన నైపుణ్యాన్ని పెంపొందించాలి.

- సునీతారావు,
ప్రిన్సిపల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం, సికింద్రాబాద్

సైన్స్ ఎక్కడో లేదు...



''నేను పుట్టింది గుంటూరు జిల్లా అనంతవరప్పాడులో. పెరిగింది మాత్రం మచిలీపట్నంలో. మా నాన్న రావిరంగారావు బీఎస్సీ కాలేజ్ ప్రిన్సిపల్, అమ్మ ప్రభావతి. అమ్మ కూడా టీచరే. ఆ నేపథ్యమే నన్ను బోధన రంగం వైపు మళ్లించి ఉంటుంది. నిజానికి చిన్నప్పుడు నా మదిలో 'భూమి ఎలా పుట్టింది, గ్రహాలు వలయాకారంలో ఎందుకుంటాయి' వంటి అనేక ప్రశ్నలు మెదిలేవి. అలాగే సైంటిస్ట్ కావాలనే ఆలోచన కూడా. కానీ ఎందుకో తెలియదు బీఈడీలో చేరిపోయాను. బీఈడీ పూర్తయిన వెంటనే 1996లో ఉద్యోగం వచ్చింది. ఫస్ట్ పోస్టింగ్ విజయవాడలోని ఎనికేపాడులో. అక్కడి తోటి ఉపాధ్యాయుల ప్రభావంతో బోధనను బాగా ఎంజాయ్ చేశాను. చదువు చెబుతూనే చదువుకుంటున్నాను. ఎమ్మెస్సీ, ఎమ్ఈడీ, విద్యాబోధనలో ఇన్నోవేటివ్ టీచింగ్ టెక్నాలజీస్ మీద పీహెచ్‌డీ పూర్తయింది. ఇప్పుడు ఫిజిక్స్‌లో మరో పీహెచ్‌డీ చేస్తున్నాను.

ప్రత్యామ్నాయం వెతకాలి!

సైన్స్ అంటే పుస్తకాల్లో ఉండేది కాదు, మన చుట్టూ ఉంటుందని చెప్పడంలో విజయవంతమయ్యాను. పరిశోధన ల్యాబ్‌లో మాత్రమే కాదు, ఇంట్లో కూడా చేయవచ్చని నేర్పించాను. పరిశోధనకు ఒక వస్తువు లేకపోతే ప్రత్యామ్నాయంగా అదే లక్షణాలున్న మరో వస్తువును ఎంచుకోవడం గురించి ఆలోచింపచేశాను. యాసిడ్ లేదని పరిశోధన ఆపకూడదు, నిమ్మరసంతో ప్రయత్నించాలి. అలాగే ఇంట్లో వాడిపారేసే వస్తువులను, ఆఖరుకు కోడిగుడ్డు పెంకులను కూడా స్కూల్‌కి తెప్పించి వాటితోనే పరిశోధన చేయించేదాన్ని. ఒక్కమాటలో చెప్పాలంటే సైన్స్‌ని జీవితానికి అన్వయించుకోవడం ఎలాగో నేర్పిస్తాను. కొంతమంది పిల్లలు పుస్తకంలో ఉన్నదానిని క్షుణ్ణంగా మెదడుకు పట్టించుకుంటారు. కానీ తమ ఎదురుగా ఉన్న విషయం మీద అప్లై చేయడంలో విఫలమవుతుంటారు. నా స్టూడెంట్స్ అలా ఫెయిల్ కారు. దోమలను పారదోలగలిగేది రెడీమేడ్ మస్కిటో రిపెల్లెంట్ మాత్రమే కాదు బంతి చెట్టు కిటికీలో పెట్టినా ఫలితాన్ని పొందవచ్చని నా విద్యార్థులకు తెలుసు. ఫీల్డ్ ఎడ్యుకేషన్‌కి వాటర్ వర్క్స్‌తోపాటు ప్రతి డిపార్ట్‌మెంట్‌కీ తీసుకుని వెళ్తాం. మా స్కూల్ విద్యార్థులు చేసిన ప్రయోగాలు స్టేట్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శితమయ్యాయి. నేషనల్ ఇన్‌స్పైర్ మనక్‌లో రెండు ప్రాజెక్టులు ప్రదర్శించాం. ఇస్రో సైన్స్ క్విజ్‌లో రెండేళ్లు పాల్గొనడంతోపాటు మా విద్యార్థులు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. తక్కువ వనరులున్న పాఠశాల నుంచి పిల్లలను జాతీయ స్థాయి వేదికల వరకు తీసుకెళ్లగలుగుతున్నందుకు గర్వకారణంగా ఉంది. రేడియో ప్రసంగాల్లో ఎక్కువగా మహిళాసాధికారత గురించి మాట్లాడేదాన్ని. అలాగే ఈ పురస్కారాన్ని దేశానికి ఫస్ట్ సిటిజన్ హోదాలో ఉన్న ఒక మహిళ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది.

– రావి అరుణ, ఫిజిక్స్ టీచర్,
జిల్లా పరిషత్ పాఠశాల, కానూరు, కృష్ణాజిల్లా

కోసం ప్లాన్ చేసుకునేదాన్ని. నాకిష్టమైన గణితం కోసం చెన్నైలోని రామానుజమ్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాను. ముప్పై రెండేళ్ల సర్వీస్‌లో నేను పిల్లలకు ఎన్నో నేర్పించాను, అంతకంటే ఎక్కువగా నేను నేర్చుకున్నాను. టీచర్ ఎప్పుడూ ఒకచోట ఆగిపోకూడదు. నిత్య విద్యార్థిలా రోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉండాలి. పుస్తకాల్లో ఉన్న విషయాన్ని చెప్పి పాఠాలు ముగిస్తే సరిపోదు. కొత్త విషయాలను తెలుసుకుంటూ వాటిని దైనందిన జీవితానికి అన్వయిస్తూ పాఠం చెప్పాలి. అలాగే ఏ తరగతికి అవసరమైతే ఆ తరగతికి పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉండాలి. నేను థర్డ్ క్లాస్ టీచర్‌గా చేరినా, అవసరమైనప్పుడు ఫస్ట్ స్టాండర్డ్‌కి కూడా పాఠాలు చెప్పాను. పన్నెండో తరగతి టీచర్ అయినా సరే ఒకటవ తరగతి టీచర్ లేనప్పుడు ఆ క్లాస్‌ను తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అలాగే పాఠాన్ని సృజనాత్మకంగా చెప్పాలి. పిల్లలకు ఏ పదాలు అర్థం అవుతున్నాయో ఆ పదాల్లో వివరించాలి. వృత్తి పట్ల గౌరవం, విశ్వాసం ఉండాలి. రూల్స్‌కోసం పని చేసే వృత్తి కాదిది. అవసరమైన విధంగా ఒదిగిపోవాలి. కొంతమంది పిల్లలు డిప్రెషన్‌కు లోనవుతుంటారు. చదువు మీద ఆసక్తి సన్నగిల్లడం మొదలవుతుంది. ఆ విషయాన్ని తల్లిదండ్రుల కంటే ముందు పసిగట్టగలిగింది టీచర్ మాత్రమే. పేరెంట్స్ వచ్చి చెప్పేవరకు టీచర్ గుర్తించని స్థితిలో ఉండకూడదు. అలాంటి పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతుంటాను నేను. వాళ్లతో విడిగా మాట్లాడి, కౌన్సెలింగ్ ఇవ్వడం, వారి కోసం మెంటార్‌గా ఒక టీచర్‌కు బాధ్యత అప్పగించడం ద్వారా ఆ స్టూడెంట్ తిరిగి చదువుమీద మునుపటిలా ధ్యాస పెట్టే వరకు కనిపెట్టి ఉండాలి. అలాంటప్పుడు తల్లిదండ్రులు వచ్చి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియచేస్తుంటారు. టీచర్‌గా అత్యంత సంతోష పడే క్షణాలవి.

గురుశిష్యుల బంధం

విద్యార్థులు అమ్మానాన్న తర్వాత ఆదర్శంగా తీసుకునేది టీచర్‌నే. అందుకే టీచర్ గౌరవప్రదంగా కనిపించాలి. ఆహార్యం, మాటతీరు, నడవడిక... ప్రతి విషయంలోనూ ఆదర్శనీయంగా ఉండాలి. గురుశిష్యుల బంధం ఉన్నతమైంది. స్టాఫ్‌రూమ్‌లో ఉపాధ్యాయుల మధ్య జరిగే సంభాషణ కూడా పిల్లల మీద ప్రభావాన్ని చూపిస్తుంది. విద్యాబోధనకు అవసరమైన చర్చలే ఉండాలి. అలాగే ప్రతి టీచరూ క్లాస్‌కి వెళ్లే ముందు ఏం చెప్పాలనే విషయం మీద తప్పనిసరిగా హోమ్‌వర్క్ చేయాలి, పాఠం చెప్పిన తర్వాత సరిగ్గా చెప్పానా లేదా అని స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. ఇదే ఒక టీచర్‌గా నా తోటి ఉపాధ్యాయులకు నేను చెప్పగలిగిన మంచిమాట'' అన్నారు సునీతారావు.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: **నడిపూడి కిషోర్**

టైమ్ ట్రావెల్

వన్ ఉమన్ షో
ఇతిహాసపు చీకటి కోణం



అట్టడుగున పడి కనిపించని కథలన్నీ కావాలిప్పుడు... అని అప్పుడెప్పుడో పిలుపు ఇచ్చారు శ్రీశ్రీ. ఇండియన్ మెమరీ ప్రాజెక్ట్‌లోకి అడుగు పెడితే మహాకవి ఆశించిన కనిపించని కథలు ఫొటోలుగా కనిపించడమే కాదు, కథలు కూడా చెబుతాయి...

మహారాణిగా రాజ్యం ఏలిన ఒక దేవదాసి గురించి మీకు తెలుసా? రాజ్యాంగ రచన కోసం ఉపయోగించిన ఒకానొక కలాన్ని తయారుచేసిన వ్యక్తిని ఎప్పుడైనా చూశారా? తొలిసారిగా ఇంగ్లిష్-హిందీ, ఇంగ్లిష్ మరాఠీ నిఘంటువును రూపొందించిన సుఖ్‌సంపత్ రాయ్ భండారీ, పదహారు సంవత్సరాల వయసులో స్వరాష్ట్రం కేరళను వదిలి ఆ తరువాత ఆఫ్రికాలో ప్రసిద్ధ మల్లయోధుడిగా ఎదిగిన మంజేరి కండి రామచంద్రన్ గురించి, బ్రిటిష్ ఇండియాలో ప్రమాదకరమైన ఔట్‌పోస్ట్‌లలో ఒంటరిగా ఉద్యోగం చేసి విషాదస్థితిలో మరణించిన లెఫ్టినెంట్ లక్షణ్ కడ్లే, టినేజ్‌లోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన చమేలి జైన్, తొలిసారిగా భారతీయ సినిమాలో డబుల్ జెండర్ రోల్(హీరోయిన్, హీరో) పోషించిన అన్నా హరి సలుంకి గురించి విన్నారా?

'ఐఎంపి' అనే టైమ్‌మిషన్‌లోకి వెళితే వారిని చేరవచ్చు. గౌరవంగా పలకరించవచ్చు. ఎన్నో వివరాలు తెలుసుకోవచ్చు.

ముంబైకి చెందిన అనూష యాదవ్ మొదలు పెట్టిన ఇండియన్ మెమరీ ప్రాజెక్ట్(ఐఎంపి)కు ఆన్‌లైన్‌లో అపూర్వమైన ఆదరణ లభిస్తుంది.

రెండు ప్రపంచ యుద్ధాలు, మన స్వాతంత్ర్య సంగ్రామం, దేశవిభజన నుంచి మొదలు ఎప్పుడూ పేరైన వినని అసాధారణ వ్యక్తుల వరకు ఇండియన్ మెమోరీ ప్రాజెక్ట్‌లోకి వెళ్లి తెలుసుకోవచ్చు. 'ఇండియా అంటే ఇది' అని విదేశీయులు ఒక అంచనాకు రావడానికి తన ప్రాజెక్ట్ ఉపకరిస్తుంది అని చెబుతుంది అనూష యాదవ్.

'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్' గ్రాడ్యుయేట్ అయిన అనూష యాదవ్ పోర్ట్రయిట్ ఫొటోగ్రాఫర్, బ్రాండ్ కల్చర్ డిజైనింగ్ కన్సల్టెంట్.

పన్నెండు సంవత్సరాల వయసులో అనూష తండ్రి చనిపోయారు.

ఆయన గుర్తు వచ్చినప్పుడల్లా పెట్టెల్లో ఉన్న ఫోటోలను దగ్గరికి తీసుకునేది అనూష. అందులో నాన్న కనిపించేవాడు. నెలల వయసులో ఉన్న తనను ఎత్తుకున్న నాన్న, ఏదో ఫంక్షన్‌లో పాట పాడుతున్న నాన్న, పెళ్లి బరాత్‌లో డ్యాన్స్ చేస్తున్న నాన్న!

ఎన్నో ఫోటోలలో, ఎన్నో రకాలుగా నాన్న కనిపించేవాడు.

అలా ఫొటోలపై ఆసక్తి మొదలైంది. అది పెరిగి పెద్దై ఇండియన్ మెమరీ ప్రాజెక్ట్ రూపం ధరించింది.

'ఇది నాస్టాల్జియాకు మాత్రమే పరిమితమైన ప్రాజెక్ట్ కాదు' అంటుంది అనూష.

నిజమే 'ఐఎంపి' ఆన్‌లైన్ ఆర్కైవ్‌లోకి వెళితే చరిత్ర దారులు కనిపిస్తాయి. ప్రతి మలుపులో, కూడలిలో ఎన్నో నిజాలు, విషయాలు తెలుస్తుంటాయి. జ్ఞానపరిధిని విస్తృతపరుస్తాయి.



అనూష యాదవ్

బ్యూటిప్

ఎక్కువ సమయం కంప్యూటర్ స్క్రీన్ లేదా మొబైల్ స్క్రీన్ చూడడం వల్ల కళ్లు ఒత్తిడికి గురై అలసిపోతుంటాయి. ఇలాంటి కళ్ల ఒత్తిడిని తగ్గించి ఉపశాంతిని కలిగించే మాస్క్‌లను ఇంట్లోనే సులభంగా ఎలా తయారు చేసుకోవచ్చో చూద్దాం...

కంటి ఒత్తిడి తగ్గించే మాస్క్



రోజ్‌వాటర్‌లో కాటన్ ముక్కను కాసేపు నానబెట్టాలి. తరువాత కాటన్‌ను రెండుకళ్లపై మొత్తం కప్పి ఉంచి, పదిహేను నిమిషాలు తరువాత తీసేయాలి. ఒకసారి ఇలా చేసిన తరువాత కాటన్‌ను రిఫ్రిజిరేటర్‌లో పెట్టి మరోసారి కూడా వాడుకోవచ్చు.

* * *

టీ బ్యాగ్‌లను చల్లటి నీటిలో నానబెట్టాలి. తరువాత టీ బ్యాగ్‌లను నీటి నుంచి బయటకు తీసి, టీబ్యాగ్‌లో అధికంగా ఉన్న నీటిని పిండి కళ్లమీద పెట్టుకుని పదినిమిషాలు ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు ఒత్తిడి తగ్గడంతోపాటు, కంటిచుట్టూ ఏర్పడిన నల్లని వలయాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి.

* * *

బంగాళదుంప, పుదీనా ముఖాన్ని అందంగా ఉంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అదేవిధంగా కళ్ల ఒత్తిడిని తగ్గించడంలోనూ కీలకపాత్ర పోషిస్తాయి. పుదీనా రసం, బంగాళ దుంప రసాన్ని సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి పది నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. మిశ్రమం చల్లబడిన తరువాత .. కాటన్ బాల్‌ను ముంచి కళ్లమీద పెట్టుకుని ఐదు నిమిషాలు ఉంచుకోవాలి. కళ్ల ఒత్తిడి తగ్గడంతోపాటు, కళ్లచుట్టూ ఏర్పడిన ముడతలు తగ్గుముఖం పడతాయి. వీటిలో ఏ ఒక్కటి పాటించినా కళ్లకు ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది.

కృషి

పథకంతో పని చేసింది
పతకాలు సాధించింది



ప్రతిభ ఉండి, వెలుగులోకి రానివారిని మట్టిలో మాణిక్యాలుగా పోలుస్తుంటారు పెద్దలు. అలాంటి పోలికకు సరిగ్గా సరిపోయే వ్యక్తే మాసిలామణి. పొట్టకూటికోసం పనిమనిషిగా చేస్తూ కూడా తనలోని ప్రతిభకు పదునుపెట్టి పవర్ లిఫ్టింగ్‌లో ఏకంగా బంగారు పతకం గెలుచుకుని ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తోంది.

కోయంబత్తూరులోని కునియముత్తూరు దగ్గరల్లో ఉన్న రామానుజం నగర్‌లో నలభై ఏళ్ల మాసిలామణికి దర్శిని, ధరణి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురుకు పెళ్లి అయి అత్తారింట్లో ఉంటోంది. మాసిలామణి భర్త రమేశ్ కూలిపనులు చేస్తుంటే మాసిలామణి రెండు ఇళ్లలో పనిచేస్తూ ఇద్దరూ కలిసి కుటుంబాన్ని లాక్కొస్తున్నారు. ఇళ్లల్లో పనిచేస్తున్నప్పటికీ ఆమె పనితీరు, నిజాయితీ కారణంగా ఆమె పని చేసే ఇంటి యజమానులు మాసిలామణిని సొంతమనిషిలా చూసుకునేవారు. ఆమె కుటుంబం ఉండడానికి అద్దె లేకుండా ఇంటిని కూడా ఇచ్చారు ఒక ఇంటి యజమాని. ఎంతో దయార్ధ్ర హృదయం కలిగిన ఈ యజమాని ఓ రోజు... ''మాసిలామణి నువ్వు కాస్త లావుగా ఉన్నావు. వ్యాయామం చేస్తే అధిక బరువు తగ్గడమేగాక, మరింత ఆరోగ్యంగా తయారవుతావు. నాకు తెలిసిన ఒక జిమ్ ఉంది, అక్కడికి వెళ్లు'' అని చెప్పారు.



ఆ యజమానికి తెలిసిన జిమ్ ఓనర్ సి. శివకుమార్... పవర్ లిఫ్టింగ్‌లో ఏసియన్ గోల్డ్‌మెడల్ సాధించిన వ్యక్తి. జిమ్ నిర్వహించడంతోపాటు, ట్రైనర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఇంటి యజమాని సలహాతో మాసిలామణి శివకుమార్ జిమ్‌లో చేరింది. కొద్దిరోజుల్లోనే జిమ్‌లో చేసే వ్యాయామం నచ్చడంతో తన కూతురు ధరణిని కూడా జిమ్‌లో చేర్పించింది. తల్లీ కూతుళ్లిద్దరూ ఎంతో ఉత్సాహంగా జిమ్‌లో ఉన్న బరువైన పరికరాలను సునాయాసంగా ఎత్తుతూ వ్యాయామం చేసేవారు. దీంతో మాసిలామణి బరువు తగ్గడానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

వర్కవుట్స్‌లో మొదటి నుంచి వీరిద్దరి పట్టుదలను, దీక్షని గమనిస్తోన్న శివకుమార్ ''మీకు పవర్‌లిఫ్టింగ్ ఎలా చేయాలో నేను ఉచితంగా నేర్పిస్తాను. మీరు చక్కగా నేర్చుకోండి చాలు'' అని చెప్పారు. ఆ రోజు నుంచి ఇద్దరూ పవర్ లిఫ్టింగ్ సాధన చేయడం ప్రారంభించారు.



నవ్విన వాళ్లే అభినందిస్తున్నారు

జిమ్‌లో చేరిన తొలినాళ్లలో అంతా మమ్మల్ని చూసి నవ్వారు. కొంతమంది కుటుంబ సభ్యులు, స్నేహితులు పనులు చేసేవాళ్లకు జిమ్‌లు అవసరమా? అని అవహేళనగా మాట్లాడారు. పవర్ లిఫ్టింగ్ గురించి తెలిసినప్పుడు ఈ వయసులో ఇలాంటి పనులు అవసరమా? ఏం చేస్తున్నావో నీకు తెలుస్తుందా? అని ఈసడించారు. ఇప్పుడు మేమేంటో నిరూపించాం. దీంతో అప్పుడు నవ్విన వారంతా అభినందిస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాం.

- మాసిలామణి

కోచింగ్ ఫ్రీగా దొరికినప్పటికీ...

కోచింగ్ ఉచితంగా అందుతున్నప్పటికీ బలమైన ఆహారం తీసుకునే స్తోమత వారికి లేదు. అయినా ఏ మాత్రం నిరాశ పడలేదు. కఠోరదీక్షతో సాధన చేసేవారు. ఇలా చక్కగా శిక్షణ తీసుకున్న తల్లీ కూతుళ్లిద్దరూ గతనెలలో తిరుచ్చిలో జరిగిన 'తమిళనాడు పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్' రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. మాసిలామణి 63 కేజీల విభాగంలో 77.5 కేజీల బరువుని అవలీలగా ఎత్తి స్వర్ణపతకం గెలుచుకుంది. 17 ఏళ్ల ధరణి 47 కేజీల విభాగంలో 72.5 కేజీల బరువును ఎత్తి కాంస్య పతకం దక్కించుకుంది.

పేదరికం నుంచి పవర్ లిఫ్టింగ్‌లో తమ సత్తా చాటిన ఈ తల్లీకూతుళ్లు సెప్టెంబర్ 14 నుంచి 19 వరకు చెన్నైలో జరగనున్న తమిళనాడు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పోటీలలో పతకాలు గెలుచుకునేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు.

ఏది పడితే అది ఆరగించకండి

కొన్ని రకాల పండ్ల గింజలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుమ్మడి గింజలు, పుచ్చకాయ గింజలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా విత్తనాలను తింటే శరీరానికి ఎన్నో రకాల పోషకాలు అందుతాయి. అయితే కొన్ని పండ్ల విత్తనాలను పొరపాటున కూడా తినకూడదు. అవి ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..



ఆపిల్

రోజుకు ఒక ఆపిల్ ను తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని ఆరోగ్య నిపుణులు, డాక్టర్లు చెబుతుంటారు. ఆపిల్ మంచిదే అయినా.. ఆపిల్ గింజలు మాత్రం మన ఆరోగ్యానికి ఏ మాత్రం మంచివి కావు. ఎందుంటే వీటిలో సైనైడ్ ఉంటుంది. ఇది కడుపులోకి వెళ్లి విరేచనాలు, వికారం, కడుపు తిమ్మిరి వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు ఇది మరణానికి కూడా దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు.



చెర్రీ

మన శరీరానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలను అందిస్తాయి చెర్రీ పండ్లు. కానీ చెర్రీ గింజల్లో హానికరమైన సైనైడ్ సమ్మేళనం ఉంటుంది. వీటిని ఎక్కువ మొత్తంలో తినడం వల్ల ఆపిల్ తినడం వల్ల కలిగే నష్టాలే కలుగుతాయి.



ఆప్రికాట్

ఆప్రికాట్ విత్తనాలలో విషపదార్థాలైన అమిగ్దాలన్, సైనోజెనిక్ గ్లైకోసైడ్లు ఉంటాయి. ఆప్రికాట్ విత్తనాలను తినడం వల్ల శరీరం బలహీనపడటమే కాదు.. ప్రాణాల మీదికి వస్తుంది. ఈ విత్తనాలు ఒక వ్యక్తిని కోమాలోకి తీసుకెళతాయి.



పీచ్

పీచ్ విత్తనాల్లో అమిగ్దాలిన్, సైనోజెనిక్ గ్లైకోసైడ్లు ఉంటాయి. వీటిని తినడం వల్ల ఆప్రికాట్ విత్తనాల మాదిరిగానే లక్షణాలు కనిపిస్తాయి. దీనిని తినడం వల్ల పొత్తికడుపు నొప్పి, నెర్వస్‌నెస్ సమస్య ఎక్కువగా ఉంటుంది.



పియర్

విత్తనాల్లో ప్రాణాంతకమైన సైనైడ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి వికారం, విరేచనాలు, పొత్తికడుపు నొప్పిని కలిగిస్తుంది. అలాగే చెమట, అలసట వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇది కోమాకు కూడా దారితీస్తుంది.

ఇంకా బొప్పాయి గింజలు కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

• హెల్త్ టిప్స్

పిగ్మెంటేషన్ పీడిస్తోందా?

రకరకాల కారణాల వల్ల ముఖంపై పిగ్మెటేషన్ వస్తుంటుంది చాలామందికి. చూడటానికి అది చాలా ఇబ్బందిగా ఉంటుంది. దానికి క్రీములు, ఇతర మందులు వాడే బదులు ఇలా చేసి చూస్తే సరి..

బంగాళదుంప, నిమ్మరసం.. ఒక బంగాళదుంపని తురిమి అందులో పావు కప్పు నిమ్మరసం కలపండి. పిగ్మెంటేషన్ ఎక్కువగా ఉన్న చోట ఈ మాస్క్‌ని వేసుకుని అరగంట ఆగి చల్లని నీటితో కడిగేయాలి. ఇలా రోజుకి రెండుసార్లు చేయవచ్చు.

నిమ్మరసం, తేనె.. రెండు టేబుల్ స్పూన్ల తేనెలో రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి అవసరమున్న చోట ఈ మిశ్రమాన్ని పూతలా వేసుకోవాలి. తర్వాత గోరు వెచ్చని నీటిలో మెత్తటి బట్ట ముంచి పిండేసి ఆ బట్టని ఈ మిశ్రమం అప్లై చేసిన చోట కవర్ చేసినట్లుగా వేయండి. ఇరవైనిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా వారానికి ఒకసారి చేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్: అర కప్పు యాపిల్ సిడార్ వెనిగర్ లో అర కప్పు నీరు కలపండి. పిగ్మెంటేషన్ ఉన్న చోట ఈ నీటిని పోయండి. నాలుగైదు నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా రోజుకి రెండు సార్లు నెల రోజుల పాటూ చేయండి.

పసుపు, పాలు: ఒక బౌల్‌లో ఐదారు టీ స్పూన్ల పసుపు తీసుకుని అందులో తగినంత పాలు పోసి మెత్తటి పేస్ట్ లా చేయండి. పిగ్మెంటేషన్ ఉన్నచోట ఈ పేస్ట్ అప్లై చేసి ఐదునిమిషాలు గుండ్రంగా మసాజ్ చేయండి. ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. రోజూ స్నానానికి ముందు ఒకసారి ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

లైఫ్@360



ప్రస్తుత కాలంలో డెంగ్యూ జ్వరాలు, వైరల్ ఫీవర్ల మూలాన ప్లేట్‌లెట్ల కౌంట్ విపరీతంగా పడిపోతూ రోగులను, వారి సంబంధీకులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. అయితే, ప్లేట్‌లెట్ల కౌంట్ పడిపోయిన తర్వాత చేయగలిగిందేమీ లేదు, దాతలనుంచి సేకరించిన ప్లేట్‌లెట్లను రోగులకు ఎక్కించడం మినహా. అలా కాకుండా, మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటే రోగ నిరోధకత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రోగనిరోధకతను పెంచే ఆహారం ఏమిటో తెలుసుకుందాం.

ఆహారమే ఆరోగ్యం

రోగనిరోధకతను పెంచుకోండి ఇలా..




రక్తాన్ని పెంచే క్యారట్.. ప్లేట్‌లెట్ కౌంట్‌ని కూడా పెంచుతుంది. దీన్ని తీసుకోవడం వల్ల ఆ సమస్యతో బాధపడే వారు త్వరగా ఉపశమనం పొందారని సర్వేలో తేలింది. క్యారెట్‌ని నేరుగానైనా, సలాడ్ రూపంలోనైనా ఎలా తీసుకున్నా ఫలితం ఉంటుంది.



గుమ్మడికాయ.. ఎక్కువగా వంటల్లో ఉపయోగించే గుమ్మడిలో విటమిన్ ఏ ఎక్కువగా ఉంటుంది. అంతేనా.. ఇందులో ప్లేట్‌లెట్లని పెంచడమే కాదు, వాటి సంఖ్యను అదుపులో ఉంచే లక్షణాలు కూడా ఉన్నాయి. దీన్ని క్రమబద్ధంగా తీసుకోవడం వల్ల కణాల్లో ప్రోటీన్ ఉత్పత్తి అవుతుంది. ఇలా ప్రోటీన్ ఉత్పత్తి అవడమంటే ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరిగినట్లే.



బొప్పాయి: బొప్పాయి పండు ఆరోగ్యానికి, చర్మ సౌందర్యానికి చాలా మంచిదని తెలుసు. అయితే, కేవలం పండులో మాత్రమే కాదు.. ఈ ఆకుల్లోనూ బోలెడు ఆరోగ్యానికి సంబంధించిన గుణాలున్నాయి. ముఖ్యంగా ఇందులో ఫ్లేవనాయిడ్స్, అల్కాలాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిని తినడం వల్ల 24 గంటల్లోనే ప్లేట్‌లెట్ పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. అయితే, ఈ ఆకు రుచి మాత్రం కాస్త చేదుగానే ఉంటుంది. కానీ, ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోకతప్పదు.



గోధుమగడ్డి.. ఈ మధ్యకాలంలో చాలామందికి ఆరోగ్యంపై పెరిగిన అవగాహన కారణంగా.. గోధుమగడ్డి గురించి అందరూ ఆరా తీస్తున్నారు. ఎందుకంటే ఇందులోని ఎన్నో ప్రత్యేక గుణాలు ఆరోగ్యానికి చాలా మంచిది. కాబట్టి.. ఈ గడ్డిని రసంగా చేసుకుని వడపోసి అందులో కాస్త నిమ్మరసం కలిపి తాగాలి. ఇలా చేయడం వల్ల ప్లేట్‌లెట్స్ కౌంట్ సులభంగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

విటమిన్ కె ఫుడ్..

విటమిన్ కె ఉన్న ఫుడ్ కూడా ప్లేట్‌లెట్స్ సంఖ్యని పెంచుతుందని తేలింది. కేల్, గుడ్లు, ఆకుకూరలు, లివర్, మాంసం, క్యాబేజీ తినడం వల్ల కూడా ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరుగుతుంది.



విటమిన్ సి ఫుడ్.

ఆరోగ్యానికి విటమిన్ సి చాలా అవసరం. విటమిన్ సి ఎక్కువగా ఉన్న నిమ్మ, కమలా ఫలం, కివీ, పాలకూర, ఉసిరి, బ్రొకోలీ, టమాట, అడవి ఉసిరి, కాలీఫ్లవర్ తినడం వల్ల ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతుందని తేలింది. ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గించి కౌంట్‌ని పెంచడంలో ఈ ఆహారపదార్థాలు బాగా ఉపయోగపడతాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయిన వారు సమస్యని పరిష్కరించుకునేందుకు వీటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఒకవేళ తినడం కష్టం అనుకుంటే వీటితో సలాడ్ చేసి భోజనానికి ముందుగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇక కమలాఫలాల్ని జ్యూస్‌లా చేసుకోని తాగేయొచ్చు.



బీ 12 ఫుడ్..

పాలు, గుడ్లు, చీజ్‌లో బీ 12 ఎక్కువగా ఉంటుంది. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల ప్లేట్‌లెట్స్ కౌంట్ బాగా పెరుగుతుందని తేలింది.


బీట్ రూట్.. ఎరుపు రంగులో ఉండే బీట్‌రూట్.. శరీరంలో రక్త శాతాన్ని పెంచుతుంది. దీనిని ఎలా తీసుకున్నా మంచిదే. దీని వల్ల ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరుగుతుంది. క్యారట్, బీట్‌రూట్‌ని కలిపి జ్యూస్ చేసుకుని తాగినా మంచి ఫలితమే ఉంటుంది.

ముఖ్య విషయం ఏమిటంటే.. పైన చెప్పిన ఆహారపదార్థాలను తీసుకోవడం వల్ల కేవలం ప్లేట్‌లెట్స్ సంఖ్య ఒక్కటే పెరగదు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వాటిలో వ్యాధి నిరోధకత ఒకటి. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది.



సినిమా


• చిరంజీవి


• మహేశ్‌బాబు

సమ్మర్‌కి సై

వేసవి సీజన్ అంటే సినిమా పండగ. ఈ సీజన్‌లో ఎన్ని సినిమాలు విడుదలైనా టికెట్లు తెగుతాయి. అందుకే సమ్మర్‌కి సినిమాలను రిలీజ్ చేయడానికి నిర్మాతలు ఆసక్తి చూపిస్తుంటారు. అలా 'సమ్మర్‌కి సై' అంటూ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న, రిలీజ్‌కి రెడీ అవుతున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

వేసవి అంటే దాదాపు మార్చి నుంచి ఆరంభమవుతుంది. మార్చిలో ఇప్పటివరకూ విడుదల తేదీ ఖరారు చేసుకున్న చిత్రాల్లో నాని హీరోగా నటిస్తున్న 'దసరా' ఉంది. ఈ చిత్రం మార్చి 30న రిలీజ్ కానుంది. శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'నేను లోకల్' చిత్రం తర్వాత నాని, కీర్తీ సురేశ్ జోడీగా నటిస్తున్న చిత్రం ఇది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇక ఏప్రిల్‌లో ఇప్పటికే విడుదల తేదీ ఖరారు చేసుకున్నవాటిలో చిరంజీవి, మహేశ్‌బాబుల చిత్రాలు ఉన్నాయి. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో 'భోళా శంకర్' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిరంజీవి చెల్లెలి పాత్రను కీర్తీ సురేష్ చేస్తున్నారు. అనిల్ సుంకర, రామ బ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. ఇక 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మూడో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తారు. ఎస్. రాధాకృష్ణ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 28న విడుదల కానుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఇంకా ఆరంభం కాలేదు. సెప్టెంబరు లేదా అక్టోబరు మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుందట.


• నాని

మరోవైపు బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ కూడా వేసవి బరిలో నిలిచే అవకాశం ఉంది. బాలకృష్ణ, హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. హరీష్ పెద్ది, సాహు గారపాటి ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలో షూటింగ్ ఆరంభం కానుంది. ఈ చిత్రాన్ని వేసవిలో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. అలాగే పవన్ కళ్యాణ్ హీరోగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' కూడా సమ్మర్‌కే రానుంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్‌పాల్ విలన్‌గా నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఏయం రత్నం ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే వేసవిలో రిలీజ్ చేసే ప్లాన్స్ ఉన్నట్లుగా ఇటీవల ఓ సందర్భంలో ఏయం రత్నం పేర్కొన్నారు. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ కూడా సమ్మర్ సందడిలో ఉండే అవకాశం ఉంది. 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. కళ్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా కోసం పాన్ ఇండియా అప్పీల్ ఉండే కథను రెడీ చేస్తున్నారట కొరటాల. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ఈ సినిమాను వేసవిలోనే విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట. మరోవైపు రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రం కూడా వేసవి బరిలో నిలుస్తుందని టాక్. మేలో రిలీజ్ చేయాలనుకుంటున్నారని భోగట్టా. మరికొన్ని భారీ బడ్జెట్ చిత్రాలతో పాటు, మీడియమ్, స్మాల్ బడ్జెట్ చిత్రాలు కూడా సమ్మర్‌లో రిలీజ్ కానున్నాయి.

జోడీ రిపీట్?


• దుల్కర్

దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'సీతా రామం'కి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిన సంగతి తెలిసిందే. అలా ఈ చిత్రంతో బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌కు తెలుగులో మంచి అరంగేట్రం లభించింది. 'సీతారామం'ను నిర్మించిన వైజయంతీ మూవీస్‌లోనే మృణాల్ మరో సినిమా సైన్ చేశారట. ఈ సినిమాను తెరకెక్కించే దర్శకుల్లో హను రాఘవపూడి, నందినీ రెడ్డి పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే హీరో పాత్రకు దుల్కర్ సల్మాన్ పేరు పరిశీలనలో ఉందట. ఒకవేళ ఈ సినిమాలో హీరోగా దుల్కర్ సల్మాన్ ఫిక్స్ అయితే 'సీతారామం' జోడీ రిపీటైనట్లే. మరి.. దుల్కర్, మృణాల్ మళ్లీ జోడీ కడతారా? వేచి చూడాల్సిందే.


• మృణాల్

వకాలత్ నామా ప్రారంభం


• సురేష్‌బాబు, కేఎస్ రామారావు

కె. సురేష్‌బాబు హీరోగా బోడపాటి మురళి దర్శకత్వంలో కుళ్ళపరెడ్డి హేమ చంద్రారెడ్డి, కుళ్ళపరెడ్డి దామోదర రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'వకాలత్ నామా'. ఈ సినిమా ప్రారంభోత్సం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. హైకోర్టు ప్రముఖ న్యాయవాది శ్వేతా రెడ్డి నేతృత్వంలో ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. తొలి సీన్‌కి మేక మేనక శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత కేఎస్ రామారావు క్లాప్ ఇచ్చారు. దర్శకులు వి. సాగర్ గౌరవ దర్శకత్వం వహించారు.

అది నా అదృష్టం


• శ్రీకాంత్ రెడ్డి

''చిరంజీవిగారు, కమల్‌హాసన్‌గారు వంటి గొప్ప హీరోలతో మంచి క్లాసిక్ చిత్రాలు తీసిన పూర్ణోదయ బ్యానర్‌లో నాకు హీరోగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వంశీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ పి. దర్శకత్వంలో 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ అందించిన కథతో శ్రీకాంత్ రెడ్డి, సంచిత బాషు జంటగా నటించిన చిత్రం 'ఫస్ట్ డే ఫస్ట్ షో'. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ అధినేత ఏడిద నాగేశ్వరరావు మనవరాలు శ్రీజ (నటుడు ఏడిద శ్రీరామ్ కుమార్తె) నిర్మాతగా, శ్రీజ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌లో నిర్మించిన చిత్రం 'ఫస్ట్ డే ఫస్ట్ షో'. మిత్రవింద మూవీస్ సహనిర్మాతగా ఏడిద శ్రీరామ్ సమర్పిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 2న రిలీజవుతోంది. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ– ''పిట్టగోడ' చిత్రంలో మెయిన్ లీడ్‌గా చేశాను. ఆ తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. 'ఫస్ట్ డే ఫస్ట్ షో' కథ గురించి అనుదీప్ ఓసారి నాకు చెప్పాడు.. అద్భుతమైన కథ. ఆడిషన్స్‌లో సెలెక్ట్ అయిన తర్వాతే నన్ను హీరోగా ఫైనలైజ్ చేశారు. పవన్ కల్యాణ్‌గారి 'ఖుషి' సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్ సాధించడానికి శీను అనే కుర్రాడు ఎలాంటి ప్రయత్నాలు చేశాడనేది ఈ సినిమా కథ'' అన్నారు.

ఒకే ఒక జీవితం మారిపోయే!


• శర్వానంద్

శర్వానంద్, రీతూ వర్మ జంటగా శ్రీ కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఒకే ఒక జీవితం'. ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో (తమిళంలో 'కణం' పేరుతో) సెప్టెంబర్ 9న విడుదలవుతోంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'మారిపోయే..' అంటూ సాగే ప్రమోషనల్ సాంగ్‌ని విడుదల చేశారు. ఈ పాటని హీరో కార్తీ పాడటం విశేషం. అది మాత్రమే కాదు.. ఈ పాటలో ఆయన ప్రత్యేకంగా కనిపించడం మరో ప్రత్యేకత. ''విభిన్నమైన కథాంశంతో రూపొందిన చిత్రమిది. శర్వానంద్ కెరీర్‌లో 30వ సినిమా 'ఒకే ఒక జీవితం'. 'మారిపోయే..' పాటకు కృష్ణచైతన్య సాహిత్యం అందించగా, కార్తీ ఎనర్జిటిక్‌గా పాడారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. అమల అక్కినేని, 'వెన్నెల' కిషోర్, ప్రియదర్శి, నాజర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సుజీత్ సారంగ్.

నా గుండెలదర..


• రోహిణి, బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి, సన్నీ

సన్నీ నవీన్, రోహిణీ రేచల్ జంటగా నూతన దర్శకుడు తోట మల్లికార్జున తెరకెక్కించిన చిత్రం 'జైత్ర'. అల్లం శ్రీతన్మయి సమర్పణలో అల్లం సుభాష్ నిర్మించారు. ఈ సినిమా నుంచి 'అదర నా గుండెలదర..' అంటూ సాగే సెకండ్ లిరికల్ వీడియో సాంగ్‌ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''రాయలసీమ నేపథ్యంలో ఫ్యాక్షన్ సినిమాలు చూశాం. అయితే ఒక రైతు కథతో వాస్తవానికి దగ్గరగా తీసిన చిత్రం 'జైత్ర'. సాంగ్స్, టీజర్ బాగున్నాయి. సినిమా హిట్టవ్వాలి'' అన్నారు. ''మట్టితో చుట్టరికం చేసే ఒక రైతు కథే ఈ సినిమా. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయనున్నాం'' అన్నారు మల్లికార్జున, అల్లం సుభాష్. ఈ చిత్రానికి కెమెరా: మోహన్ చారి, సంగీతం: ఫణి కల్యాణ్.

తీహార్ కాలేజ్‌లో...


• మనోజ్, సోనీ రెడ్డి, ఫణి చక్రవర్తి

సమాజంలోని ప్రస్తుత పరిస్థితులతో వాస్తవానికి దగ్గరగా ఉండే కథలతో సినిమాలు తెరకెక్కిస్తుంటారు దర్శకుడు పి. సునీల్‌కుమార్ రెడ్డి. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన సినిమా 'వెల్‌కమ్ టు తీహార్ కాలేజ్'. మనోజ్ నందన్ హీరో. డా. ఎల్ఎన్ రావు, యక్కలి రవీంద్ర బాబు నిర్మించిన ఈ సినిమాని సెప్టెంబరులో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సునీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ– ''ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థల్లో విద్య పేరుతో జరుగుతున్న అరాచకం నేపథ్యంలో సునిశిత హాస్యంతో రూపొందించిన చిత్రం ఇది. ర్యాంకుల పోటీలో పడి నలిగిపోతున్న యువత అంతరంగాన్ని వినోదభరితంగా, ఆలోచింపజేసేలా తెరకెక్కించాను'' అన్నారు. ఫణి చక్రవర్తి, కృష్ణ తేజ, సోనీ రెడ్డి, మనీషా, సత్యానంద్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: సాబు జేమ్స్, సంగీతం: ప్రవీణ్ ఇమ్మడి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	59	58,834
నిఫ్టీ ▲	36	17,559

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	12,295	▽	343
డోజోన్స్	32,679	▽	612
ఎఫ్‌టీఎస్ఈ 100	7,425	▽	52
డాక్స్	12,971	▽	300
షాంఘై	3,236	▽	10
నికాయ్	28,641	△	162

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఆర్సెలర్ చేతికి ఎస్సార్ పోర్టులు

- డీల్ విలువ రూ. 19,000 కోట్లు
- హజీరాలో ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటు
- ఇందుకు 50:50 భాగస్వామ్య సంస్థకు ఓకే



న్యూఢిల్లీ: పోర్టుల బిజినెస్‌ను మెటల్ రంగ దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌కు విక్రయించినట్లు ప్రయివేట్ రంగ దిగ్గజం ఎస్సార్ గ్రూప్ తాజాగా పేర్కొంది. ఇందుకు 2.4 బిలియన్ డాలర్ల(రూ. 19,000 కోట్లు) విలువైన తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. కోవిడ్-19 తదుపరి దేశీయంగా ఇది అతిపెద్ద డీల్‌కాగా.. నిర్ధిష్ట పోర్టులతోపాటు, విద్యుత్ రంగ మౌలిక సదుపాయాలను సైతం ఆర్సెలర్‌కు బదిలీ చేయనున్నట్లు ఎస్సార్ తెలియజేసింది. ప్రధానంగా గుజరాత్‌లోని హజీరా స్టీల్ ప్లాంటు అవసరాల కోసం ఏర్పాటు చేసిన వీటిని విక్రయించేందుకు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వివరించింది. అంతేకాకుండా డీల్‌లో భాగంగా హజీరాలో వార్షికంగా 4 ఎంటీ సామర్థ్యంగల ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటుకు రెండు సంస్థలు 50:50 భాగస్వామ్య సంస్థను సైతం నెలకొల్పనున్నట్లు తెలియజేసింది. హజీరా స్టీల్ ప్లాంటును 2018-19లోనే ఆర్సెలర్‌మిట్టల్ కొనుగోలు చేసిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం.

3 రాష్ట్రాల్లో...

ఎస్సార్ గ్రూప్‌తో కుదిరిన తాజా ఒప్పందంలో భాగంగా గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలోని పోర్టులతోపాటు హజీరాలోగల రెండు విద్యుత్ ప్లాంట్లు సొంతం కానున్నట్లు ఆర్సెలర్ మిట్టల్ విడిగా ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యుత్ ప్రసార లైన్ సైతం దీనిలో భాగమేనని తెలియజేసింది. 2018-19లో దివాలా చట్ట చర్యలలో భాగంగా రూ. 42,000 కోట్లకు ఎస్సార్ స్టీల్‌ను ఆర్సెలర్ మిట్టల్ కొనుగోలు చేసింది. తద్వారా పోర్టు లైసెన్స్ కార్యకలాపాల హక్కులు సైతం దక్కినట్లు ఆర్సెలర్ మిట్టల్ పేర్కొన్నప్పటికీ ఎస్సార్ బల్క్‌టెర్మినల్ దీనిని వ్యతిరేకించింది. దివాలా చర్యల్లోకి ఇవి రావని వాదించింది. దీంతో ఈ వివాదం కోర్టులకు చేరింది. అయితే ప్రస్తుతం రెండు సంస్థలూ వీటిపై ఒక ఒప్పందానికి రావడం గమనార్హం!

వైజాగ్ టెర్మినల్ సైతం

హజీరాలోని డీప్ డ్రాఫ్ట్ బల్క్ పోర్ట్ టెర్మినల్‌లోని 25 ఎంటీపీఏ జెట్టీతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలోగల 16 ఎంటీపీఏ డీప్ డ్రాఫ్ట్ టెర్మినల్ డీల్‌లో భాగమని ఆర్సెలర్ మిట్టల్ పేర్కొంది. అంతేకాకుండా ఇక్కడగల 8 ఎంటీపీఏ ఐరన్ ఓర్ పెల్లెట్ ప్లాంటుతో అనుసంధానమైన సమీకృత కన్వేయర్ కూడా ఉన్నట్లు తెలియజేసింది. ఇదేవిధంగా ఒడిశాలోని 12 ఎంటీపీఏ పారదీప్ డీప్ వాటర్ జెట్టీ, కన్వేయర్ ఒప్పందంలోకి వస్తాయని వివరించింది. వీటితోపాటు హజీరాలోని 270 మెగావాట్ల మల్టీ ఇంధన ప్లాంట్, 515 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంటు ఉన్నట్లు వెల్లడించింది.

మూడేళ్లలో సగం ఎస్‌యూవీలే

- ఇప్పటికే 42 శాతం వాటా కైవసం
- హ్యాచ్‌బ్యాక్ ధరలోనే ఇవి లభ్యం
- బీవైడీ ఇండియా ఎస్‌వీపీ సంజయ్



ఈ6 కారుతో సంజయ్ గోపాలకృష్ణన్, మోదీ గ్రూప్ ఎండీ నిహార్ మోదీ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ) హవా నడుస్తోంది. అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఎస్‌యూవీల వాటా 35-38 శాతం ఉంటే.. భారత్‌లో ఇది 42 శాతమని బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికిల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ తెలిపారు. భారత్‌లో సంస్థ మూడవ షోరూం మోడీ బీవైడీని హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా సాక్షి బిజినెస్ బ్యూరోతో మాట్లాడారు. మూడేళ్లలో ఎస్‌యూవీల వాటా 50 శాతానికి చేరుతుందన్నారు. హ్యాచ్‌బ్యాక్‌ల ధరలోనే రూ. 6-7 లక్షల నుంచే ఈ మోడళ్లు లభ్యం కావడం ఈ స్థాయి అమ్మకాలకు కారణమని చెప్పారు. ఆయనింకా ఏమన్నారంటే..

ధర ప్రాధాన్యత కాదు..

ప్యాసింజర్ వెహికల్స్ విషయంలో హైదరాబాద్ విభిన్న మార్కెట్. ఇక్కడి మార్కెట్లో ఏం జరుగుతుందో అంచనా వేయలేం. గడిచిన అయిదేళ్లలో హైదరాబాద్ విపణి గణనీయంగా వృద్ధి చెందింది. విక్రయాల పరంగా ఢిల్లీ, బెంగళూరు తర్వాత భాగ్యనగరి టాప్‌లో నిలిచింది. కారు కొనుగోలు నిర్ణయం విషయంలో ఒకప్పుడు ధర ప్రామాణికంగా ఉండేది. ప్రాధాన్యత క్రమంలో ఇప్పుడు బ్రాండ్, ఎక్స్‌టీరియర్స్, ఇంటీరియర్స్, ఫీచర్స్, సేఫ్టీ తర్వాత ధర నిలిచింది. దేశవ్యాప్తంగా జూలైలో ప్యాసింజర్ కార్లు 2,50,972 యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఈ ఏడాది 50,000 యూనిట్లు..

దేశంలో సగటున నెలకు అన్ని బ్రాండ్లవి కలిపి 3,500 ఎలక్ట్రిక్ కార్లు అమ్ముడవుతున్నాయి. ఈ ఏడాది జూలై నాటికి 26,000 యూనిట్లు రోడ్డెక్కాయి. 2022లో దేశవ్యాప్తంగా 50,000 ఎలక్ట్రిక్ కార్లు అమ్ముడవుతాయని అంచనా. ప్యాసింజర్ వాహన రంగంలో ఈవీల వాటా 2 శాతమే. ఇది 2030 నాటికి 30 శాతానికి చేరనుంది. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన విక్రయాల్లో టాప్-1 ర్యాంక్ కోసం హైదరాబాద్, బెంగళూరు పోటీపడుతున్నాయి. ఈ-ప్యాసింజర్ వెహికల్స్‌లో దక్షిణాది వాటా 50-60 శాతంగా ఉంది. కస్టమర్లు తమ రెండవ కారుగా ఈవీని కొనుగోలు చేస్తున్నారు.

భారీ లక్ష్యంతో..

అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న కార్లను భారత్‌లో పరిచయం చేస్తాం. బీవైడీ ఎలక్ట్రిక్ కారు ఈ6ను 2021 నవంబర్‌లో ప్రవేశపెట్టాం. 450 యూనిట్లు విక్రయించాం. ఒకసారి చార్జింగ్ చేస్తే ఈ కారు 520 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దీపావళికి ప్రీమియం ఈ-ఎస్‌యూవీని ప్రకటించనున్నాం. జనవరి నుంచి డెలివరీలు ఉంటాయి. 2030 నాటికి ఈ-ప్యాసింజర్ వెహికల్స్ రంగంలో దేశంలో 30 శాతం మార్కెట్‌ను కైవసం చేసుకుంటాం. బీవైడీ భారత్‌లో ఇప్పటివరకు సుమారు రూ.1,185 కోట్లు వెచ్చించింది.

ఆరంభ లాభాలు ఆవిరి

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



ముంబై: అమెరికా 45వ వార్షిక జాక్సన్ హోల్ ఎకనమిక్ పాలసీ సింపోజియం సదస్సులో ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు ఈక్విటీ మార్కెట్లలో అప్రమత్తత చోటు చేసుకుంది. ఆరంభ లాభాల్ని కోల్పోయిన స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్పలాభాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 276 పాయింట్ల లాభంతో 59,051 వద్ద మొదలైంది. నిఫ్టీ 97 పాయింట్లు పెరిగి 17,619 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 548 పాయింట్లు బలపడి 59,322 వద్ద, నిఫ్టీ 164 పాయింట్లు దూసుకెళ్లి 17,686 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. అయితే వారాంతపు రోజు కావడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో సూచీలు ఆరంభలాభాల్ని కోల్పోవడమే కాకుండా..., క్రమంగా నష్టాల్లోకి మళ్లాయి. ఆఖరి అరగంటలో మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంక్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 59 పాయింట్లు లాభపడి 58,834 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36 పాయింట్లు పెరిగి 17,559 వద్ద నిలిచింది. అదానీ ఓపెన్ ఆఫర్ నేపథ్యంలో ఎన్‌డీటీవీ షేర్లు మూడోరోజూ 5% అప్పర్ సర్క్యూట్‌తో రూ. 423.85 వద్ద ఏడాది గరిష్టాన్ని నమోదు చేసింది.

సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ లిస్టింగ్ సూపర్ హిట్

సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర రూ.220తో పోలిస్తే ఈ షేరు బీఎస్ఈలో 19 శాతం లాభంతో రూ.262 వద్ద లిస్టయ్యింది. చివరికి 42 శాతం బలపడి రూ.313 వద్ద స్థిరపడింది.

డ్రీమ్‌ఫోక్స్ ఐపీఓకు భారీ స్పందన

డ్రీమ్‌ఫోక్స్ పబ్లిక్ ఇష్యూకు విశేష స్పందన లభించింది. చివరిరోజు నాటికి ఐపీఓ 56.68 రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	51,668	▼	426
బంగారం (99.5 స్వచ్ఛత)	51,461	▼	424
వెండి (కిలో)	55,607	▼	276

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-8-2022	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
26-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

ఏసీసీ, అంబుజాకు ఓపెన్ ఆఫర్

- 26% చొప్పున వాటాల కొనుగోలు
- 31,000 కోట్ల వ్యయానికి అదానీ సై

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా ఏసీసీ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. తద్వారా స్విస్ దిగ్గజం హోల్సిమ్‌కు చెందిన దేశీ అనుబంధ సంస్థల్లో 26 శాతం చొప్పున వాటాలను కొనుగోలు చేయనుంది. ఇందుకు మొత్తం రూ. 31,000 కోట్లు వెచ్చించనుంది. ఈ ఏడాది మే నెలలో హోల్సిమ్ లిమిటెడ్ దేశీ బిజినెస్‌ల కొనుగోలుకి అదానీ గ్రూప్ 10.5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 84,000 కోట్లు) విలువైన డీల్‌ను కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు గత వారం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు పొందింది.

సెప్టెంబర్ 9 వరకూ..: అంబుజా సిమెంట్స్ వాటాదారులకు షేరుకి రూ. 385, ఏసీసీ వాటాదారులకు షేరుకి రూ. 2,300 చొప్పున అదానీ గ్రూప్ ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఆఫర్ శుక్రవారం (26న) ప్రారంభమై 2022 సెప్టెంబర్ 9న ముగియనుంది. వెరసి అంబుజా సిమెంట్స్‌కు చెందిన 51.63 కోట్ల షేర్లు(26 శాతం వాటా) అదానీ గ్రూప్ కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 19,880 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో ఏసీసీకి చెందిన 4.89 కోట్ల షేర్ల కోసం రూ. 11,260 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. డీల్‌లో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 63.19 శాతం వాటాతోపాటు ఏసీసీలో 54.53% వాటాను అదానీ సొంతం చేసుకోనుంది. ఓపెన్ ఆఫర్ నేపథ్యంలో అంబుజా సిమెంట్స్ షేరు ఎన్ఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 403 వద్ద ముగిసింది. ఇక ఏసీసీ నామమాత్ర లాభంతో రూ. 2,286 వద్ద ముగిసింది.

సెబీ అనుమతి అవసరంలేదు

- ఆర్ఆర్‌పీఆర్‌కు ఆదేశాలు వర్తించవు
- అదానీ గ్రూప్ తాజా వివరణ

న్యూఢిల్లీ: ఎన్‌డీటీవీ ప్రమోటర్ సంస్థ ఆర్ఆర్‌పీఆర్‌లో వాటాను సొంతం చేసుకునేందుకు సెబీ అనుమతులు అవసరంలేదని అదానీ గ్రూప్ తాజాగా పేర్కొంది. ఆర్ఆర్‌పీఆర్ లేవనెత్తిన అంశాలు నిరాధారమని, న్యాయపరంగా ఆమోదనీయంకావని, సత్య దూరాలని వ్యాఖ్యానించింది. దీంతో వెనువెంటనే వారంట్ల స్థానే ఈక్విటీల కేటాయింపునకు డిమాండ్ చేస్తున్నట్లు తెలియజేసింది. ఆర్ఆర్‌పీఆర్‌కు ఇచ్చిన రుణాలకుగాను పొందిన వారంట్లను ఈక్విటీగా మార్పు చేసుకునేందుకు అదానీ గ్రూప్ సంస్థ వీసీపీఎల్ నిర్ణయించడం తెలిసిందే. తద్వారా ఎన్‌డీటీవీ ప్రమోటర్ సంస్థలో 99.5% వాటాను పొందనుంది. ఫలితంగా ఎన్‌డీటీవీలో ఆర్ఆర్‌పీఆర్‌కు గల 29.18% వాటాను సొంతం చేసుకోనుంది.

భారత్‌పై 'ఫిఫా' నిషేధం ఎత్తివేత

భారత ఫుట్‌బాల్‌కు ఊరట లభించింది. భారత్‌పై విధించిన నిషేధాన్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ఎత్తివేసింది. నిషేధాన్ని తొలగించాలని 'ఫిఫా' కౌన్సిల్ బ్యూరో శుక్రవారం నిర్ణయించింది. భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఎగ్జిక్యూటివ్ కమిటీని రద్దు చేసి రోజూవారీ కార్యకలాపాలపై సమాఖ్య పరిపాలనా వర్గం పూర్తిగా పట్టు చేజిక్కించుకున్నట్లు తెలియడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని 'ఫిఫా' ప్రకటించింది. భారత్‌లో పరిస్థితిని సమీక్షిస్తూ ఉంటామని, ఎన్నికలను సరైన రీతిలో నిర్వహించేందుకు సహకారం అందిస్తామని స్పష్టం చేసింది. దీంతో అక్టోబర్ 11నుంచి భారత్‌లో జరగాల్సిన అండర్-17 మహిళల ప్రపంచ కప్‌ను యథావిధిగా నిర్వహించేందుకు అనుమతిచ్చింది.

'ఆసియా' అందుకునేందుకు...



- నేటినుంచి ఆసియా కప్ టి20 టోర్నీ
- బరిలో ఆరు జట్లు
- తొలి పోరులో శ్రీలంకతో అఫ్గనిస్తాన్ ఢీ
- రేపు భారత్, పాకిస్తాన్ సమరం
- సెప్టెంబర్ 11న ఫైనల్
- అన్ని మ్యాచ్‌లు రా. 7.30నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: టి20 ప్రపంచ కప్‌కు ముందు ఈ ఫార్మాట్‌లో ఉపఖండపు ప్రధాన జట్లు సన్నాహకానికి సన్నద్ధమయ్యాయి. ద్వైపాక్షిక సిరీస్‌లు కాకుండా కొంత విరామం తర్వాత భారత జట్టు కూడా రెండుకంటే ఎక్కువ జట్లు ఉన్న టోర్నీలో బరిలోకి దిగుతోంది. దాంతో ఆసియా కప్ టోర్నమెంట్ ఆసక్తికరంగా మారింది. ఆతిథ్యం ఇవ్వాల్సిన శ్రీలంక ఆర్థిక సంక్షోభంతో చేతులెత్తేయడంతో చివరి నిమిషంలో వేదిక యూఏఈకి మారింది. తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే ఈ సమయంలో ఆటగాళ్లకు ఇది కూడా సవాల్. టి20 ప్రపంచ కప్ జరిగే ఆస్ట్రేలియాతో పోలిస్తే పిచ్‌లు, పరిస్థితుల్లో చాలా వ్యత్యాసం ఉన్నా, తమ ఆటగాళ్లను పరీక్షించుకునేందుకు అన్ని జట్లూ ప్రయత్నిస్తాయి. భారత్, పాకిస్తాన్ మధ్య కనీసం రెండు మ్యాచ్‌లతో పాటు మరో మ్యాచ్ కూడా జరిగే అవకాశం ఉండటంతో టోర్నీపై అభిమానుల ఆసక్తి మరింత పెరిగేలా చేసింది. 2020లో జరగాల్సిన టోర్నీ కోవిడ్ కారణంగా వాయిదా పడుతూ వచ్చి రెండేళ్లు ఆలస్యంగా జరుగుతోంది.

జట్ల వివరాలు: (గ్రూప్ 'ఎ')భారత్, పాకిస్తాన్, హాంకాంగ్.

(గ్రూప్ 'బి') శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్.

ఫార్మాట్: తమ గ్రూప్‌లోని రెండు జట్లతో ఆడిన అనంతరం టాప్-2 టీమ్‌లు ముందంజ వేస్తాయి. అక్కడ మిగిలిన మూడు టీమ్‌లతో తలపడాల్సి ఉంటుంది. టాప్-2 జట్లు ఫైనల్‌కు చేరతాయి. ఐదు టీమ్‌లు నేరుగా టోర్నీలో అడుగు పెట్టగా, క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా హాంకాంగ్ అర్హత సాధించింది. దుబాయ్, షార్జాలలో మ్యాచ్‌లు జరుగుతాయి. సెప్టెంబర్ 11న ఫైనల్ నిర్వహిస్తారు.

టోర్నీ చరిత్ర: ఆసియా కప్‌ను ఇప్పటి వరకు 14 సార్లు నిర్వహించారు. 1984-2018 మధ్య ఈ టోర్నమెంట్‌లు జరిగాయి. అత్యధికంగా 7 సార్లు భారత్ విజేతగా నిలవగా, శ్రీలంక 5 సార్లు టోర్నీ గెలిచింది. పాకిస్తాన్ 2 సార్లు ట్రోఫీని అందుకుంది.

డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్ బరిలోకి దిగుతోంది. 2018లో వన్డే ఫార్మాట్‌లో జరిగిన టోర్నీలో రోహిత్ శర్మ నాయకత్వంలోనే టీమిండియా టైటిల్ సాధించింది. 2016లో కూడా ప్రపంచకప్‌కు కొద్ది రోజుల ముందు ఈ టోర్నీని టి20 ఫార్మాట్‌లోనే నిర్వహించారు.

సాత్విక్-చిరాగ్ 'డబుల్స్' ధమాకా

భారత అమ్మాయిల జోడి 11 ఏళ్ల క్రితమే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం పని పట్టింది. ఈ టోర్నీ చరిత్రలో ఇన్నేళ్లయినా పురుషుల జోడీ వల్ల ఒక్క పతకం కూడా రాలేదు. ఇప్పుడా లోటు ఆంధ్రప్రదేశ్ ఆటగాడు సాత్విక్ సాయిరాజ్ వల్ల తీరింది. చిరాగ్‌శెట్టితో జతకట్టిన తెలుగు తేజం తనకన్నా మెరుగైన రెండో ర్యాంకింగ్ జోడీని కంగు తినిపించాడు. సెమీస్ చేరడం ద్వారా సాత్విక్-చిరాగ్‌లకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది.



- డబుల్స్ సెమీస్‌లో భారత జోడి
- కనీసం కాంస్యం ఖాయం
- క్వార్టర్స్‌లో ప్రణయ్ ఓటమి

టోక్యో: మన షట్లర్లు దూసుకెళుతున్నారు. కామన్వెల్త్‌గేమ్స్, ఏషియాడ్, ఒలింపిక్స్, థామస్-ఉబెర్ కప్, ప్రపంచ చాంపియన్‌షిప్ ఇలా ఏ మెగా ఈవెంట్ అయినా సరికొత్త చరిత్ర సృష్టిస్తూ సాగుతున్నారు. తాజాగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పురుషుల డబుల్స్‌లో అందని ద్రాక్షయిన పతకాన్ని ఇప్పుడు అందుకోనున్నారు. అంతర్జాతీయ సర్క్యూట్‌లో స్థిరంగా రాణిస్తున్న సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ఈ టోక్యో ఈవెంట్‌లో ఆ ఘనత సాధించారు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ ఏడో ర్యాంక్ జోడీ సెమీస్ చేరడంతో కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకు జంటపై భారత ద్వయం ఆటను చూస్తే పతకం రంగు మారినా ఆశ్చర్యం లేదు. అంతలా డిఫెండింగ్ చాంపియన్స్‌పై సత్తా చాటారు. రెండో గేమ్‌లో పుంజుకున్న స్థానిక మేటి ర్యాంకింగ్ జోడీని నిర్ణాయక గేమ్‌లో ఓడించి మరీ సెమీస్ చేరిన తీరు అద్భుతం! శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి జోడి 24-22, 15-21, 21-14తో ప్రపంచ రెండో ర్యాంకు, డిఫెండింగ్ చాంపియన్ టకురో హోకి-యుగో కొబయాషి (జపాన్) జంటను కంగుతినిపించింది. గంటా 15 నిమిషాల పాటు జరిగిన ఈ హోరాహోరీ పోరాటంలో భారత జోడీదే పైచేయి అయ్యింది. తొలిగేమ్‌లో ఆరంభం నుంచే పట్టుబిగించిన సాత్విక్-చిరాగ్ 12-5తో జోరు పెంచారు.అయితే వరుసగా ఏడు పాయింట్లు సాధించిన డిఫెండింగ్ చాంపియన్ జంట 16-14తో పోటీలో పడింది. ఈ గేమ్ ఆఖరిదాకా పట్టుసడలించని పోరాటం చేసిన భారత జంటే గేమ్ గెలుచుకుంది. కానీ రెండో గేమ్‌లో పుంజుకున్న జపాన్ షట్లర్లు భారత ఆటగాళ్లకు చెక్‌పెట్టారు. నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్ జంటే అదరగొట్టింది. 16-9తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత జోడీ అదే వేగంతో పాయింట్లను సాధిస్తూ మ్యాచ్‌ను గెలిచింది. మరో పురుషుల డబుల్స్ జోడీ ఎం.ఆర్.అర్జున్-ధ్రువ్ కపిలకు క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. అర్జున్-ధ్రువ్ 8-21, 14-21తో మూడు సార్లు చాంపియన్లుగా నిలిచిన మొహమ్మద్ అహసాన్-సెతియవాన్ (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

భారత్ @ 13

డబుల్స్‌లో భారత్‌కిది రెండో పతకం. మహిళల డబుల్స్‌లో ఇదివరకే (2011లో) గుత్తాజ్వాల-అశ్విని పొన్నప్ప కాంస్యం గెలుచుకుంది. ఓవరాల్‌గా అయితే ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత్‌కిది 13వ పతకం. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు స్వర్ణం సహా ఐదు పతకాలు నెగ్గగా, సైనా రజత, కాంస్య పతకాలు సాధించింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ (రజతం), లక్ష్యసేన్ (కాంస్యం), సాయిప్రణీత్ (కాంస్యం), దిగ్గజం ప్రకాశ్ పదుకొనె (కాంస్యం) పతక విజేతలుగా నిలిచారు.

ప్రపంచ చాంపియన్ లింథోయ్



సరజెవో (బోస్నియా అండ్ హెర్జిగోవినా): ప్రపంచ జూడో చాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయి లింథోయ్ చనంబమ్ సంచలనం సృష్టించింది. క్యాడెట్ విభాగంలో (57 కేజీల కేటగిరీ) ఆమె విజేతగా నిలిచింది. మణిపూర్‌కు చెందిన 15 ఏళ్ల లింథోయ్ శుక్రవారం జరిగిన ఫైనల్లో 1-0 తేడాతో రీస్ బియాంకా (బ్రెజిల్)ను ఓడించింది. 8 నిమిషాల 38 సెకన్ల పాటు సాగిన బౌట్‌లో భారత జుడోకా సత్తా చాటింది. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత జూడోకా ఒకరు ప్రపంచ చాంపియన్ కావడం ఇదే తొలిసారి. పురుషులు లేదా మహిళల విభాగాల్లో సీనియర్, జూనియర్, క్యాడెట్... ఇలా ఏ విభాగంలోనూ ఇప్పటి వరకు భారత్‌నుంచి ఎవరూ విజేతగా నిలవలేదు. గత జూలైలో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా కేడెట్ జూడో చాంపియన్‌షిప్‌లో లింథోయ్ కూడా స్వర్ణం సాధించింది.

స్టోక్స్, ఫోక్స్ సెంచరీలు

- ఇంగ్లండ్ 415/9 డిక్లేర్డ్
- తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగుల ఆధిక్యం



స్టోక్స్

మాంచెస్టర్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు కూడా ఇంగ్లండ్ జోరే కొనసాగింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (103; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), బెన్ ఫోక్స్ (113 నాటౌట్; 9 ఫోర్లు) శతక్కొట్టారు. శుక్రవారం 113 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 415 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి 264 పరుగుల ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ బ్యాటర్స్ బెయిర్‌స్టో (49; 7 ఫోర్లు), క్రాలీ (38; 5 ఫోర్లు) తొలి సెషన్లోనే పెవిలియన్ చేరినప్పటికీ మరో వికెట్ తీసేందుకు సఫారీ బౌలర్లు పడరానిపాట్లు పడ్డారు. స్టోక్స్, ఫోక్స్ ఆరో వికెట్‌కు 173 పరుగులు జోడించారు. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది. ఎర్వీ (12 బ్యాటింగ్), ఎల్గర్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

యూకీ బాంబ్రీ నిష్క్రమణ

న్యూయార్క్: ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో క్వాలిఫయింగ్ దశలోనే భారత్ పోరాటం ముగిసింది. రెండో క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ 3-6, 2-6 స్కోరుతో జిజో బెర్గ్స్ (బెల్జియం) చేతిలో ఓటమిపాలయ్యాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 552వ స్థానంలో ఉన్న యూకీ 155వ ర్యాంక్‌లో ఉన్న ప్రత్యర్థి ముందు నిలవలేకపోయాడు. ఈ టోర్నీలో ఇంతకు ముందే క్వాలిఫయింగ్ దశలో భారత ఆటగాళ్లు రామ్‌కుమార్ రామనాథన్, సుమీత్ నగాల్ ఓడిపోయారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ విజయం

ఇంఫాల్: డ్యురాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ ఎఫ్‌సీ తమ జోరును కొనసాగించింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆ జట్టు ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 3-1 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఎఫ్‌సీని ఓడించింది. హైదరాబాద్ తరఫున స్టార్ ఆటగాడు ఒగ్బెచా 64వ, 74వ నిమిషాల్లో గోల్స్ చేయగా, జావో విక్టర్ 55వ నిమిషంలో గోల్ సాధించాడు. చెన్నై జట్టునుంచి అనిరుధ్ థాపా 42వ నిమిషంలో గోల్ నమోదు చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

ప్రణయ్ జోరుకు తెర

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన జపాన్ స్టార్, టైటిల్ ఫేవరెట్ కెంటో మొమోటాపై సంచలన విజయంతో పతకం ఆశలు రేపిన హెచ్.ఎస్.ప్రణయ్ 'షో'కు క్వార్టర్ ఫైనల్లో తెరపడింది. పురుషుల సింగిల్స్‌లో చైనా ఆటగాడు జావో జున్ పెంగ్ 19-21, 21-6, 21-18తో ప్రణయ్ ఆశల్ని క్వార్టర్స్‌లోనే తుంచేశాడు. తొలి గేమ్ ఆరంభంలో బాగా ఆడిన ప్రణయ్ ఒక దశలో 19-13తో ఆధిక్యంలో ఉన్నాడు. కానీ అదే పనిగా చేసిన తప్పిదాలతో అనూహ్యంగా ప్రత్యర్థి 19-19తో పుంజుకున్నాడు. కానీ ప్రణయ్ వరుసగా రెండు పాయింట్లు చేసి గేమ్ కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో భారత ఆటగాడు పూర్తిగా నిరాశపరిచాడు. దీంతో చైనీస్ షట్లర్ 11-1తో దూసుకెళ్లాడు. అదే జోరుతో గేమ్ గెలిచాడు. మూడో గేమ్‌లో ప్రత్యర్థికి దీటుగా రాణించినప్పటికీ కీలక తరుణంలో పాయింట్లు చేసిన చైనా ఆటగాడు గేమ్‌తో పాటు మ్యాచ్ గెలిచి సెమీస్ చేరాడు. గతేడాది స్పెయిన్‌లో జరిగిన ఈవెంట్‌లోనూ ప్రణయ్ ఆట క్వార్టర్స్‌లోనే ముగిసింది.



క్లుప్తంగా

వైద్య శాఖకు సీఎం జగన్ అభినందన



సాక్షి, అమరావతి: ది ఎకనమిక్ టైమ్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన డిజిటెక్ కాన్‌క్లేవ్–2022లో పాల్గొని, ప్రజల హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో దేశంలోనే తొలి స్థానంలో నిలిచి అవార్డును అందుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ కలిశారు. రాష్ట్రానికి వచ్చిన అవార్డుని సీఎంకు చూపించారు. ఈ సందర్భంగా మంత్రి రజని, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను సీఎం జగన్ అభినందించారు.

సీఏఎస్ తుది సెలక్షన్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి : వైద్య, ఆరోగ్య శాఖలోని వైద్య విధాన పరిషత్, ప్రజారోగ్య విభాగంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా తుది సెలక్షన్ జాబితాను శుక్రవారం విడుదల చేశారు. వైద్య విధాన పరిషత్, ప్రజారోగ్య విభాగాల్లో 823 సీఏఎస్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ ఉమ్మడి నోటిఫికేషన్ విడుదల చేసింది. తొలుత ప్రాథమిక ఎంపిక జాబితాను అధికారులు ప్రకటించారు. దానిపై అభ్యంతరాలను స్వీకరించి, పరిశీలన అనంతరం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసి తుది మెరిట్ జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాను https://hmfw.ap.gov.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

13, 14 తేదీల్లో స్థానిక సంస్థల ఆదాయం పెంపుపై వర్క్‌షాప్

సాక్షి, అమరావతి : దేశవ్యాప్తంగా గ్రామీణ స్థానిక సంస్థలు సొంత ఆదాయవనరులను పెంపొందించుకునే అంశంపై చర్చించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యాన సెప్టెంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని నేషనల్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఐఆర్‌డీ అండ్ పీఆర్)లో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్రాలకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ అలోక్ ప్రేమ్ నగార్ రెండు రోజుల కిందట లేఖ రాశారు. ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్, ఇద్దరు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు చొప్పున ఆరుగురు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.

శ్రీశైలంలో ఆధార్‌తోనే ఆర్జిత సేవల టికెట్లు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లో జరిగే అన్ని ఆర్జిత సేవల టికెట్లకు ఆధార్ తప్పనిసరి చేయాలని నిర్ణయించినట్లు శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 1వ తేదీ నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆర్జిత సేవల్లో పాల్గొనే వారి ఆధార్ కార్డు మీదే టికెట్టు కొనాలని తెలిపారు. ఒక ఆధార్‌కు ఒక టికెట్టు మాత్రమే ఇస్తామన్నారు. ఆర్జిత సేవల టికెట్లు, వసతి గదులను 75 శాతం ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

శిక్షణా నైపుణ్యాలకు ప్రతీక శ్రీచైతన్య

హైదరాబాద్: దశాబ్దాల శిక్షణా నైపుణ్యాలకు శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతీక అని అకాడమీ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్‌కో ఫౌండర్ సుష్మ బొప్పన అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థలు భారతదేశంలో అతిపెద్ద రూ.1,000 కోట్ల స్కాలర్‌షిప్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న లోగోను ఇన్ఫినిటీ లెర్న్‌కో ఫౌండర్ సీమ, ప్రెసిడెంట్, సీఈవో ఉజ్వల్‌సింగ్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వారి నైపుణ్యతను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి స్కోర్ స్టెమ్ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు చాలా కలలుంటాయని వాటిని చేరుకోవడానికి నైపుణ్యతతో పాటు ఆర్థిక దన్ను కూడా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు స్కాలర్‌షిప్ పరీక్ష తీసుకొచ్చిందని తెలిపారు. గతేడాది 5 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ పరీక్ష రాయగా ఇప్పుడు 10 లక్షల మంది రాసేందుకు ముందుకొస్తారని ఆశిస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్‌లను పొందాలనుకునే వారికి స్కోర్ స్టెమ్ చాలెంజ్ స్కాలర్‌షిప్–2022 ఒక గొప్ప అవకాశమన్నారు. పరీక్షను సెప్టెంబర్ 5న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌కు అర్హులైన వారిలో జయేశ్, నిరీక్ష, సాయి నిఖిత్, అయేషా, ప్రతీక్ ఉన్నారన్నారు.

అస్త్ర పరీక్షల కేంద్రంగా విశాఖ

- సాగర నగరిలో సాగర గర్భంలో ప్రయోగించే ఆయుధాల పరీక్షా కేంద్రం నిర్మాణం
- క్షిపణులు, రాకెట్ల పరీక్షా కేంద్రం కూడా..
- భీమిలిలో స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీ సెంటర్
- భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌కు బాధ్యతలు

(కె.జి.రాఘవేంద్రారెడ్డి – సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

నౌకాదళ ఆయుధ పరీక్షలకు విశాఖ కేంద్ర బిందువుగా మారనుంది. ప్రధానంగా సముద్రంలో జరిగే యుద్ధాల్లో వినియోగించే ఆయుధాల పరీక్షా కేంద్రాన్ని రక్షణ శాఖ నెలకొల్పుతోంది. ఇలాంటి కేంద్రం దేశంలో విశాఖలోనే ఏర్పాటు కానుండటం గమనార్హం. అలాగే క్షిపణులు, రాకెట్ల పరీక్షా కేంద్రం కూడా ఇక్కడ నిర్మితమవుతోంది. భారీ టార్పెడోల పరీక్షలకూ ఈ కేంద్రాన్ని వినియోగించుకునే వీలుంది. తీర ప్రాంత రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఈఎన్‌సీ (ఈస్టర్న్ నేవల్ కమాండ్) స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన నౌకలతో పాటు విదేశాల నుంచి కొనుగోలు చేసిన యుద్ధ నౌకలతో ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది.

భీమిలిలో క్షిపణులు, రాకెట్ల పరీక్ష కేంద్రం

ఇప్పటికే యుద్ధ నౌకలు, సబ్ మెరైన్ల స్థావరంగా ఉన్న విశాఖ తీరం తాజాగా మరో రెండు ముఖ్యమైన రక్షణ వ్యవస్థలకు కేంద్రంగా మారుతోంది. దేశంలోనే తొలిసారిగా భారీ టార్పెడోలు, అండర్ వాటర్ వెపన్స్ పరీక్ష కేంద్రాన్ని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) నిర్మించనుంది. భీమిలిలో అన్ని రకాల క్షిపణులు, రాకెట్లను పరీక్షించే కేంద్రం ఏర్పాటుకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా ఇటీవల శంకుస్థాపన చేశారు.



ఎస్‌టీఎఫ్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా

రెండు టన్నుల భారీ టార్పెడోలను సైతం...

గత జూలైలో గుజరాత్ తీరంలోని భారత సముద్ర జలాల పరిధిలోకి పాకిస్థాన్‌కు చెందిన యుద్ధనౌక (పీఎన్ఎస్ అలంగీర్) చొచ్చుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. మన నౌకాదళాలు వెంటనే గుర్తించడంతో పాకిస్థాన్ పాచికలు పారలేదు. మహారాష్ట్ర తీర ప్రాంతంలో కూడా ఓ విదేశీ చిన్న పడవ ఆయుధాలతో వచ్చింది. అయితే అది ఆస్ట్రేలియన్ దంపతులదని తేలింది. తీర రక్షణ ఎంత కీలకమన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తూర్పు నౌకాదళ కేంద్రంగా ఉన్న విశాఖ తీరంలో ఎన్విరాన్‌మెంటల్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు బాధ్యతను ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా బీడీఎల్‌కు అప్పగించారు. ఇప్పటికే టార్పెడోలు, అండర్ వాటర్ వెపన్స్ తయారీ యూనిట్‌ను భారత్ డైనమిక్స్ విశాఖలోనే ఏర్పాటు చేసింది. అయితే వాటిని పరీక్షించే కేంద్రం లేకపోవడంతో దాన్ని కూడా విశాఖలోనే ఏర్పాటు చేయాలని నౌకాదళం నిర్ణయించింది. దీనిలో భాగంగా 8 మీటర్ల పొడవు, 2 టన్నుల బరువైన భారీ టార్పెడోల్ని సైతం ఈ టెస్టింగ్ సెంటర్‌లో పరీక్షించేలా అత్యాధునిక వైబ్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. థర్మల్ చాంబర్, వాకింగ్ చాంబర్లను ఏర్పాటు చేసి అండర్ వాటర్ వెపన్స్‌నూ అణువణువూ పరీక్షించేలా యూనిట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం

వైబ్రేషన్ టెస్ట్‌లతో పాటు పర్యావరణహిత పరీక్షలు కూడా ఇందులో నిర్వహించేలా ఏర్పాటవుతున్న ఈ పరీక్ష కేంద్రం నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో అండర్‌వాటర్ వెపన్స్, టార్పెడోల్ని మిత్ర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం లభిస్తుంది. క్రమంగా టార్పెడోలతో పాటు ఉపరితలం నుంచి గగన తలానికి ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలతో పాటు గగనతలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే ఆయుధాలు, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్‌నూ ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుంటుందని ఈ సందర్భంగా నౌకాదళాధికారులు భావిస్తున్నారు.

ఇతర ప్రయోగాలకూ వేదికగా భీమిలి

సముద్ర గర్భంలో ఆయుధాలతో పాటు రాకెట్లు, క్షిపణులనూ పరీక్షించేందుకు వీలుగా భీమిలిలో స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతోంది. ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని కన్‌స్ట్రక్షన్ ఆఫ్ నేవల్ ఆర్నమెంట్ టెస్టింగ్ కాంప్లెక్స్(సీఎన్ఏఐ)– ఈస్ట్ కాంప్లెక్స్‌లో దీన్ని నిర్మించేందుకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా కొద్దిరోజుల కిందట శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4.40 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. అన్ని రకాల క్షిపణులు, రాకెట్లను పరీక్షించడంతో పాటు వాటి జీవితకాలాన్ని పొడిగించేలా మార్పులు, ఇతర ప్రయోగాలకు వేదికగా భీమిలి మారనుంది.

తూర్పు నౌకా దళ సంపత్తి


ఏర్పాటైన సంవత్సరం	1968 మార్చి 1
కమాండింగ్ ఇన్ చీఫ్	త్రీ స్టార్ ఫ్లాగ్ ఆఫీసర్ (వైస్ అడ్మిరల్ ర్యాంక్)
ప్రస్తుత వైస్ అడ్మిరల్	బిస్వజిత్ దాస్‌గుప్తా
బలం	58 యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు
ఫ్లాగ్ షిప్	ఐఎన్ఎస్ జలశ్వ
ఈఎన్‌సీ పరిధిలో నేవల్ బేస్‌లు	15
విశాఖలో నేవల్ బేస్‌లు	8
కొత్తగా నిర్మిస్తున్న నేవల్ బేస్‌లు	విశాఖలో–1, ఒడిశాలో 2
తూర్పు నౌకాదళం సిబ్బంది, అధికారులు	సుమారు 40,500 మంది



తయారు చేసిన టార్పెడోలు

ఏడాదిలో కట్టేస్తాం..

- చంద్రబాబు ఒప్పందాలకు అసలు, వడ్డీ కడుతున్న డిస్కంలు
- ప్రస్తుతం ఈ భారం రూ.7 వేల కోట్లు
- ఎల్‌పీఎస్ ద్వారా 12 నెలల వాయిదాల్లో చెల్లించనున్న డిస్కంలు



సాక్షి, అమరావతి: స్వప్రయోజనాల కోసం గత ప్రభుత్వం చేసిన తప్పులకు నేటికీ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కప్పం కడుతూనే ఉన్నాయి. తమకు అవసరం లేకపోయినా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అసలు, వడ్డీ చెల్లిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న బకాయి దాదాపు రూ.7 వేల కోట్లను ఏడాదిలోగా చెల్లించేస్తామంటూ ముందుకొచ్చాయి. మాట నిలబెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేట్ పేమెంట్ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్) పథకంలో చేరి 12 నెల వాయిదాల్లో ప్రతి నెలా దాదాపు రూ.600 కోట్లు చెల్లించేందుకు అంగీకరించాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు నచ్చిన కంపెనీలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. వీటికి ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో యూనిట్‌కు రూ.1.1 చెల్లించాల్సి వచ్చింది. పవన విద్యుత్‌ను యూనిట్ ఏకంగా రూ.4.84కు తీసుకున్నారు. ఫిక్స్‌డ్ చార్జీతో కలిపి రూ.5.94 పడింది. అప్పట్లో సౌరవిద్యుత్ యూనిట్ రూ.3.54కు బదులు రూ.8.90 వెచ్చించారు. ఇలా దాదాపు ఏడువేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల మన విద్యుత్ సంస్థలపై ఏటా అదనంగా రూ.3,500 కోట్లు భారం పడుతోంది. నిజానికి రెన్యూవబుల్ పవర్ పర్చేస్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీపీవో) నిబంధనల ప్రకారం మొత్తం విద్యుత్‌లో పునరుత్పాదక విద్యుత్‌ను 5 నుంచి 11 శాతం తీసుకోవాలి. కానీ టీడీపీ ప్రభుత్వం ఏకంగా 23 శాతం పునరుత్పాదక విద్యుత్‌ను అత్యధిక ధరలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంది.

మిగులు విద్యుత్ వృథా చేసి..

2014–19 మధ్య దేశ వ్యాప్తంగానూ, మన రాష్ట్రంలోను మిగులు విద్యుత్ ఉండేది. రాష్ట్రంలో 2015–16లో విద్యుత్ డిమాండ్ 54,225 మిలియన్ యూనిట్లు ఉండగా ఉత్పత్తి 54,867 మిలియన్ యూనిట్లు. ఆ ఏడాది 642 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులుగా ఉంది. 2016–17లో 10,500 మిలియన్ యూనిట్లు, 2017–18లో 12,000 మిలియన్ యూనిట్లు, 2018–19లో 7,600 మిలియన్ యూనిట్ల మిగులు విద్యుత్ రాష్ట్రంలో ఉండేది. 2017–19 మధ్య రూ 2.40కు లభిస్తున్న బొగ్గు ఆధారిత ఈ మిగులు విద్యుత్‌ను బ్యాక్‌డౌన్ (వృథా) చేసి పీపీఏల ద్వారా అధికధరలు చెల్లించి కొనుగోలు చేశారు.

భవిష్యత్‌లో ఇలాంటి భారం లేకుండా..

చంద్రబాబు గద్దెదిగేటప్పుడు రూ.2,300 కోట్ల పీపీఏ బకాయిలను కొత్త ప్రభుత్వానికి అంటగట్టి వెళ్లారు. భారీ ధరలకు పీపీఏలు ఉండటంతో వాటిని సవరించాలంటూ డిస్కంలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అప్పుడు యూనిట్‌కి రూ.2.43 పైసల చొప్పున ప్రస్తుతానికి చెల్లించమని చెప్పిన కోర్టు తుది తీర్పులో ఒప్పందం మేరకు ఇమ్మని చెప్పింది. దీంతో పీపీఏ ప్రకారం చెల్లించాల్సిన ధరకు, చెల్లిస్తున్న ధరకు మధ్య వ్యత్యాసం ఏర్పడింది. ఫలితంగా ప్రస్తుతం చెల్లించాల్సిన పీపీఏ బకాయిలు వడ్డీతో కలిపి రూ.ఏడువేల కోట్లకు చేరాయి. ఈ మొత్తాన్ని ఏడాదిలోగా నెలవారీ వాయిదాల్లో కట్టేస్తామని డిస్కంలు ప్రకటించాయి. ఇలాంటి పరిస్థితి భవిష్యత్‌లో రాకూడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో యూనిట్ కేవలం రూ.2.49 పైసల ధరకే ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది.

> **అప్పటి అప్పులు చెల్లిస్తున్నాం**
>
> గతంలో అధిక ధరలకు జరిగిన పీపీఏల వల్ల డిస్కంల అప్పులు పెరిగాయి. అయినప్పటికీ వాటిని సకాలంలో చెల్లించేందుకు మేం మార్గాలను అన్వేషిస్తూనే ఉన్నాం. దాన్లో భాగంగానే ఎల్‌పీఎస్‌లో డిస్కంలు చేరాయి. అదేవిధంగా డిస్కంలపై అనవసర పీపీఏల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తక్కువ ధరకు 'సెకీ'తో ఒప్పందం చేసుకుంది.
>
> – కె.విజయానంద్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

సీఎం జగన్‌కు ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

'ఈహెచ్‌ఎస్'ను బలోపేతం చేయడంపై సంతోషం



సాక్షి, అమరావతి : ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్(ఈహెచ్ఎస్) పరిధిలోకి కొత్తగా 565 చికిత్సలు చేర్చడం, నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రతి నెలా 20–25 తేదీల్లోగా ఆటో డెబిట్ విధానంలో బిల్లులు చెల్లింపు సహా.. పథకాన్ని బలోపేతం చేస్తూ పలు అంశాలకు ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ హెల్త్ కార్డులు నేటికీ అనేక మంది ఉద్యోగులకు అందలేదని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈహెచ్‌ఎస్ కింద వైద్యం అందించేందుకు నిరాకరించే నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఫిర్యాదుకు ప్రత్యేక యాప్‌ను తీసుకు రావాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ హెల్త్ చెకప్ చేయించాలని, అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో క్రానిక్ ఓపీపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటిపై సీఈవో సానుకూలంగా స్పందించారు. ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆల్ఫ్రెడ్, క్లాస్ ఐవీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ స్క్రీనింగ్‌పై అర్బన్ హెల్త్ క్లినిక్స్ సిబ్బందికి శిక్షణ

సాక్షి, అమరావతి : హెచ్ఐవీ నియంత్రణ, నివారణను మరింత సమర్థంగా చేపట్టడానికి వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీ శాక్స్) ఏపీడీ డాక్టర్ ఉమా సుందరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. హెచ్ఐవీ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించడం కోసం రాష్ట్రంలోని అన్ని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. టెస్ట్ కిట్‌లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోల్డ్ చైన్ మేనేజ్‌మెంట్ గురించి ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇక కుప్పంలోనే ఉంటా..

మా వాళ్లలో ఒకరిపై చేయివేసి తిరిగివెళ్లు చూద్దాం జగన్‌రెడ్డీ..

- రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సర్వనాశనమైంది
- డీజీపీ పనికిమాలిన వ్యక్తి
- నేనొస్తే సంక్షేమ పథకాలు రద్దుచేయను.. పెంచేస్తాను
- కుప్పం కాదు.. పులివెందులలో గెలుపు చూద్దాం
- కుప్పం జనం గుండెల్లో టీడీపీ జెండా ఉంది
- మూడోరోజు పర్యటనలో చంద్రబాబు

సాక్షి, చిత్తూరు/కుప్పం : 'ఏం జగన్‌రెడ్డి ఎక్కడున్నావు? నేనిక్కడే ఉంటా.. రౌడీలు తెస్తావో.. పుంగనూరు పుడింగుతో వస్తావో? మా వాళ్లలో ఒకరిపై చేయివేసి తిరిగివెళ్లు చూద్దాం..' అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు సవాల్ చేశారు. 'నా కటౌట్‌లు తొలగిస్తారా? నేను కుప్పానికి రాకుండా నాపైనే దాడి చేయిస్తారా? భయం ఉందా? సిగ్గుందా?.. నేను అనుకుని ఉంటే నువ్వు సుదీర్ఘ పాదయాత్ర చేసేవాడివా?'.. అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన మూడ్రోజుల పర్యటనలో భాగంగా చివరిరోజు శుక్రవారం కుప్పంలోని మోడల్ కాలనీ, కృష్ణదానపల్లి, యానాదిపల్లి, జరుగు గ్రామం, గుడ్లనాయనపల్లి, గుడిపల్లి మండలంలోని ఓఎన్ కొత్తూరులో ఆయన రోడ్‌షో జరిగింది. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ఆయన మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సర్వనాశనమైంది. ధర్మం, చట్టం ప్రకారం పనిచేయడంలేదు. బ్రిటీషు వాళ్లకు, పోలీసులకు తేడా ఏముంది? పోలీసుల కంటే బ్రిటీషు వాళ్లే నయం. డీజీపీ పనికిమాలిన వ్యక్తి. రౌడీలతో నాపైనే దాడి చేయిస్తారా? సీఎం, డీజీపీ, ఎస్పీ సమాధానం చెప్పాలి. రాష్ట్రంలో ఉన్మాది పాలన కొనసాగుతోంది. అందుకు పోలీసు వ్యవస్థ సంపూర్ణంగా సహకరిస్తోంది. పోలీసుల వేషంలో రౌడీలు వచ్చి టీడీపీ వారిపై దాడులు చేశారు. ఉత్తర కొరియా నియంత కిమ్ తరహాలో ఏపీ సీఎం జగన్‌రెడ్డి జూనియర్ కిమ్‌లా తన పాలన సాగిస్తున్నారన్నారు. నాడు ఎందరో మహనీయులు జైలుకుపోతేనే, ఆస్తులు పోగొట్టుకుంటేనే స్వాతంత్ర్యం వచ్చింది. అదే తరహాలోనే ప్రజలు కూడా తిరగబడాలి. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డికి ఇదే ఆఖరిచాన్స్. ఏడాది తర్వాత వచ్చేది టీడీపీ ప్రభుత్వమే. అప్పుడు జగన్‌రెడ్డి కథ చూస్తా.

నేనొస్తే సంక్షేమ పథకాలు పెంచేస్తా..

గతంలో నేను సీఎంగా ఉన్నప్పుడు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలుచేశా. వాటిని ప్రస్తుత ప్రభుత్వం రద్దుచేసింది. అయితే, నేను మళ్లీ సీఎం కాగానే సంక్షేమ పథకాలు రద్దుచేయకుండానే పెంచుతాను. మద్యం మీద వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. రాష్ట్రం ఏమైనా మీ తాత జాగీరా? ఈ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టింది. అసలు నా హయాంలోనే కుప్పం అభివృద్ధి జరిగింది. దీనిని మరింత అభివృద్ధిచేసే బాధ్యత కూడా నాదే. ఇక నిత్యావసర సరుకులైన పప్పు, ఉప్పు, బియ్యంతోపాటు పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలపై బాదుడే బాదుడు.. ప్రజలకు ఇచ్చిందెంత? దోచిందెంత? గృహ నిర్మాణాలు అంటూ వేలకోట్లు దోచుకున్నారు. ఈసారి కుప్పం కాదుకదా పులివెందుల్లోనైనా గెలుపు చూద్దాం. కుప్పం జనం గుండెల్లో టీడీపీ జెండా ఉంది. దాన్ని ఎవ్వరూ వేరు చేయలేరు. ఈ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది. ఎప్పుడు కూలిపోతుందో? ఎప్పుడు ఎన్నికలకు వస్తారో తెలీదు. ఇదిలా ఉంటే.. మోడల్ కాలనీలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా అదే సమయంలో అక్కడున్న మసీదులో నమాజు మొదలైంది. దీంతో బాబు తన ప్రసంగానికి విరామమిస్తూ.. నమాజు మొదలైందని అనబోయి మసాజుగా పలికారు.

కుప్పం కూలుతోందనే చంద్రబాబు భయం

వచ్చే ఎన్నికల్లో అక్కడ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- మూడ్రోజులుగా కుప్పంలో బాబు ప్రవర్తనతో స్పష్టం
- కుప్పంపై ఆయనకు ఉన్నది ప్రేమ కాదు.. అవసరం
- 30 ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదు
- మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి, అమరావతి: కుప్పం కూలుతోందనే భయం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు పట్టుకుందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గత మూడ్రోజులుగా కుప్పంలో ఆయన ప్రవర్తనను చూస్తుంటే ఈ విషయం స్పష్టమవుతోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలోనూ టీడీపీ జెండాను ప్రజలు పీకేయడం ఖాయమన్నారు. అక్కడ వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలవడం తథ్యమని తేల్చి చెప్పారు. చంద్రబాబు అరుపులు, కేకలు చూస్తుంటే ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లుందన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుప్పంలో చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరును ఏకిపారేశారు. 1989 నుంచి 2019 వరకూ కేబినెట్ ర్యాంకు స్థాయి పదవుల్లో ఉన్న చంద్రబాబు కుప్పంను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కానీ గత మూడేళ్లుగా పదే పదే కుప్పంలో పర్యటిస్తున్నారని గుర్తు చేశారు. కుప్పం అంటే చంద్రబాబుకు ప్రేమా? భయమా? అని ప్రశ్నించారు. చంద్రబాబు డిక్షనరీలో ప్రేమ, అనురాగం అనే పదాలు ఉండవు కాబట్టి.. కుప్పం అంటే ఆయనకు భయమేనని ఎద్దేవా చేశారు. కుప్పంలో 1989 నుంచి ప్రతి ఎన్నికలోనూ గెలుస్తూ వస్తున్న టీడీపీ.. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఘోరంగా ఓడిపోతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మిగతా 174 స్థానాలతోపాటూ కుప్పం కూడా చేజారిపోతుందన్న భయంతోనే చంద్రబాబు అక్కడ పదే పదే పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ మూకలను ఉసిగొల్పుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాటకాలను కుప్పం ప్రజలు గమనిస్తున్నారని.. తగిన రీతిలో బుద్ధిచెప్పడానికి సిద్ధమయ్యారని చెప్పారు. మంత్రి అంబటి రాంబాబు ఇంకా ఏమన్నారంటే..

కుప్పంతో బాబుకు 'అవసర' బంధమే..

చంద్రబాబు 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్రగిరి నుంచి పోటీ చేశారు. టీడీపీ ఆవిర్భవించాక 1983లో మామ ఎన్టీఆర్‌పైనే పోటీ చేస్తానని బీరాలు పలికి.. చంద్రగిరిలో ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీలో చేరిపోయారు. 1985లో ఎన్టీఆర్ టికెట్ ఇవ్వలేదో ఏమో చంద్రబాబు పోటీ చేయలేదు. చంద్రగిరిలో ఇక గెలవలేమని 1989లో కుప్పంకు వలస వెళ్లారు. 1989 నుంచి 2019 వరకూ అక్కడ నుంచి గెలిచారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా.. మిగతా 16 ఏళ్లు కేబినెట్ ర్యాంక్ పదవుల్లో చంద్రబాబు ఉన్నారు. కానీ.. కుప్పం అభివృద్ధికి చేసిందేమీ లేదు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. కులమతవర్గ ప్రాంతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. దీంతో కుప్పం ప్రజలు పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించారు. చంద్రబాబు కుప్పంలో ఇల్లు కూడా కట్టుకోలేదు.. ఇప్పటికీ అక్కడికి వెళ్తే అతిథి గృహంలోనే ఉంటారు. కుప్పంతో చంద్రబాబుకు ఉన్నది రాజకీయ బంధం, ప్రేమ బంధం కాదు.. 'అవసర' బంధమే.

దాడులకు ఉసిగొల్పింది బాబే..

కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు టీడీపీ మూకలను ఉసిగొల్పడంతో వారు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై ఉన్న జెండాలను పీకేసి దాడులు చేశారు. దాంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిస్పందించారు. వాస్తవం ఇదైతే.. ఎల్లో మీడియాలో వైఎస్సార్‌సీపీ దాడులు చేసినట్లు అభూతకల్పనలు ప్రచారం చేస్తున్నారు. మిగతా సమాచార మాధ్యమాల ద్వారా వాస్తవాలు తెలుసుకున్న ప్రజలు చంద్రబాబు నాటకాలను ఛీకొడుతున్నారు. కుప్పం కూలిపోతుండటాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు.. సీఎం వైఎస్ జగన్‌ను, డీజీపీ, ఎస్పీలను దూషిస్తున్నారు. పులివెందులకు వస్తా.. ఎలా గెలుస్తావో చూస్తా అంటూ సీఎంను సవాల్ చేస్తున్నారు. కుప్పంలో పీకల్లోతు కూరుకుపోయిన మీరు.. పులివెందులకు వెళ్లి ఏం చేస్తారు?

ప్రజల దృష్టిని మరల్చేందుకే బాబు నాటకాలు

మంత్రి రోజా ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: కుప్పం కోట కూలిపోతోందన్న భయంతోనే చంద్రబాబు టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు తెగబడుతున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోజా మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌కు సంక్షేమ పథకాలతో ప్రజల్లో మంచి పేరు వస్తుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. మొన్నటివరకు ఓ ఫేక్ వీడియోతో నాటకాలు ఆడితే.. నిన్న కుప్పంలో వీధి నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. ఎప్పుడైతే కేంద్ర మంత్రి అమిత్ షా.. జూనియర్ ఎన్టీఆర్‌ను కలిసి మాట్లాడారో అప్పటి నుంచి చంద్రబాబులో వణుకు మొదలైందన్నారు. బాలకృష్ణ.. ఎన్టీఆర్ ఆరోగ్య రథాన్ని బాబు ఫొటో లేకుండా ప్రారంభించడంతో పిచ్చిపట్టినట్టు వ్యవహరిస్తున్నారని చెప్పారు. బాబును పిచ్చాస్పత్రిలో చేర్పించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.